

శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 66 | మంగళవారం | 03-02-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## మార్ఫింగ్ కేసు వివరాలివ్వండి

సిఎం ఫొటోను మార్ఫింగ్‌ను తీవ్రంగా పరిగణించాలని హైకోర్టు అభిప్రాయపడింది. మార్ఫింగ్ చట్ట వ్యతిరేకమని సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేసింది. సిఎం రేవంత్‌రెడ్డి మార్ఫింగ్ ఫొటో పోస్టు చేశారంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన కావలి వెంకటేష్‌పై నమోదైన కేసుపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని మద్దూర్ పిఎస్ ఎస్‌హెచ్ఒ, ఫిర్యాదు దారు నర్సింహకు జస్టిస్ శ్రీనివాసరావు నోటీసులు ఇచ్చారు విచారణ ఈ నెల 11కు వాయిదా వేశారు.



సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



## అక్రమమార్గాలు ఎంచుకుంటే ఎవరికైనా

# విచారణ తప్పదు




- ప్రజాస్వామ్య బద్ధంగా నేరాలను విచారించవద్దని రాజ్యాంగంలో ఎక్కడా లేదు
- మాజీ సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్య
- 'జాతిపిత' అని వాళ్లకు వాళ్లే రాసుకుంటున్నారు
- శిబూసోరెన్‌తో పాటు లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత, యెడ్యూరప్ప కూడా విచారణ ఎదుర్కొన్నారు
- పేదల కోసం 500 ఎకరాల భూమిని ప్రజలకు పంచిపెట్టిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి
- 60 ఏళ్ల వచ్చాక ఆయన రాజకీయ పదవులను వదులుకున్నారు
- కెసిఆర్ ఏం త్యాగం చేశారు
- పదవులను వారి కుటుంబం పంచుకుంది
- వేల కోట్లు సంపాదించుకున్న వాళ్లు జాతిపిత ఎలా అవుతారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలదీత

**సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానం**

ప్రజాపక్షం/హైదరాబాద్

అధికారంలో ఉండి అక్రమమార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్య బద్ధంగా విచారణ ఎదుర్కోక తప్పదని, నేరాలను విచారించ వద్దని రాజ్యాంగంలో ఎక్కడా లేదని ప్రధాన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. జార్ఖండ్ రాష్ట్రం కోసం పోరాడిన శిబూసోరెన్‌తో పాటు లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత, యెడ్యూరప్పలు విచారణ ఎదుర్కోలేదా? అని గుర్తు చేశారు. సిట్ విచారణ నేపథ్యంలో బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. పేద ప్రజల కోసం ఉద్యమాలు నిర్మించిన రావి తరువాయి 2లో


పద్మవిభూషణ్ రావి నారాయణ రెడ్డి

## అపరిమితమైన భావ ప్రకటనస్వేచ్ఛ

## ఎక్కడా అనుమతి లేదు

- జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి స్పష్టీకరణ
- 'భారత రాజ్యాంగం- భావప్రకటన స్వేచ్ఛ' అంశంపై రావి నారాయణరెడ్డి స్మారకోపన్యాసం చేసిన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి
- యుగ పురుషుడు 'రావి' అవార్డు నాకు ఎంతో ప్రత్యేకతని వెల్లడి



ఏ దేశంలోనూ, ఏ రాజ్యాంగలోనూ అపరిమితమైన భావ ప్రకటన స్వేచ్ఛను అనుమతించలేదని, ఇందుకు హామీ కూడా ఇవ్వలేదని జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు అని, అదే సమయంలో స్వీయ నియంత్రణ కూడా ఉండాలని హెచ్చరించారు. స్వీయ నియంత్రణ పాటించకపోతే ప్రభుత్వమే రంగ ప్రవేశం చేస్తుందని, ముఖ్యమంత్రి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని, అప్పుడు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి ఘటన ప్రమాదకరాన్ని కొనితెచ్చుకోవడమేనని, అదే సమయంలో ప్రభుత్వానికి కూడా పరిమితులు ఉంటాయని హితవు పలికారు.పద్మవిభూషన్ రావి నారాయణ స్మారక జాతీయ అవార్డును సిఎం చేతుల మీదుగా జస్టిస్ తరువాయి 2లో



## ప్రజలు కోరుకున్న మార్పు చూపించాం

- సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన
- ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దడం ద్వారా ప్రజలు కోరుకున్న మార్పు చూపించి వారి విశ్వాసాన్ని నిలబెట్టుకున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరువాయి 12లో

# లోక్‌సభలో రగడ

- ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంలోని అంశాన్ని ప్రస్తావించిన రాహుల్‌గాంధీ
- రాజ్‌నాథ్, అమిత్‌షా అభ్యంతరం

**న్యూఢిల్లీ :** భారత్‌-చైనా మధ్య 2020లో నెలకొన్న లద్ధాఖ్ ప్రతిష్టంభనపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించి ఒక మ్యాగజైన్ ప్రచురించిన కథనాన్ని కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించారు. దీంతో సభలో గందరళగోళం ఏర్పడింది. రాహుల్ ప్రస్తావిస్తున్న పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు సభను తప్పుదారి పట్టించారని ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాహుల్‌గాంధీ మాట్లాడారు. ముందుగా జాతీయవాదంపై కాంగ్రెస్‌పై గత స్పీకర్, బిజెపి ఎంపి తేజస్వి సూర్య చేసిన ఆరోపణలకు తాను మొదట స్పందించాలనుకుంటున్నానన్నారు. అదే విధంగా 2020లో జరిగిన భారతదేశంచైనా వివాదం గురించి జనరల్ నరవాణే 'జ్ఞాపకార్థం'లో పేర్కొన్న దాని నుండి రాహుల్ కొన్ని వ్యాఖ్యలను ఉటంకించే ప్రయత్న చేశారు. అయితే, రాజ్‌నాథ్ సింగ్ దీనిని తీవ్రంగా నిరసిస్తూ, పుస్తకం ప్రచురించబడిందా లేదా అని స్పష్టం చేయాలని రాహుల్‌గాంధీని కోరారు. సభ కార్యకలాపాలకు సంబంధం లేని విషయంపై ఏ పుస్తకం లేదా వార్తాపత్రిక క్లిప్పింగ్‌ను ఉటంకించలేమని స్పీకర్ ఓం బిర్లా పదే పదే చెప్పడంతో, ఆ పత్రం ప్రామాణీకరించబడిందని, దాని నుండి తాను కోట్ చేయగలనని గాంధీ పట్టుబట్టడంతో దాదాపు 50 నిమిషాల పాటు గందరగోళం చెలరేగింది. ప్రభుత్వ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... రాహుల్‌గాంధీ చైనాపై 'కల్పిత విషయాలు' చదువుతున్నాడు. భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తరువాయి 2లో



## భద్రతపై మాట్లాడనీయరేం?

దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని లోక్‌సభలో లేవనెత్తేందుకు ప్రభుత్వం అనుమతించడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడుతోందనేవి తాను చెప్పే మాటలు కాదని.. స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాశారని అన్నారు. ఈ పుస్తకం బయటకు వస్తే అసలు విషయాలు ప్రజలకు తెలిసిపోతాయనే భయంతో ఆ పుస్తక ప్రచురణను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. లోక్‌సభ వాయిదా పడిన అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలన్నీ చెబుతాననే భయంతో తనను మాట్లాడనీయకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు.




## హైదరాబాద్ టు బెంగుళూరు

# ఇక 2 గంటలే

- రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రికార్డు స్థాయిలో నిధుల కేటాయింపు
- 2026- 27కు రూ.5,454 కోట్ల మంజూరు
- హైదరాబాద్ నుంచి మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు
- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లో రికార్డు స్థాయిలో నిధులు కేటాయించిందని,2026–27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణకు రూ.5,454 కోట్ల రైల్వే బడ్జెట్ మంజూరైనట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లోని రైల్వే కేటాయింపులపై సోమవారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. ఈ సమావేశానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తరువాయి 12లో



## పత్తి కొనుగోళ్లలో కుంభకోణం

- 37 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్‌ల సస్పెన్షన్
- కొనుగోళ్ల వ్యవహారంలో మార్కెటింగ్ శాఖ చర్యలు

ప్రజాపక్షం/హనుమకొండ

సిసిఐ గత సంవత్సరం తాత్కాలిక రిజిస్ట్రేషన్ కొనుగోళ్ల వ్యవహారంలో మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లపై వేటు వేశారు. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో గతంలోనే వరంగల్ మార్కెట్‌తో సహా ఏడుగురు కార్యదర్శులను సస్పెండ్ చేయగా ప్రభుత్వం మరో 37 మంది డిఎఒలను సస్పెండ్ చేయడం ఆ శాఖలో ప్రకంపనలు సృష్టిస్తుంది. గత సంవత్సరం విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించిన ప్రభుత్వం ఆశాఖ వివరాలు ఇవ్వడంతో మరో 17 మంది కార్యదర్శులకు కూడా నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. గత సంవత్సరం సిసిఐ పత్తి కొనుగోళ్ల సమయంలో మార్కెట్‌లో తాత్కాలిక పర్మిషన్లను ఇచ్చారు. రైతుల పేరుమీద అధికారులు, దళారులు ఈ కొనుగోళ్లను చేశారు. ఈ వ్యవహారంలో వరంగల్ తరువాయి 2లో



02

## ఎన్నికల్లో పోటీ కోసం కూతుర్ని చంపిన తండ్రి

- ముగ్గురు పిల్లలు ఉంటే అనర్హత వేటు పడుతుందనే ఘాతుకం
- నిందితుల అరెస్టు
- నిజామాబాద్ జిల్లాలో ఘటన

## అలీ ఖమేనీ హెచ్చరిక నిజమో కాదో తేల్చుకుంటాం

**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్**



**పామ్‌బీచ్ :** ఇరాన్‌పై దాడి చేస్తే అది ప్రాంతీయ యుద్ధంగా మారుతుందని అయొతొల్లా అలీ ఖమేనీ ఫిబ్రవరి ఒకటో తేదీన చేసిన హెచ్చరికపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో అణుఒప్పందం కుదురుతుందని తాము ఆశాభావంతో ఉన్నామని, ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఖమేనీ చేసిన హెచ్చరిక నిజమో కాదో తేల్చుకుంటామన్నారు. సోమవారం ఉదయం ఆయన పామ్‌బీచ్‌లోని మార్ ఏ లాగో నివాసంలో పాత్రికేయులతో మాట్లాడారు. అమెరికా వద్ద ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన, అతిపెద్ద యుద్ధ నౌకలు ఉన్నాయని, ఈ నౌకలను ఇప్పటికే అరేబియా సముద్రంలో మోహరించి ఉన్నాయని, ఇరాన్‌కు కొద్ది గంటల తరువాయి 12లో



చైనాలో మరో నలుగురు

# మాఫియా నేరస్థులకు ఉరిశిక్ష

**బీజింగ్:** మయన్మార్ కేంద్రంగా చేసుకున్న చైనా ఈశాన్య సరిహద్దు ప్రాంతాలలో అనేక నేరాలకు పాల్పడుతున్న బాయి కుటుంబానికి చెందిన పేరుమోసిన నలుగురు నేరస్థులకు చైనా ప్రభుత్వం సోమవారం ఉరిశిక్ష అమలు చేసింది. దీంతో వారం రోజుల వ్యవధిలోనే ఈ విధంగా ఉరిశిక్షకు గురైనా మాఫియా ముఠా కుటుంబీకుల సంఖ్య 15కు చేరుకుంది. ఉద్దేశపూర్వక హత్యలు, టెలికాం మోసాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వ్యభిచార గృహాల నిర్వహణ, బెదిరింపులు, కేసినో, జూద గృహాల నిర్వహణ వంటి కేసులో గత ఏడాది నవంబరులో విచారణ సందర్భంగా వీరందరినీ నేరస్థులుగా నిర్ధారించారు. కాగా ఈ కేసులలో మరో ప్రధాన నేరస్థుడు బాయి సుయోచెంగ్ తీవ్ర ఆనారోగ్యం కారణంగా సోమవారం మరణించాడని జిన్హువా వార్తాసంస్థ ప్రకటించింది. ఇతడితోపాటు బాయి ఇంగ్‌కాంగ్, యాంగ్ లికియాంగ్, హూ జియావో జియాంగ్, చెన్ గువాంగీలకు మరణశిక్ష విధించగా వీరిలో సుయోచెంగ్ అనారోగ్యంతో మరణించాడు. మిగిలినవారిని ఉరి తీశారు. గాంగ్‌డాంగ్ రాష్ట్రంలోని షెన్‌ఝెన్ ఇంటర్మీడియట్ పీపుల్స్‌కోర్టు వారిని విచారించి శిక్షలు విధించింది. జనవరి 29వ తేదీన మొదటి విడతగా 11 మందికి ఉరిశిక్షలు అమలు చేశారు. చైనా–మయన్మార్ మధ్య 2,129 కి.మీ పొడవునా సరిహద్దులున్నాయి. ఈ సరిహద్దు ప్రాంతాల్లో మింగ్, బాయి కుటుంబాలవారు హత్యలు, అక్రమాలు, మోసాలు, జూదం, వ్యభిచార గృహాలు వంటి అనేక నేర కేంద్రాలతో మాఫియా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మయన్మార్ ప్రభుత్వం ఈ కుటుంబీకులను పట్టుకుని చైనాకు స్వాధీనం చేసింది.

# ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో బయటకొస్తున్న పెద్దల జాతకాలు

## లేబర్‌పార్టీ నాయకుడు మాండెల్సన్ రాజీనామా



**లండన్ :** అమెరికా ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ రహస్య పత్రాలు, వీడియోలు, ఫొటోలు తీవ్ర ప్రకంపనలు పుట్టిస్తున్నాయి. బ్రిటన్ లేబర్‌పార్టీ నాయకుడు, అమెరికాలో బ్రిటన్ మాజీ దౌత్యవేత్త లార్డ్ మాండెల్సన్ తన పదవికి రాజీనామా చేశారు. బ్రిటన్‌లో ప్రతిపక్షాలు ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రిన్స్ ఆండ్రూ జాతకం అందరికీ బట్టబయలైంది. బిల్‌క్లింటన్, ట్రంప్, ఎలాన్‌మస్క్‌లు కూడా బాధితులుగా ఉండటంతో వారు కూడా కొత్తగా దుర్భిణీ పరిధిలోకి వచ్చారు. అదేవిధంగా నార్వే యువరాణి మెట్టేమారిట్ పేరు కూడా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కొన్ని వందలసార్లు కనిపించింది. ఈ విషయంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై నార్వే ప్రధానమంత్రి జోనాస్ స్పందించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆమెకున్న సంబంధాలపై సమాధానం చెప్పాలని నిలదీశారు. కాగా, ఇక నా వల్ల ఎవ్వరూ ఇబ్బంది పడకూడదని, గతంలో తనకున్న సంబంధాలవల్ల పార్టీ ప్రతిష్ఠ దిగజారకూడదనే ఉద్దేశంతోనే లేబర్‌పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు లార్డ్ మాండెల్సన్ ప్రకటించారు. ఎప్‌స్టీన్‌తో ఆయనకున్న సంబంధాలు గతంలోనే వెలుగుచూశాయి. దీంతో ఆయన అమెరికాలో బ్రిటన్ దౌత్యవేత్త పదవికి రాజీనామా చేశారు. ఇప్పుడు సాక్ష్యాధారాలవల్ల పార్టీకి రాజీనామా చేశారు. 2003,2004 సంవత్సరాలలో మాండెల్సన్‌కు జెఫ్రీ ఎప్‌స్టీన్ నుండి మూడు విడతలుగా 25,000 పౌండ్లు వంతున నగదు ముట్టిందని ఎప్‌స్టీన్ పత్రాల్లో బహిర్గతమైంది. ఐతే ఈ విషయం గురించి మాండెల్సన్‌ను అడిగినప్పుడు డబ్బు విషయం తనకు తెలియదన్నారు. అవన్నీ అబద్ధాలన్నారు. ఐనాగానీ తిరిగి తాను వ్యక్తిగతంగా ఈ విషయాలన్నింటినీ పరిశీలిస్తానన్నారు. లేబర్ పార్టీకి ఆయన సమర్పించిన రాజీనామా లేఖలో ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపట్ల విచారం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలకు ఆయన క్షమాపణలు తెలియజేశారు.

జపాన్ పర్యటన ముగించుకుని లండన్ తిరిగి వస్తూ బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల బాధితుల గురించి మాట్లాడుతూ ఎవ్వరైనా సరే ఈ విషయంలో తమకు తాముగా బాధ్యత వహించాలని, ఈ విషయంలో వారికి తెలిసిన వివరాలను సంబంధిత చట్ట వ్యవస్థలకు తెలియజేసి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. చట్టానికి ప్రిన్స్ ఆండ్రూ సహకరించాలని, ఎప్‌స్టీన్ గురించి తనకు తెలిసిన కొత్త సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని కీర్ స్టార్‌మర్ కోరారు. కాగా, మాండెల్సన్ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని లేబర్‌పార్టీ నాయకులు వాదిస్తుండగా,ప్రధానమంత్రి స్టార్‌మర్ త్వరగా ఆయనపై చర్యలు తీసుకోవాలని కన్జర్వేటివ్ పార్టీ నాయకులు కోరుతున్నారు.

### అప్రదిష్ఠపాలైన ఎలిజిబెత్–2 కుమారుడు

### ఎప్‌స్టీన్ చేతికి ఆండ్రూ కుమార్తెల ఫొటోలు



మరణించిన బ్రిటన్ రాణి ఎలిజిబెత్–2 మూడో సంతానం, ఆమె రెండో కుమారుడు ప్రిన్స్ ఆండ్రూ..డ్యూక్ ఆఫ్ యోర్క్, ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల కావడంతో తీవ్రస్థాయిలో అప్రదిష్ఠపాలయ్యారు. ప్రిన్స్ ఆండ్రూ పూర్తి పేరు ఆండ్రూ అల్బర్ట్ క్రిస్టియన్ ఎడ్వర్డ్ మౌంట్‌బాటెన్ విండ్సార్ (66). ఇప్పటికే ఆయనకు ఎప్‌స్టీన్‌తో ఉన్నసంబంధాలు బయటపడ్డాయి. ఎప్‌స్టీన్‌ను ఆండ్రూ సోదరుడుగా సంబోధించారు. మరో మహిళతో కూడా ఆయనకు సంబంధాలున్న విషయం తాజా పత్రాల ద్వారా వెలుగుచూసింది. ఈ రెండో మహిళపేరు ఏమిటో తెలియనప్పటికీ ఆమె తరపు న్యాయవాదులు మాత్రం నోటీసులు ఇచ్చారు. మర్యాదగా కూర్చుని విషయం పరిష్కరించుకోవడానికి రాజీకి రావాలని లేదా న్యాయస్థానాన్ని ఎదుర్కోవాలని "ఆమె" తన న్యాయవాదుల ద్వారా హెచ్చరిక చేశారు. ఎప్‌స్టీన్‌కు ఆయనకు మధ్య ఉన్న గాఢానుబంధం ఈ పత్రాల సాక్ష్యాల్లో స్పష్టంగా బహిర్గతమైంది. రష్యాన్ మహిళలను ప్రిన్స్ ఆండ్రూకు ఎప్‌స్టీన్ ఎరగా చూపించాడు. అందుకు ఆండ్రూ కూడా అత్యుత్సాహం కనబరిచి అతడితో లావాదేవీలు నడిపాడు. తన ఇంట్లో వేడుకలకు ఎప్‌స్టీన్‌ను ఆహ్వానించాడు. తన భార్య, కుమార్తెల ఫొటోలను కూడా ఎప్‌స్టీన్‌కు ఆండ్రూ పంపించిన సాక్ష్యాలున్నాయి. ఇవన్నీ ఈ శతాబ్దారంభంలో జరిగిన వ్యవహారాలే. రెండు రోజుల క్రితం ఈ పత్రాలు బహిర్గతమైన తర్వాత స్లోవేకియాలో ప్రధానమంత్రికి జాతీయ భద్రతా సలహాదారుడు మిరోస్లావ్ లాజ్‌కాక్ రాజీనామా చేశారు. ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్‌పై కూడా తీవ్రమైన లైంగిక ఆరోపణలు వచ్చాయి. ఆండ్రూ మాజీ భార్య సారా ఫెర్గూసన్ జెఫ్రీ ఎప్‌స్టీన్‌ను సోదరుడుగా అభివర్ణించారు.

గాజా–ఈజిప్టు సరిహద్దు

# రాకపోకల పునరుద్ధరణ



**కైరో:** రెండు సంవత్సరాల పోరాటం తర్వాత ఎట్టకేలకు గాజా–ఈజిప్టు మధ్య రాకపోకలకు వీలుగా సరిహద్దుల్లో ఉన్న రఫా క్రాసింగ్‌ను సోమవారం పునరుద్ధరించారు. రఫా క్రాసింగ్‌ను ప్రయోగాత్మకంగా ఒకటో తేదీనే ప్రారంభించారు. ఈజిప్టు ప్రభుత్వ మీడియా, ఇజ్రాయెలీ భద్రతా దళాలు రఫా క్రాసింగ్ పునఃప్రారంభమైన విషయాన్ని అధికారికంగా ధృవీకరించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ ప్రకటించింది. యుద్ధానికి ముందురోజుల్లో గాజా నుండి ప్రజలు వెళ్ళిపోవడానికి రఫా క్రాసింగ్ ప్రధానమైన మార్గంగా ఉండేది. గత ఏడాది అక్టోబరులో ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత ఈ మార్గాన్ని పునరుద్ధరించే విషయంపై ఇజ్రాయెల్ తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. రఫా క్రాసింగ్‌ను పాలస్తీనియన్లు ప్రపంచ దేశాలలోకి ప్రవేశించడానికి ఒక ముఖద్వారంగా భావిస్తారు. 2024 మే నెలలో ఇజ్రాయెల్ సైన్యం ఈ గేట్ వేను మూసివేసింది. ఇప్పుడు ఈజిప్టులోకి వెళ్ళేందుకు గాజా ప్రజలను పరిమితంగా మాత్రమే అనుమతించారు. అంబులెన్సులు, సహాయ సామాగ్రి మోసుకెళ్ళే లారీలు భారీ సంఖ్యలో రఫా క్రాసింగ్ వద్ద క్యూ కట్టాయి. తీవ్ర అనారోగ్యం, అత్యవసర వైద్యసేవలు అవసరమైనవారిని ఈ క్రాసింగ్ ద్వారా వెళ్ళేందుకు అనుమతించచారు. సరుకుల రవాణాను అనుమతిచ లేదు. దాదాపు 20,000 మంది పాలస్తీనా పిల్లలను, వయోజనులను శస్త్రచికిత్సలు, వైద్య అవసరాల నిమిత్తం వెళ్ళేందుకు సిద్ధంగా ఉండగా, ప్రతిరోజూ అటూవైపు–ఇటూవైపు రాకపోకలకు 50మందిని మాత్రమే అనుమతిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ప్రకటించారు. కాగా ఈజిప్టులో దాదాపు 150 ఆసుపత్రులు గాజా నుండి పాలస్తినా రోగులకు చికిత్సలు అందించేందుకు తలుపులు తెరచి సిద్ధంగా ఉన్నాయి. ఐతే ఇజ్రాయెల్‌మాత్రం ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో ఉన్న ఆసుపత్రులకు పాలస్తినా రోగులు, గాయపడినవారిని తరలించడాన్ని నిషేధించింది. ఈజిప్టు నుండి గాజాలోకి వెళ్ళేందుకు వేలాదిమంది ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పదంలో కీలకమైన చర్యలు ముందు ముందు మరిన్ని అమలు కావాల్సి ఉన్న తరుణంలో రఫా క్రాసింగ్ పునఃప్రారంభం ఒక మైలురాయి ఘట్టంగా మారింది. కాగా గత ఏడాది అక్టోబరు 10న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెల్ ఉల్లంఘనలకు పాల్పడింది. ఈ సందర్భంగా కాల్పుల్లో 520 మంది పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ 100 మంది పైగా పిల్లలు మరణించారని యూనిసెఫ్ ప్రకటించింది. గాజా యుద్ధంలో 71,700 మంది పాలస్తీనియన్లు హతులయ్యారు. మరో 10వేలమంది శిథిలాల్లో నిర్జీవులయ్యారు.

# ఎన్నికల్లో పోటీ కోసం కూతుర్ని చంపిన తండ్రి

**ప్రజాపక్షం/ఎడపల్లి/నిజామాబాద్ అర్బన్ :** రాజకీయ అధికారంపై వ్యామోహం ఒక తండ్రిని కిరాతకుడిగా మార్చింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అడ్డుగా ఉందని, కన్న కూతురినే కాలువలోకి నెట్టి హత్య చేసిన ఉదాంతం నిజామాబాద్ జిల్లాలో కలకలం రేపింది. ఈ దారుణానికి ఒడిగట్టిన తండ్రితో పాటు అతనికి సహకరించిన ప్రస్తుత సర్పంచ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సిపి సాయి చైతన్య సోమవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా, ముఖేడ్ తాలూకా కెరూర్ గ్రామానికి చెందిన పాండురంగ కొండమంగలే అనే వ్యక్తి క్షౌరవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలని పాండురంగ భావించాడు. కానీ ముగ్గురు సంతానం ఉంటే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హత ఉంటుందని భావించాడు. దీంతో ప్రస్తుత సర్పంచ్ గణేష్ షిండేతో కలిసి పథకం వేశాడు. మొదట తన కుమారుడి బర్త్ సర్టిఫికెట్ మార్పించాలని పూణే కార్పొరేషన్ కార్యాలయం చుట్టు తిరిగినా పని కాలేదు. చివరకు ఒక బిడ్డను వదిలించుకుంటేనే ఎన్నికల బరిలో ఉండగలనని భావించి, తన పెద్ద కూతురు ప్రాచీ(6)ని చంపాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం, జనవరి 29న పాండురంగ తన కూతురు ప్రాచీని మాయమాటలు చెప్పి బైక్‌పై నిజామాబాద్‌కు తీసుకొచ్చాడు. ఎడపల్లి పరిధిలోని నిజాంసాగర్ డి46/8 కెనాల్ వద్దకు రాగానే పాప బతికి ఉండగానే కాలువలోకి తొసివేసి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బోధన్ ఎసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి సోషల్ మీడియాలో పాప ఫోటోలను వైరల్ చేశారు. వాట్సాప్ స్టేటస్‌లలో పెట్టిన ఫోటోను చూసిన మహారాష్ట్ర బంధువులు, ఆ పాప ముఖేడ్ తాలూకా కెరూర్ గ్రామానికి చెందిన ప్రాచీగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి వారి నుంచి హత్యకు ఉపయోగించిన ఎంహెచ్ 26బివై 7495 బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పాండురంగ కొండమంగలే తో పాటు ప్రస్తుత సర్పంచ్ గణేష్ షిండే ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్లిష్టమైన కేసును అత్యంత వేగంగా, చాకచక్యంగా చేదించిన బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, రెంజల్ ఎస్సై చంద్రమోహన్‌తో పాటు ఇతర సిబ్బందిని పోలీస్ కమీషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# విచారణ తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

నారాయణ రెడ్డి తన 500 ఎకరాల భూమిని ప్రజలకు పంచిపెట్టారని, 60 ఏళ్లు వచ్చాక ఆయన రాజకీయ పదవులను కూడా వదులుకున్నారని, తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని , తన ఆస్తులను త్యాగం చేశారన్నారు. 'వీరు' (కెసిఆర్ ) ఏం త్యాగం చేశారని, ఒకే కుటుంబం పదవులను పంచుకున్నదని, ఫామ్‌హౌస్‌లను కట్టుకున్నారని, వేలా కోట్ల రూపాలయను సంపాదించుకున్న వారు జాతీపిత, ఉద్యమకారులు ఎలా అవుతారని సిఎం నిలదీశారు.

హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని రావి నారాయాణ రెడ్డి ఆడిటోరియంలో సోమవారం జరిగిన రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డ్ ప్రధానోత్సవానికి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. న్యాయమూర్తిగా చారిత్రాత్మక తీర్పులను వెలువరించిన సుప్రీం కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో ''తెలంగాణ రైతాంగాసాయుధ పోరాట సేనాని, సిపిఐ అగ్రనేత రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు2025'ను సిఎం రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని శాలువాతో సత్కరించి, సన్మాన పత్రాన్ని అందజేశారు. కాగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి సన్మాన పత్రంలోని సారాంశాన్ని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి సభలో చదివి వినిపించారు. అంతకుముందు రావి నారాయణ రెడ్డి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, తెలంగాణ చాడ వెంకట్ రెడ్డి, కందిమళ్ల ప్రతాప్ రెడ్డి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

అనంతరం చాడ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఒక సారి హోదా వస్తే నేరాలు చేస్తాం...ఈ మధ్య తెలంగాణ జాతిపిత అని , ఉద్యమకారులమని కొందరు వాళ్లకు వాళ్లే రాసుకుంటున్నారని విమర్శించారు. పోలీసులు చిన్న నోటీసులు ఇస్తే జాతిపితకు నోటీసులు ఇస్తారా ? అని అంటున్నారని, ఆనాడు గాంధీజీ పదవులు త్యాగం చేసి దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని, మరి ప్రస్తుతం జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమం నడిపించిన ప్రొపెసర్ కోదండరామ్ ఉద్యమకారుడు కాదా?, ఆయన ఇంటి తలుపులు బద్ధలు కొట్టి, ఆయనను అరెస్ట్ చేయలేదా?

అప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా?' అని నిలదీశారు. జెఎసి ఉద్యమకారుడైన చైర్మన్‌కు కోదండరామ్‌కు ఎంఎల్‌సిగా అవకాశం కల్పిస్తే , దీనిని అడ్డుకునేందుకు సుప్రీం కోర్ట్ వరకు వెళ్లారని, ఆయన ఏం తప్పు చేశారని అన్నారు. తమ ప్రభుత్వం అలా చేయలేదని, కనీ తమ ప్రభుత్వం కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చిందని, అధికారిక నివాసంలోనే ప్రశ్నిస్తామని చె ప్పిందని అన్నారు. ప్రజలు తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలని, హుందాగా తప్పుకుంటే కొంతైనా గౌరవం నిలబడేదని అన్నారు. చేయాల్సిన తప్పులన్నీ చేస్తే జాతిపిత, ఉద్యమకారులు ఎలా అవుతారని అన్నారు. స్వయాన ఎంఎల్‌ఎగానే ఎన్నికల్లో ఓడిపోయారని, వాళ్ల పార్టీ ఒక్క పార్లమెంట్ సీటును కూడా గెలుచుకోలేదని గుర్తు చేశారు. ప్రజలు తిరస్కరిస్తే ప్రజలే ఓటు వేయకుండా తప్పు చేశారని చెబితే ఇదెక్కడి ప్రజాస్వామ్యమన్నారు.

**సాయుధ పోరాటంలో 'రావి నారాయణ రెడ్డి 'ది కీలక పాత్ర**

రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటామని, మంత్రులతో సమావేశమై ఆయనకు తెలంగాణలో సముచిత గౌరవం కల్పించే బాధ్యత తమ ప్రభుత్వానిదని సిఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన తర్వాత తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ సభ్యులు, అవార్డ్‌గ్రహిత జస్టిస్‌సుదర్శన్ రెడ్డితో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రతిపాదనలను స్వీకరిస్తామని సిఎం చెప్పారు. అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేశారని, రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెట్టిచాకిరీ విముక్తి చేశారని గుర్తు చేశారు. 'బండి వెనకాల బండి కట్టి'అని పాట కట్టిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను కూడా ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. దేశంలో మొట్ట మొదటి సారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే కూడా ఎంపిగా రావి నారాయణరెడ్డికే అధిక మెజారిటీతో దక్కిందని, ప్రజా తీర్పును ప్రతిబింబించే విధంగా మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణరెడ్డితోనే నెహ్రూ ప్రారంభింపజేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిబద్ధత మోదీని బయపెడుతుందనే ఉద్దేశంతోనే ఆయను ఉపరాష్ట్రపతిగా నాడు కాంగ్రెస్ పార్టీ, మల్లిఖర్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ బరిలో దించారని వివరించారు. ప్రజలకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని అందించాలంటే ఏక పార్టీ, ఏక వ్యక్తి పాలనకు వ్యతిరేకంగా సుదర్శన్ రెడ్డి ఎన్నికల బరిలో దిగారని, అలాంటి వ్యక్తికి రావి నారాయణరెడ్డి పురస్కారం అందించడం సముచితమని, ఇది సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.

తొలి తరంలో బూర్గుల, రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే , మలి తరంలో జైపాల్ రెడ్డి, జస్టిస్ సుదర్శన్ రెడ్డి లాంటి వాళ్లు తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తి అని అన్నారు. సమాజంలో వస్తున్న మార్పును, ప్రజల ఆలోచనను గౌరవించిన గొప్ప నాయకులు జైపాల్ రెడ్డి, రావి నారాయణరెడ్డి అని అన్నారు.



### కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లు బొమ్మా, బొరుసులు

సర్ పేరుతో ప్రజల ఓటు హక్కును కాలరాసే కుట్రలు జరుగుతున్నాయని, వీటి పట్ల కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజల పక్షాన నిత్యం ఎర్ర జెండా పోరాడుతుందని, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజలకు అవసరమని, ఈ రెండు పార్టీలు నాణానికి బొమ్మ, బొరుసులాంటి వారని అన్నారు. కమ్యూనిస్టులు పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకొచ్చిందని పునరుద్ఘాటించారు.ఆరుట్ల కమలాదేవి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, రావి నారాయణరెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, మల్లు స్వరాజ్యం లాంటి స్వేచ్ఛ కోసం, వెట్టిచారికి కోసం సర్వం త్యాగం చేశారని గుర్తు చేశారు.

### రావి నారాయణరెడ్డి యుగ పురుషుడు

రావి నారాయణ రె డ్డి రాసిన 'తెలంగాణ నగ్న సత్యం' అనే డాక్యుమెంట్‌పైన పరిశోధన జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమం తెలంగాణ అంటే ఏమిటి?, రైతాంగ సాయుధ పోరాటం, ఆ పోరాట స్వరూపం, స్వభావం?, ఫ్యూడల్ వ్యవస్థ అంటే ఏమిటి?, దీనికి ఎదురు నిలిచి పోరాటం చేసిన రావి నారాయణ రెడ్డి యోధుడి చరిత్రనే కాదని, తెలంగాణ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమన్నారు. తనకు ఎన్నో అవార్డులు వచ్చినప్పటికీ ఇది రావినారాయణ రెడ్డి జాతీయ అవార్డ్ తనకు ఎంతో గొప్పదని, ప్రత్యేకమని అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి కలిగిన వ్యక్తి అని, ఆయనొక యుగపురుషుడని, విప్లవవీరుడని కొనియాడారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్‌ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని, ట్రస్ట్‌కు ప్రత్యేక గుర్తింపు, దక్కాలని, రావినారాయణరెడ్డితో పాటు నాటి తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల చరిత్రను గుర్తించాలని, పది ఎకరాల స్థలంలో స్మృతి వనంను నిర్మి ంచేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. దేశ ప్రసంగాల గురించి స్వయాన ఒక ముఖ్యమంత్రి ఒక వర్గం వారికి చెందిన ఓట్లను తొలగించాలని ప్రొత్సహిస్తున్నారని, అలాగే పొరుగుదేశానికి వెళ్లాలని అంటున్నారని, ఇలాంటి విద్వేష ప్రసంగాలు రాజ్యాంగ బద్దంగా సిఎం ప్రమాణ సందర్భంగా చేసిన ప్రమాణానికి విరుద్ధమని చెప్పారు.

### ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం : కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి

తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే నిలిచిపోతుందన్నారు. భవిష్యత్ తరాలకు నాటి సాయుధ పోరాటం,నాటి పరిస్థితులను, తెలియజేయాలనే ఉద్దేశంతోనే ట్రస్ట్ పని చేస్తుందన్నారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ స్వాగతోపన్యాసం చేస్తూ రావి నారాయణరెడ్డి పేరుతో ప్రతి ఏటా అవార్డులను అందజేస్తున్నామని, ఒక కరోనా సమయంలో ఇవ్వలేదని వివరించారు. తెలంగాణ అమర వీరుల స్మారక ట్రస్ట్ సభ్యురాలు రావి ప్రతిభ వందన సమర్పణ చేశారు. ఈ వేదికపైన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ సభ్యులు ఉజ్జిని రత్నాకర్‌రావు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్‌పాషా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధానకార్యదర్శి పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఈ.టినర్సింహ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ సంగీత దర్శకుడు వందే మాతరం శ్రీనివాస్, ప్రజా నాట్య మండలి అధ్యక్షుడు కె.శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ గేయాలను ఆలపించారు.

# ఎక్కడా అనుమతి లేదు

(మొదటి పేజీ తరువాయి)

సుదర్శన్ రెడ్డి స్వీకరించారు. అనంతరం 'భారత రాజ్యాంగంభావప్రకటన స్వేచ్ఛ' అనే అంశంపైన ఆయన 'రావి నారాయణ రెడ్డి' స్మారకోపన్యాసం చేశారు. తమకు భావ ప్రకటన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లేదా?, తాము ఎవరి గురించైనా రాస్తాం, ఎవరి పరువైన తీస్తామనంటే ఏ దేశంలో ఏ రాజ్యాంగం కూడా పరిమితులను అనుమతించబోదని సుదర్శన్ రెడ్డి అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను మొదటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ ప్రగాఢంగా విశ్వసించేవారని, దేశ భద్రత, ప్రయోజనాలకు భంగం కేసుల విషయంలో సుప్రీం కోర్ట్ నేపథ్యంలో ఆయనే రాజ్యాంగానికి 1951 మొదటి, 1961లో దేశ సార్వభౌమత్వ విషయంలో రెండవ సారి సవరణ చేయాల్సి వచ్చిందని, ఈ రెండు సవరణకు ప్రత్యేక్షంగా, పరోక్షంగా కమ్యూనిస్టులు కూడా కారణమయ్యారన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన అధికారణకు రెండవ సారి సవరణ ప్రతిపాదించినప్పుడు నాడు రావి నారాయణ రెడ్డి పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పుడు ఆ అవసరం లేదని అన్నారని సుదర్శన్‌రెడ్డి తెలిపారని, ఈ విషయాన్ని 'అవుడస్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ వర్క్స్' అనే పుస్తకంలో అమెరికా రచయిత ఆస్టిన్ ప్రస్తావించారని ఆయన గుర్తు చేశారు.

# పత్తి కొనుగోళ్లలో కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్‌తో సహా ఆదిలాబాద్, బైంసా, ఖమ్మంతో పాటు పలు మార్కెట్‌లలో అవకతవకలు జరిగాయి. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగాయి. ఈ అక్రమాలు గుర్తించిన కొంత మంది గత సంవత్సరం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ఫిర్యాదు చేశారు. ఆయన విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. వరంగల్ మార్కెట్‌తో పాటు అన్ని మార్కెట్ లలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. భారీ అవకతవకలు వరంగల్ తో పాటు పలు మార్కెట్ లో గుర్తించారు. వారు అప్పుడు ఇచ్చిన తాత్కాలిక నివేదిక ప్రకారం గతంలోనే ఐదుగురు కార్యదర్శులపై వేటు వేశారు. తర్వాత మార్కెట్ల వారిగా విచారణ కొనసాగించారు. విజిలెన్స్ శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లపై సస్పెన్షన్ వేటు వేశారు. వీరిని ఏజెన్సీలకు సరెండర్ చేయాలని కోరారు. మరో 17 మంది కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు. ఈ పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణంశాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్ల పై సస్పెన్షన్ వేటు వేశారు. వీరిని ఏజెన్సీలకు సరెండర్ చేయాలని కోరారు.ఈ పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణం జరిగింది. గత సంవత్సరం తాత్కాలిక అనుమతుల పేరుమీద రైతుల వద్ద కొనుగోలు చేసి వారి పేరుమీదనే సీసీఐకి అమ్మకాలు చేశారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన దళారులు ఎక్కువ ధరకు అమ్ముకున్నారు.వ్యాపారులతో పాటు దళారులు కొనుగోలు చేయడానికి అధికారులు సహకరించారు. గత సంవత్సరమే వరంగల్ మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఆదిలాబాద్ తో సహా ఇతర కార్యదర్శులపైన కూడా సస్పెండ్ వేటు వేశారు. ఈ వ్యవహారంలో దళారులు, అధికారులపై చర్యలు చేపట్టలేదు. నోటీసుల వరకే పరిమితం చేశారు. వరంగల్ మార్కెట్ లో పత్తి వందల కోట్ల రూపాయల కొనుగోలు జరుగుతుంది. సీసీఐతో పాటు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 55 కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల పరిధిలోగల పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. గత సంవత్సరం వ్యవహారంలో చర్యలు తీసుకోకుండా ప్రజాప్రతినిధుల ద్వారా దళారులు, అధికారులు ప్రయత్నాలు చేయడం ద్వారానే వారిపైన చర్యలు చేపట్టనట్లు తెలుస్తుంది. విజిలెన్స్ నివేదికలో భాగంగా తాత్కాలిక ఉద్యోగులపైనే వేటు వేయడం పలు విమర్శలకు తావిస్తుంది.

# లోక్‌సభలో రగడ

(మొదటి పేజీ తరువాయి)

చైనాపై తీసుకున్న నిర్ణయాలపై ప్రజల్లో పుష్కలంగా సమాచారం ఉందని, ఆయన 'తన సొంత రాజనీతిజ్ఞతను మరింత పెంచుకోవడానికి వేల ఎకరాల భూమిని వదులుకున్నారని' వారు ఆరోపించారు. ఈ అంశంపై తాను ఎప్పుడూ మాట్లాడకూడదని గాంధీ అన్నారు. కానీ బిజెపికి చెందిన సూర్య కాంగ్రెస్ పార్టీ దేశభక్తిని ప్రశ్నించడంతో తాను మాట్లాడాలని నిర్ణయించుకున్నానన్నారు. తన అభిప్రాయాలను తెలియజేయడానికి ఒక పత్రిక కథనాన్ని ఉటంకిస్తున్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. స్పీకర్ ఓమ్‌బిర్లా మళ్ళీ దానిని తిరస్కరించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పీకర్ రూలింగ్‌ను పాటించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకుడు పదే పదే స్పీకర్ రూలింగ్‌ను విస్మరిస్తూ, నియమాలను ఉల్లంఘిస్తే, అటువంటి సభ్యుడిపై ఎలాంటి చర్య తీసుకోవాలో సభ చర్చించాల్సి ఉంటుందని రిజిజు అన్నారు. సభ నియమాలను పాటించకపోవడం ద్వారా యువ ఎంపిలకు గాంధీ తప్పుడు ఉదాహరణగా నిలుస్తున్నారని మంత్రి అన్నారు. ఆ పుస్తకాన్ని ఉటంకించవద్దని స్పీకర్ పదే పదే హెచ్చరించారు. ఈ క్రమంలో రాజ్‌నాథ్‌సింగ్ లేచి ఆ పుస్తకాన్ని ప్రచురించడానికి అనుమతి లేదని, మరి నరవాణే దానిపై కోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. రాహుల్ సభను తప్పుదారి పట్టిస్తున్నారని రక్షణ మంత్రి కూడా ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ రాహుల్‌గాంధీకి మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ నాయకుడిని మాట్లాడటానికి అనుమతించాలని స్పీకర్‌ను కోరారు. అధికార, ప్రతిపక్ష ఎంపిలు ఇద్దరూ పట్టు విడవకపోవడంతో స్పీకర్ మధ్యాహ్నం 3 గంటల వరకు సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు రాహుల్‌గాంధీ మళ్ళీ భారత దేశంచైనా సరిహద్దు సమస్యను లేవనెత్తడానికి ప్రయత్నించారు. దీంతో అధికారి బెంచీల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. సైన్యాన్ని తక్కువ చేసి మాట్లాడే మాటలు గాంధీ మాట్లాడకూడదని రిజిజు అన్నారు.ప్రతిష్టంభన కొనసాగుతుండగా బిర్లా సభను మరోసారి సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. టిఎంసికి చెందిన మహువా మొయిత్రా, కళ్యాణ్ బెనర్జీ, ఆర్జేడీకి చెందిన మనోజ్ ఝా, ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్ సహా అనేక మంది ప్రతిపక్ష నాయకులు ఈ అంశంపై గాంధీకి మద్దతు ఇచ్చారు.

**ప్రభుత్వం అతిగా స్పందించింది: శశిథరూర్**


రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై లోక్‌సభలో ప్రభుత్వ పక్షం అతిగా స్పందించిందని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ వ్యాఖ్యానించారు. సంబంధిత పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని ప్రభుత్వం అభ్యంతరం చెప్పే బదులు.. ఆయనకు మాట్లాడే అవకాశం ఇవ్వాల్సింది అని అన్నారు.

**ఎందుకు భయపడుతున్నారు?: ప్రియాంక గాంధీ**

రాహుల్‌గాంధీ మాట్లాడుతున్న మాటల్లో నిజం లేకపోతే, వాటికి సరైన ప్రామాణికత లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. పుస్తకంలోని ఒక్క లైన్ గురించి రాహుల్ ప్రస్తావించగానే అధికార పక్ష సభ్యులు అంత ఆగ్రహానికి గురవ్వాల్సిన అవసరం ఏముందన్నారు.

# రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానోత్సవ దృశ్యాలు


































## 12న రవాణా రంగ కార్మికుల సమ్మె

### ఆటో, క్యాబ్, లారీ మోటార్ రవాణా రంగ కార్మిక సంఘాల జెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో విఫలమైనందున కేంద్ర కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా 4 లేబర్ కోడ్‌లతో పాటు మోటార్ వాహనాల చట్టం 2019 రద్దు చేయాలని సమ్మెకి పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా రంగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12 న రాష్ట్ర వ్యాప్తంగా ఒకరోజు సమ్మె నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం కమిషనర్‌ను కలిసి యూనియన్ నేతలు (ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, టియుసిఐ, టిఎన్‌టియుసి, బిఆర్‌టియు, టిఎడిఎస్, టిఎండియు, జియుటిఎస్, టిటిడబ్ల్యుయు) వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నేత బి.వెంకటేశం(ఎఐటియుసి)మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ సారథి వాహన పోర్టల్ వలన ఆటో డ్రైవర్లకు తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. ఓలా, ఉబర్, రాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న టూ వీలర్లను నిషేధించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వమే వాటి స్థానంలో ఒక కొత్త యాప్‌ను తీసుకురావాలని వెంకటేశం కోరారు.



## మహాత్మా ఇంత ఘోరమా..

### అన్నంలో గుట్కా కవర్.... రోడెక్కిన విద్యార్థులు

### హాస్టల్స్ మెస్ భోజనంలో పురుగులు, గుట్కాలు ప్రత్యక్షం

### ఎంజియు వైస్ ఛాన్సలర్ హామీతో ఆందోళన విరమణ





**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండలంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వసతి గృహ విద్యార్థుల భోజనంలో గుట్కా ప్యాకెట్ బయటపడడంతో వైస్ ఛాన్సలర్ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఆగ్రహానికి గురై విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. సోమవారం బాలుర వసతి గృహంలో జీరా రైస్‌లో గుట్కా ప్యాకెట్ రావడం విద్యార్థుల ఆరోగ్య భద్రతపై పెద్ద ప్రమాదంగా మారిందని మండిపడ్డారు. గతంలో కూడా అన్నంలో క్రిమికీటకాలు బయటపడిన సంఘటనలు ఉన్నప్పటికీ యూనివర్సిటీ యాజమాన్యం, ముఖ్యంగా వైస్ ఛాన్సలర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిన్నెలతో యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి తీవ్ర నిరసన తెలిపారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తున్న యూనివర్సిటీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కంటే యాజమాన్యానికి విద్యార్థుల హాజరు శాతం ముఖ్యమని పునరావృతమవుతున్న ఘటనలపై వైస్ ఛాన్సలర్ స్పందించకపోవడం దారుణంగా ఉందన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకొని, నాణ్యమైన ఆహారం అందించే వరకు మా ఆందోళన ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఎంజియు అధ్యక్షులు హనుమాన్ చారి, విద్యార్థి నాయకులు మోహన్, సుధీర్, అజయ్, సతీష్, శంకర్, సూర్య, విజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.


GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-9, ఉప్పల్.

టెండర్ నోటీసు

TENDER NOTICE NIT No.28/EEC-9/UPL/GHMC/2025-26 తేదీ: 31-01-2026

**పని పేరు:** 10 పనుల కోసం "జిహెచ్ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, చిల్కానగర్, వార్డు నెం.7, శ్రీ నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో మొదటి అంతస్తు నిర్మాణం..... జిహెచ్ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, రామంతాపూర్, వార్డు నెం.9, ఇందిరానగర్‌లోని ఇందిరానగర్ జెండా నుండి పాపయ్య టిఫిన్ సెంటర్ వరకు, నెహ్రూ నగర్‌లోని ప్రిన్స్‌టన్ కళాశాల సమీపంలో సిసి రోడ్డు వేయడం". **అంచనా విలువ:** రూ.189.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 09.02.2026న మ.03.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ జి.హరికిషోర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నెం.9, జిహెచ్ఎంసి, మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://Tender.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-9, ఉప్పల్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14880-PP/CL/ADVT/1/2025-26, Date: 02-02-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

NIT No.68/SE(KZ)/GHMC/TA/2025-2026 తేదీ: 02-02-2026

**పనుల సంఖ్య:** డిజిల్టింగ్-1, మొత్తం: 1 పని, **అంచనా విలువ:** రూ.61.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ: 03.02.2026న మ.03.30గం.ల నుండి, బిడ్ దాఖలుకు ఆఖరి తేది: 06.02.2026న మ.03.00గం.ల వరకు, **మొత్తం:** 1 పని, **మొత్తం అంచనా విలువ:** రూ.61.00లక్షలు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ (కెజెడ్), జిహెచ్ఎంసి, ఫోన్ నెం. 8790522144. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (కెజెడ్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14889-PP/CL/ADVT/1/2025-26, Date: 02-02-2026

దేవాదాయ ధర్మాదాయ శాఖ

శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము

మారుతీనగర్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లా.

Ref: 5/S.A.S.T/2026 లీజు కొరకు తేది: 02-02-2026

మల్కాజ్ గిరి, మారుతీ నగర్ లో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నందు షాప్ నెంబర్లు 1, 2, 3, 4 సైజు 10x15 మరియు షాప్ నెం. 5 సైజు 6x15 మరియు షాప్ నెం. 6 సైజు 5x5 సైజులు గల వాణిజ్య సముదాయము ఇం.నెం. 4-95 నందు మూడు సంవత్సరముల అద్దెకు లీజుకు ఇచ్చుటకు తేది: 9-02-2026 సోమవారం రోజున ఉదయం 10 గంటలకు బహిరంగ వేలము జరుగును. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఒకరోజు ముందుగా రూ.5,000/- రూపాయలు డిపాజిట్ చెల్లించిన వారు మాత్రమే వేలం పాటలో పాల్గొనగలరని కోరడమైనది. వివరముల కొరకు దేవాలయ కార్యాలయంలో సంప్రదించగలరు.

పైన తెలిపిన షాపుల లీజు కాలము వివరములు

| నెం. | సైజు | కాలము |
|---|---|---|
| షాప్ నెం. 1 | 10 x 15 | 01-11-2026 నుండి 31-10-2029 |
| షాప్ నెం. 2 | 10 X 15 | 01-11-2026 నుండి 31-10-2029 |
| షాప్ నెం. 3 | 10 x 15 | 01-03-2026 నుండి 28-02-2029 |
| షాప్ నెం. 4 | 10 x 15 | 09-01-2026 నుండి 08-01-2029 |
| షాప్ నెం. 5 | 6 x 15 | 01-03-2026 నుండి 28-02-2029 |
| షాప్ నెం. 6 | 5x5 | 01-03-2026 నుండి 28-02-2029 |

ఫోన్ నెం. 9391006157

DIPR R.O. No. : 14858-PP/CL/ADVT/1/2025-26, Date: 02-02-2026 సం/ - సిహెచ్. శ్రీనివాస రావు, మేనేజర్

తెలంగాణ ప్రభుత్వం

వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయము, గడ్డిఅన్నారం

టెండరు నోటిఫికేషన్

నెం.వ్య.మా.క.గ./టెండర్స్/35/2022-23 తేది: 02-02-2026

వ్యవసాయ మార్కెట్ కమిటి, గడ్డిఅన్నారం పరిధిలో ఒక సంవత్సరం కాలము పాటు ఈ క్రింద చూపబడిన పనికి గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

| క్ర.మ | టెండరు పేరు | టెండరు షెడ్యూల్ ధర | ధరావత్తు రూ.లు | టెండరు షెడ్యులు అమ్మకము తేదీలు |
|---|---|---|---|---|
| 1 | బాటసింగారం పండ్ల మార్కెట్ యార్డ్ నందు చెత్త చెదారములు ఊడ్చుట, ప్రోగు చేయుట, ఎత్తి వేయుట మరియు అట్టి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించుటకు | 3,000/- | 3,00,000/- | 06-02-2026 మరియు 07-02-2026 (కార్యాలయ పని వేళల్లో) |
| 2 | ఎల్.బి.నగర్ సబ్-యార్డ్ నందు చెత్త చెదారములు ఊడ్చుట, ప్రోగు చేయుట, ఎత్తి వేయుట మరియు అట్టి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించుటకు గాను. | 3,000/- | 1,00,000/- | |
| 3 | ఎల్.బి.నగర్ సబ్-యార్డ్ నందు గల మరుగు దొడ్లను నిర్వహించుటకు గాను | 3,000/- | 50,000/- | |

1. టెండర్ షెడ్యులు దాఖలు చేయు తేది: 10-02-2026 నాడు ఉదయం 10:00 గం.ల నుండి మ.12.30 గం.ల వరకు మరియు అదే రోజు టెండరు దారుల సమక్షంలో మధ్యాహ్నం 12.45గం.లకు టెండర్లు తెరువబడును.
2. టెండరు షెడ్యులు ధర మరియు ధరావత్తు సొమ్ము రూపాయలు డిమాండు డ్రాఫ్టు ద్వారా Selection Grade Secretary, Agril. Market Committee, Gaddiannaram నందు చెల్లుబాటు అగునట్లు ఉండవలయును.

ఎటువంటి కారణము లేకుండానే టెండర్ నిలుపుదల చేయుటకు గాని, రద్దు పరుచుటకు గాని ఈ క్రింది సంతకము దారునికి అధికారము కలదు. ఇతర వివరములకు కార్యాలయము పని వేళలలో ఉ.10:30 నుండి సా.5:00 గం.లకు స్వయముగా సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటి, గడ్డిఅన్నారం.

DIPR R.O. No. : 14897-PP/CL/ADVT/1/2025-26, Date: 02-02-2026



## సిపిఐ అభ్యర్థులకు బిఫామ్‌లు

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి ఎన్నికలలో 2, 7 వార్డులలో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులు షేక్ షరీఫ్, బొలుగూరు సుగుణమ్మలు సోమవారం రోజున బి ఫామ్‌లను అందజేశారు. అలాగే 1వ వార్డు నుండి పోటీలో ఉన్న సిపిఐ(ఎం) అభ్యర్థి జిట్ట నగేష్ కూడా తన బి ఫాంను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు లొడంగి శ్రవణ్‌కుమార్, మండల పార్టీ కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు బొలుగూరి లింగయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి పట్టన అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఓటర్లను కోరారు. సోమవారం పట్టణంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంతో పాటుగా, పలు వార్డులలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను ఓటు అభ్యర్థిస్తూ రాష్ట్రంలో ప్రజాపాలనను అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ఆశీర్వదిస్తున్నట్లుగానే, కౌన్సిల్ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని వీరేశం కోరారు. ఆయన వెంట డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఉన్నారు.

**కాంగ్రెస్‌లో చేరికలు:** 6వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన రేపాక ప్రణయ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని తన సహచరులతో నేడు ఎంఎల్‌ఏ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని వారిని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, ఆలయ కమిటి చైర్మన్ మారగోని అంజనేయులు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు జడల చినమల్లయ్య, నాయకులు పాటి మాధవరెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కార్పొరేషన్13వ డివిజన్లో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరించి మంత్రి సహకారంతో అభివృద్ధి చేస్తానని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి అన్నారు. గుమ్మల జానకి మోహన్ రెడ్డి 13వ డివిజన్ కార్పొరేషన్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సందర్భంగా 13వ డివిజన్ లోని విద్యుత్ నగర్,ఎన్‌టిఆర్ కాలనీలో ప్రస్తుతం ప్రచారం కొనసాగించారు.ఈసందర్భంగా గడప గడపకి తిరిగి ప్రతి ఒక్కరిని కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈప్రచారం కార్యక్రమంలో కాలనీ నాయకులు కంచరకుంట్ల వెంకటరెడ్డి,మర్రిగూడ గ్రామ శాఖ అధ్యక్షుడు గురజ వెంకన్న గౌడ్, జిల్లా అంజిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

## తుర్కపల్లిలో గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడుతూ గంజాయితో సమాజాన్ని నాశనం చేద్దామనుకునే వారికి చట్టరీత్యా చర్యలు తప్పవని, ఎన్ని రోజులైనా కటకటాల్లోకి వెళ్తారని తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ హెచ్చరించారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలో మోటకొండూర్ మండలం తేర్యాల గ్రామనికి చెందిన చామల అఖిల్ రెడ్డి, గుండాల మండలం అనంతారం గ్రామానికి చెందిన మాజోజు ప్రశాంత్ అనే ఇద్దరు వ్యక్తులు, తమ ఫోర్డ్ కారులో గంజాయితో ప్రయనిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో తుర్కపల్లి పోలీస్ స్టేషన్ తమ సిబ్బందితో ఎపి 29ఎన్5878 నంబర్‌గల కారును ఆపి తనిఖీ చేయగా సుమారు 200 గ్రాముల గంజాయి పట్టుబడిందని, సదరు గంజాయిని కొండమడుగు, బీబీనగర్ వద్ద కొనగోలు చేసి తుర్కపల్లి వైపు వెళ్తుండగా పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. నిందితుల వద్ద నుంచి 200 గ్రాముల గంజాయి, ఒక ఫోర్డ్ ఫిస్ట కార్, రెండు మొబైలు ఫోన్‌లు, ఒక బరువు కొలిచే యంత్రం ఒక బ్యాగ్, కొన్ని కవర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## ఓటర్ స్లిప్పుల పంపిణీలో నిర్లక్ష్యం తగదు

**ప్రజాపక్షం/హాలియా:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్ల ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ పై బిఎల్‌ఓ లకు మున్సిపల్ కమిషనర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.సోమవారం హాలియా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో బిఎల్‌ఓలకు ఓటర్ ఫోటో ఓటర్ స్లిప్పులు పంపిణీ పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఈ సందర్భంగా కమిషనర్ వారికి తెలిపారు.హాలియా మున్సిపాలిటీలో సోమవారం నుంచి ఓటర్ ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభించినున్నట్లు చెప్పారు.అన్ని రాజకీయ పార్టీలతో ఏర్పాటుచేసిన ఈసమావేశంలో ఓటర్ స్లిప్పుల పంపిణీలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు వాటిని పంపిణీ చేయనున్నట్లు వారికి చెప్పారు.ఓటర్ స్లిప్పుల పంపిణీ పారదర్శకంగా,నిష్పక్షపాతంగా,సమర్థవంతంగా నిర్వహించాలని బిఎల్‌ఓలకు కమిషనర్ సూచించారు.ప్రతి ఇంటికి ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ చేయాలని వీటిని ఈనెల 7వ తేదీ వరకు పూర్తి చేయాలని బిఎల్‌ఓలకు తెలిపారు ఓటర్లు కూడా ఫోటో ఓటర్ స్లిప్‌లను తప్పకుండా తీసుకొని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్టలో కాంగ్రెస్ జోరు

గడపగడపకూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

పట్టణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం ఎమ్మెల్యే హామీ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో యాదగిరిగుట్ట పట్టణంలో రాజకీయ వేడి పెరిగింది. కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎన్నికల ప్ర చారంలో దూసుకుపోతున్నారు. సోమవారం పట్టణంలోని 9వ వార్డ్‌లో , 10వ వార్డుల్లో ఆయ న విస్తృతంగా పర్యటించి, ఓటర్లను అభ్యర్థించారు.

**ప్రజాపాలనే మా ఆయుధం..** ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అయిలయ్య ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న 'ప్రజాపాలన' ద్వారా ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలోని వైఫల్యాలను ఎండగట్టిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు తీరును ప్రజలకు వివరించారు. అభివృద్ధికి పట్టాభిషేకం చేయండి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తే, యాదగిరిగుట్ట పట్టణ రూపురేఖలను మారుస్తాం. మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరాకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది' అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక అభ్యర్థులకు ప్రజల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులతో నేరుగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బిక్షపతి, వాణి భరత్ గౌడ్, ధనలక్ష్మి మధుకర్, నవీన్, పాండురాజు శీను, కాటంరాజు పాల్గొన్నారు.

## నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన పోరాట యోధుడు పిచ్చిరెడ్డి

ఘనంగా కామ్రేడ్ పిచ్చిరెడ్డి శతజయంతి



**ప్రజాపక్షం/తుంగతుర్తి (నాగారం) :** నాగారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, గ్రామ మాజీ సర్పంచ్, సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ గుంటకండ్ల పిచ్చిరెడ్డి శతజయంతిని సోమవారం సామాజిక ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంగరి వెంకట్రామ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంలో నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప పోరాట యోధుడు అని కొనియాడారు. పేద ప్రజలు, కార్మికులు, కర్షకుల సమస్యలపై పోరాటం చేసి విజయాలు సాధించిన యోధుడని అన్నారు. 1962 నుండి 1982 వరకు ఉమ్మడి సూర్యాపేట తాలూకా సిపిఐ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారని చెప్పారు. నాగారంలో సిండికేట్ బ్యాంక్, ఎస్‌సి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ మంజూరు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు మాట్లాడుతూ కామ్రేడ్ గుంటకండ్ల పిచ్చిరెడ్డి ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు పాటుపడాలని కోరారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. పెత్తందారులకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడి పోరాడిన ఆయన అనంతరం ప్రజాప్రతినిధిగా ప్రజలచేత ఎన్నికై వారికి 25 సంవత్సరాలపాటు సేవలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ, సామాజిక ఆలోచన వేదిక కార్యదర్శి నీలా శ్రీనివాస్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, అశోక్ కుమార్, రాజారాం, జనార్ధన్ పాల్గొన్నారు.

# బాలల రక్షణ కోసం నిరంతర తనిఖీలు



సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** వెట్టిచాకిరికి, నిరాధరణకు గురైన బాలబాలికలకు, తప్పిపోయి వచ్చిన బాలలను గుర్తించి సంరక్షించడంలో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. జిల్లాలో జనవరి నెలలో నెలరోజుల పాటు జిల్లా పోలీసు, జిల్లా యంత్రాంగం, జిల్లా సంక్షేమం, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, హెల్త్ మొదలగు డిపార్టుమెంట్‌ల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంను పగడ్బందిగా నిర్వహించామన్నారు. ఆపరేషన్ స్మైల్ పూర్తయిన సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు సమావేశం నిర్వహించి స్మైల్ కార్యక్రమంలో బాగా పనిచేసి ఎక్కువ పిల్లలను సంరక్షించడంలో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా నిరాదరణకు, వెట్టిచాకిరికి గురవుతున్న 176 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సంరక్షకులకు క్షేమంగా అప్పగించడం జరిగిందన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు 56 మంది బాలలు ఉండగా వీరిలో 49 మంది బాలురు, 7గురు బాలికలు ఉన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 120 మంది బాలలు ఉండగా వీరిలో 80 మంది బాలురు, 40 మంది బాలికలు ఉన్నారని ఎస్‌పి తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా రిస్క్యూ టీమ్స్ వివిధ ప్రదేశాల్లో వీరందరిని గుర్తించి వీరికి రక్షణ కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, పోలీస్ ఐటి ఆర్ఎస్‌ఐ రాజశేఖర్, చైల్డ్ సంరక్షణ అధికారులు రవి, నాగుల్‌మీరా, స్మైల్ బృందం ఎస్‌ఐ మల్లేశం, ఏఎస్‌ఐ వెంకన్న, స్మైల్ టీమ్స్ సిబ్బంది ఉన్నారు.

## 118 బాల కార్మికులకు విముక్తి

ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ:** ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా జిల్లాలో రికార్డ్ స్థాయిలో బాల కార్మికులకు నల్లగొండ జిల్లా పోలీసు శాఖ విముక్తి కల్పించిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఒక్క జనవరి నెలలో 92 కేసులలో 118మంది బాల కార్మికుల రెస్క్యూ కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు.పలకా బలపం పట్టి బడి బాట పట్టాల్సిన బాలలను వెట్టిచాకిరీతోనే బంధీ అయిపోతున్న పసిబాల్యాన్ని తమ చేతులతో ఒడిసి పట్టుకుని వారిని పోలీస్ శాఖ విముక్తి చేసిందన్నారు.ఒక్కరు కాదుఇద్దరు కాదుఏంకంగా 118 మంది పసిపిల్లల భవితవ్యం అంధకారంలో మునిగిపోకుండా కాపాడిందన్నారు.నల్లగొండ జిల్లా పరిధిలోని మూడు సబ్ డివిజన్లలో అడిషనల్ ఎస్‌పి రమేష్,పోలీస్ శాఖ ఏహెచ్‌టియు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ ,వివిధ డిపార్ట్మెంటు అధికారుల సమన్వయంతో టీమ్‌లుగా ఏర్పడి ఒక్క జనవరి నెలలోనే 92 కేసుల్లో 118 మంది పిల్లలను రెస్క్యూ చేయడం వీరిలో 105 మంది బాలలు 13 మంది బాలికలు వీరంతా ఎక్కువగా ఇతర రాష్ట్రాలు బీహార్,చత్తీష్ఘాడ్, ఒరిస్సా,యూపీ,ఆంధ్రప్రదేశ్ కి చెందిన వారు కావడం గమనార్హం అన్నారు.

## శ్రీయోగానంద లక్ష్మినృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మి నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సోమవారం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిన శ్రీయోగానంద లక్ష్మి నృసింహ స్వామి ఆలయాన్ని పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో రూ. కోటి లతో గెస్ట్‌హౌజ్ నిర్మిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నాయకులు కిషన్ రావు, బైరబోయిన సైదులు, కోమటి సోమయ్య, ధర్మకర్తలు శ్రీధర రెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో టిక్కెట్ల లొల్లి

**పార్టీ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ 27వ వార్డు అభ్యర్థి కోడి శివ**



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్ల లొల్లి వడవలేదు. మున్సిపల్ ఎన్నికల్లో ఆయా వార్డుల నుండి టిక్కెట్లను ఆశిస్తున్న అభ్యర్థులు అధికంగా ఉన్నారు. దీనికితోడు పార్టీలో రెండు వర్గాలు ఉండడంతో ఇరు వర్గాలకు చెందిన నాయకులు టిక్కెట్ తమకంటే తమకంటూ పట్టుపడుతున్నారు. టిక్కెట్ల కేటాయింపులు జరగకముందే టిక్కెట్ వస్తుందనే ధీమాతో ఆశావహులు అనేక మంది నామినేషన్ దాఖలాలు చేసి ఏకంగా వార్డుల్లో ప్రచారాన్ని కూడా కొనసాగిస్తున్నారు. ఎన్నికల అధికారులకు బిఫామ్ సమర్పించేందుకు కేవలం ఒక్క రోజే గడువు ఉండడంతో ఎవరికి వారు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పలానా వ్యక్తికి పలానా వార్డులో టిక్కెట్ ఖరారైందని లీకులు బయటకు రావడంతో పార్టీ కోసం కష్టపడ్డ మాకు టిక్కెట్ ఇవ్వకపోవడం ఏమిటంటూ కొంత మంది నామినేషన్ ఇప్పటికే దాఖలు చేసిన అభ్యర్థులు పార్టీ పెద్దలను ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగుతున్నారు. ఈ క్రమంలో సోమవారం 25వ వార్డు నుండి టిక్కెట్ ఆశిస్తూ ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన కోడి శివ అనే నాయకుడు తనకు టిక్కెట్ ఖరారు కాలేదని బిఫామ్ వచ్చే అవకాశం లేదని తెలుసుకొని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్దకు తన అనుచరులతో వచ్చి ఆందోళనకు దిగారు. తనకు టిక్కెట్ ఖరారు చేస్తూ బిఫామ్ ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానటూ ముందుగానే తన వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడ ఉన్న వారు అప్రమత్తమై అతనిని బలవంతంగా నిలువరించారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఇక్కడ కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి బ్రతికుంటే తనకు ఈ పరిస్థితి వచ్చేది కాదంటూ కంట తడి పెట్టుకున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం 11వ వార్డు రాయినిగూడెం నుండి కౌన్సిలర్ టిక్కెట్ ఆశిస్తున్న ఎల్గూరి ఇందిరా కూడా తన అనుచరులతో పార్టీ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో పోలీసులు రంగంలోకి దిగి వారిని అక్కడి నుండి పంపించారు. ఈ పరిస్థితి చూస్తుంటే మరో రెండు మూడు రోజులు టిక్కెట్ ఆశించి భంగపడ్డ వారు మరింత ఆందోళనలకు దిగే అవకాశం లేకపోలేదు.

## 50 ఏండ్లు నిండిన రజక వృత్తిదారుడికి రూ.4వేల పింఛన్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రజక వృత్తి చేసుకునేటటువంటి వారికి 50ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి రూ.4వేల పింఛను మంజూరు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ రూపొందించిన 2026 సంవత్సరం క్యాలెండర్‌ని జిల్లా అధ్యక్షులు రేవల్లి అంజయ్య అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యాలయం మాగ్దూమ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ యొక్క కార్యక్రమానికి బొడ్డుపల్లి కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న రజకులు,రజక వృత్తిదారులు అనేక సమస్యలపై కొట్టుమిట్టాడుతున్నారని ప్రభుత్వాలు మారిన వారి జీవితాలు మారటం లేదని అన్నారు.గత ఉమ్మడి రాష్ట్రంలో తీసుకొచ్చినటువంటి రజక సామాజిక వర్గానికి ఉపయోగపడే చట్టాలన్నిటిని అన్ని శాఖల ద్వారా అమలు అయ్యేటట్టు చూడాలని డిమాండ్ చేశారు.ప్రధానం గా దేశంలో 18 రాష్ట్రాలు,రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్‌సి జాబితాలో ఉన్న రజకుల లాగానే తెలంగాణ రాష్ట్రంలోని రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో రజక సొసైటీలకు సబ్సిడీరుణాలు మంజూరు చేస్తామని ఆన్లైన్ చేసుకున్నటువంటి సొసైటీలు అన్నిటికీ ఈ ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వృత్తి సంఘాల నాయకులు పబ్బు వీరస్వామి,ఎల్.శ్రవణ్ కుమార్,వి.లెనిన్, కే.ముత్తయ్య తదితరులుపాల్గొన్నారు.

## పట్టణ పేదలందరికీ గృహ యోగం కలగాలి

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** పట్టణ స్థానిక సంస్థల్లో ఆదాయ సమీకరణ, బడ్జెట్ నిర్వహణ అంశాలపై జరిగిన పార్లమెంటరీ హౌసింగ్, పట్టణ వ్యవహారాల స్థాయి కమిటీ సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలపై గళం విప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన పట్టణ స్థానిక సంస్థలను తక్షణమే ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని బలంగా కోరారు. తద్వారా రాష్ట్రంలో మెప్మాపి ఎంఏవై (యు) 2.0 పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసి, నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయవచ్చని ఆయన కమిటీకి వివరించారు. అలాగే, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 27 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్న ప్రక్రియను ప్రస్తావిస్తూ, ఈ విస్తరించిన ప్రాంతాల్లోని పేదలకు కూడా పిఎంఏవై ప్రయోజనాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ కేటాయింపులు, పథకాల అమలులో ప్రాధాన్యత ఇస్తేనే పట్టణ ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని కిరణ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికల విధులు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం యాదాద్రి 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఆలేరు, యాదగిరిగుట్ట, భువనగిరి మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియ పనులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నియమ, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఇప్పటి వరకు వార్డుల వారీగా ఒక్కొక వార్డులో ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. అందులో ఎంతమంది అభ్యర్థులు నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. విత్ డ్రా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల పార్టీలకు సంబంధించి ఫార్మ్ ఏ, ఫారం బి సమర్పించారా అని ఆరా తీశారు. ఎన్నికల సంఘం ఆదేశాలను తూచా తప్పక పాటిస్తూ పోటీలో ఉన్న అభ్యర్థులకు ఆల్ఫాబెటికల్ ఆర్డర్ ప్రకారం ఎన్నికల కమిషన్ ఇచ్చిన గుర్తులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సిఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 4న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మిర్యాలగూడ రూరల్ పర్యటన సందర్భంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి మిర్యాలగూడ సమీపంలోని గూడూరు వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్న బహిరంగ సభ, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని, బహిరంగ సభ వేదిక, బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలకు కుర్చీలు, తాగునీరు, బ్యారికేడింగ్, అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే అప్రోచ్ రోడ్లు, హెలిప్యాడ్, బ్యారికేడింగ్, భద్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వివిధ శాఖలకు కేటాయించిన విధులను తూ.చా తప్పకుండా పాటించాలన్నారు. వారి వెంట సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్, డిఎస్పీ రాజశేఖర్‌రాజు, ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీపీవో శంకర్ నాయక్, మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మంచి భవిష్యత్తు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపాలిటి స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను డీఎస్పీ రాజశేఖర్‌రాజు సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని, కావునా విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో మాతంగి రమేష్, ఎంఈవో ధర్మానాయక్, రాజారత్నం, రామకృష్ణారెడ్డి, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, సాహిద్, అనిల్ కిరణ్, శోభారాణి, మనోహరి, అరుణ, శ్రీలేఖ, సావిత్రి, సతీష్, పీఈటీలు ఇందిరా, వినోద, పీడీలు పాల్గొన్నారు.

# పేదల జీవనాడిని మోదీ సర్కార్ లాగేసుకుంది

### ఎంజి నరేగా రద్దుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపాటు




**న్యూఢిల్లీ:** 'ఎంజినరేగా' రద్దుపై మరోసారి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. గత రెండు దశాబ్దాల క్రితం యుపిఎ ప్రభుత్వం ప్రారంభించిన ఉపాధిహామీ పథకం పేదల ప్రజలకు జీవనాడి అని, అయితే అహంకార పూరిత మోదీ ప్రభుత్వం దానిని రద్దు చేసిందని మండిపడ్డారు. ఈ మేరకు ఖర్గే సోమవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'సరిగ్గా 20 సంవత్సరాల క్రితం, కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం నుండి ఈ పథకాన్ని ప్రారంభించింది. భారత ప్రభుత్వం ఇప్పటివరకు ఎంజినరేగా కోసం దాదాపు రూ. 10.63 లక్షల కోట్లు ఖర్చు చేసింది, ఇది ఉపాధిహామీ కార్మికులకు రోజుకు రెండుసార్లు ఆహారం పొందడానికి, వారి పిల్లలకు విద్యను అందించడానికి, ఆరోగ్య సంరక్షణను పొందడానికి, వలసలను నిరోధించడానికి, దోపిడీ నుండి వారిని విముక్తి చేయడానికి సహాయపడింది. నరేగా ద్వారా, మొత్తం దాదాపు 4,879 కోట్ల దినాల ఉపాధిని సృష్టించారు. ఫలితంగా, దాదాపు 10.10 కోట్ల గ్రామీణ ఆస్తులు సృష్టించబడ్డాయి' అని ఆయన హిందీలో తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పంచాయతీల ఖర్చులో దాదాపు 40 శాతం నరేగాపైనే అని ఖర్గే అన్నారు. ఇది మహాత్మా గాంధీ 'గ్రామ స్వ రాజ్' దార్శనికతకు జీవం పోసిందని స్పష్టం చేశారు. అయితే నేడు దురహంకారపూరితమైన, పేద వ్యతిరేక మోదీ ప్రభుత్వం కోట్లాది మంది పేద కార్మికుల జీవనాధారాన్ని లాక్కుందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా 'సేవ్ ఎంజినేరగా ప్రచారం' కింద, కాంగ్రెస్ పార్టీ మన కార్మికులు, కార్మికుల గొంతును లేవనెత్తుతూనే ఉంటుంది. ఈ నిరంకుశ ప్రభుత్వం తలవంచాల్సి ఉంటుంది! ఎంజినరేగాను తిరిగి స్థాపించాల్సి ఉంటుంది' అని ఆయన నొక్కి చెప్పారు. ఎం జి నరేగాను తిరిగి తీసుకురావడానికి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ప్రచారాన్ని ప్రారంభించింది. పాత చట్టం స్థానంలో ఇటీవల కేంద్ర తీసుకువచ్చిన 'విబి – జి రామ్ జి' చట్టాన్ని వ్యతిరేకంగా నిరసనలు నిర్వహిస్తోంది.

**రాజస్థాన్‌లో కాంగ్రెస్ నిరసన**

నరేగాను పునరుద్ధరించాలని, రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి–జి రామ్ జి) కోసం వీక్షిత్ భారత్ హామీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాజస్థాన్ జైపూర్‌లో నిషాహీద్ స్మారక్ వద్ద పలువురు కాంగ్రెస్ నాయకులు, సామాజిక కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన సందర్భంగా, మజ్దూర్ మహాపంచాయతీ జరిగింది. సభను ఉద్దేశించి కార్యకర్త అరుణ రాయ్ మాట్లాడుతూ విబి–జి రామ్ జి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. నరేగా గ్రామీణ పేదలకు రాష్ట్రం నుండి ఉపాధిని డిమాండ్ చేసే చట్టపరమైన హక్కును ఇచ్చిందన్నారు. కానీ కొత్త చట్టం ఆ హక్కును తీసివేస్తుందని, ఉపాధిని కేంద్ర ప్రభుత్వ విచక్షణపై ఆధారపడి చేస్తుందని, తద్వారా ప్రజాస్వామ్య హక్కులను బలహీనపరుస్తుందని, ప్రోత్సహిస్తుందని రాయ్ అన్నారు. మరో కార్యకర్త నిఖిల్ దే మాట్లాడుతూ ప్రతిపాదిత చట్టం ఉపాధికి హామీ ఇవ్వదని, బదులుగా కార్మికులకు అభద్రతకు హామీ ఇస్తుందన్నారు.

### మత మార్పిడీ చట్టాలపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం


# కేంద్రం, 12 రాష్ట్రాలకు నోటీసులు




**న్యూఢిల్లీ:** మతమార్పిడి చట్టాలపై దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి (పిఐఎల్) ప్రతిస్పందనలు ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంతోపాటు 12 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మత మార్పిడులకు వ్యతిరేకంగా చేసిన చట్టాలకు ఉన్న చెల్లుబాటును సవాలు చేస్తూ ఎన్‌సిసిఐ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చస్ ఇన్ ఇండియా) దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం కోరింది. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాజస్థాన్,ఉత్తరప్రదేశ్, ఒడిసా,ఛత్తీస్‌గఢ్, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, హర్యానా,మధ్యప్రదేశ్, కర్ణాటక,హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలున్నాయి. కేంద్రం, రాష్ట్రాల నుండి ప్రతిస్పందనలు వచ్చిన తర్వాత విచారణ ప్రారంభమవుతుంది. మత మార్పిడులు జరుగుతున్నాయనే పేరుతో పనిచేస్తున్న ప్రోత్సాహకాల లబ్ధి పొందుతున్న కొన్ని గ్రూపులు ఫిర్యాదులు చేయడంవల్ల కొన్ని రాష్ట్రాలలో ఇలాంటి చట్టాలు చేశారని ఎన్‌సిసిఐ తన వ్యాజ్యంలో కోర్టుకు తెలియజేసింది. ఐతే కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విజ్ఞప్తులను తోసిపుచ్చారు. ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తన తీర్పు ద్వారా ఈ చట్టాలను సమర్థించిందని గుర్తుచేశారు. ఈ తాజా పిటిషన్లతో పాటు ఇప్పటికే న్యాయస్థానం వద్ద అపరిష్కృతంగా ఉన్న సంబంధిత పిటిషన్లను కూడా ఈ విచారణకు జత చేస్తారు. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసు విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఇంకా ఇదేవిధంగా రాష్ట్రాలు చేసిన చట్టాలను కూడా సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయని, ఐతే కేంద్ర ప్రభుత్వంతన సమాధానాన్ని ఇప్పటికే సిద్ధం చేసిందని, త్వరలోనే న్యాయస్థానానికి తమ ప్రతిస్పందనను లిఖితపూర్వకంగా సమర్పిస్తామని ధర్మాసనానికి తుషార్ మెహతా తెలియజేశారు. ఎన్‌సిసిఐ తరపున సీనియర్ న్యాయవాది మీనాక్షి అరోరా ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. ఒడిసా, రాజస్థాన్ రాష్ట్రాలు కూడా వేరువేరుగా మత మార్పిడులకు వ్యతిరేకంగా చట్టాలు చేశాయని, వారు కూడా తమ సమాధానాలతో ముందుకు రావాల్సి ఉందని అరోరా అన్నారు. ఐతే ఇంతకుముందు దాఖలైన పిటిషన్లలో ఈ రెండు రాష్ట్రాల చట్టాలను సవాలు చేయలేదు. అందువల్ల న్యాయమూర్తులందరికీ ఈ నోటీసులు అందవలసి ఉందని అప్పటివరకూ వేచి ఉండాలని ఆమె కోరారు. "నోటీసులు ఇవ్వండి, ఆ యా రాష్ట్రాల ప్రభుత్వాలకు చెందిన అడ్వకేట్ జనరల్స్‌కు కూడా ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం ప్రతులను జారీ చెయ్యండి, నాలుగు వారాలలో సమాధానం రావాల్సి ఉంటుంది, ఉమ్మడి అఫిడవిట్‌ను వారంతా సమర్పించమనండి, దానికి ఉన్న ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఏమిటో చెప్పమనండి, ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణకు తీసుకుంటుంది'' అని జస్టిస్ సూర్యకాంత్ జారీ చేసిన ఉత్తర్వు ప్రకటించింది.

# టివికె రాకతో మారిన ఎన్నికల ముఖచిత్రం

### అధికారం మాదే: విజయ్



**న్యూఢిల్లీ:** టివికె పార్టీ రాకతో తమిళనాడులో రాజకీయ వాతావరణం మారిందని అధినేత విజయ్ తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తుందని అన్నారు. తమిళగ వెట్రి కళగం పార్టీని ప్రారంభించి సోమవారంతో రెండేళ్ల పూర్తి చేస్తుకున్న సందర్భంగా విజయ్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సవాళ్లు ఎదురైనా టివికె స్థిరంగా ఉందని, సామాన్య ప్రజలకు సాధికారత కల్పించే రాజకీయాల కోసం దీనిని ఒక ఉద్యమంగా అభివర్ణించారు. '2026 అసెంబ్లీ ఎన్నికల క్షేత్రం గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త పరిస్థితిని ఎదుర్కొంటోంది. దీనికి ఏకైక కారణం మన రాజకీయ రాక అని అందరూ అంటున్నారు. అందుకే ఈ క్షేత్రాన్ని మనమే సొంతం చేసుకుందాం. స్పష్టమైన, నైపుణ్యం కలిగి వ్యూహంతో, అధికార రాజకీయాల్లో గుర్తింపు వైపు ముందుకు సాగుతాము. ప్రజలందరి మద్దతుతో, దృఢ సంకల్పం, ఐక్యతతో రంగంలోకి దిగి పోరాడుదాం. పాలనా పగ్గాలను చేజిక్కించుకునే ప్రజాస్వామ్య లక్ష్యాన్ని మనం దృఢంగా సాధిస్తాం' అని విజయ్ ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**అవినీతి, దుష్టశక్తులను ఓడించేది టివికెనే : విజయ్**

తమిళనాడులో అవినీతి, దుష్టశక్తులను టివికె ఓడించగలదని విజయ్ చెప్పారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'దుష్టశక్తులను ఓడించాలంటే, పవిత్ర శక్తి అయిన టివికెనే అవసరం. మేమే టాప్ ఇంజిన్. ప్రజలు విజిల్ గుర్తుకు ఓటేయేలా మీరు కృషి చేయాలి. టివికె తమిళ రాజకీయాల్లో విజిల్ బ్లోయర్. మీ విజిల్ శబ్దం అవినీతిపరులను భయపెట్టి పారిపోయేలా చేయాలి. అది టివికె పాలక శక్తిని ఉత్తేజపరుస్తుంది. డీఎంకే చేసే తప్పులను మేము ప్రశ్నిస్తూనే ఉంటాం. ఇంతకు ముందు ఎవరూ దీన్ని ధైర్యంగా చేయలేదు' అని విజయ్ అన్నారు. తనపై వస్తున్న విమర్శల గురించి విజయ్ స్పందించారు. నటుడిగా రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఎన్‌జీ రంగా ఎదుర్కొన్న విమర్శలను గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి కూటమి సహా బహుముఖ పోటీ ఏర్పడే అవకాశం ఉందని విజయ్ చెప్పారు.

# పెండింగ్‌లో కేంద్ర బకాయిలు

### రాజ్యసభ నుంచి టిఎంసి ఎంపిలు వాకౌట్



**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్‌కు కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆ పార్టీ ఎంపిలు రాజ్యసభలో మరోసారి లేవనెత్తారు. సోమవారం ఉదయం సభ సమావేశమైన కొద్దిసేపటికే వారు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కేంద్రం పశ్చిమ బెంగాల్‌కు రూ. 2 లక్షల కోట్లు బాకీ ఉందని రాజ్యసభలో పార్టీ ఉప నాయకురాలు సాగరిక ఘోష్ ఆరోపించారు. బడ్జెట్‌లో బెంగాల్ గురించి ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం, బెంగాల్ బకాయిలు ఇప్పటికీ నిలిచిపోవడంతో సోమవారం రాజ్యసభలో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) వాకౌట్ చేసింది. ఎంజి నరేగా, ఆవాస్ యోజన వివిధ విభాగాల కింద బెంగాల్‌కు రూ. 2 లక్షల కోట్లు రావాల్సి ఉందని ఘోష్ పిటిఐకి వెల్లడించారు. ఇది సమాఖ్య నిర్మాణాన్ని, కేంద్ర,రాష్ట్ర సంబంధాలను, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని ఆరోపించారు. ఆదివారం సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో పశ్చిమ బెంగాల్‌ను విస్మరించారని ఘోష్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో బెంగాల్‌ను విస్మరించడానికి ఎంచుకున్న విధానం వల్లే తాము ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తామని, వాకౌట్ చేశామని ఆమె అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ఓటమి పాలైన తర్వాత కేంద్రం రాష్ట్రంపై వివక్ష చూపుతోందని రాజ్యసభ ఎంపి మమతా ఠాకూర్ ఆరోపించారు. 2021లో బెంగాల్ ప్రజలు బిజెపిని నిర్దయాత్మకంగా తిరస్కరించినప్పటి నుండి, కేంద్రం ఎంజినరేగా వేతనాలను నిరోధించడం, రోడ్లు, గ్రామీణ మౌలిక సదుపాయాలకు నిధులను నిలిపివేయడం, పేదలు, అణగారిన వర్గాల కోసం ఉద్దేశించిన సంక్షేమ సంబంధిత కేటాయింపులను నిలిపివేయడం ద్వారా సమాఖ్య బాధ్యతకు బదులుగా ప్రతీకార వైఖరితో స్పందించిందని టిఎంసి నాయకులు అన్నారు. 'రాష్ట్రంపై ఈ క్రమబద్ధమైన వివక్ష ఆమోదయోగ్యం కాదని నొక్కి చెబుతూ, ఈ తీవ్రమైన అన్యాయానికి నిరసనగా, టిఎంసి రాజ్యసభ ఎంపిలు పార్లమెంటు నుండి వాకౌట్ చేశారు. బెంగాల్‌కు సరైన బకాయిలు లభించే వరకు పార్లమెంటు లోపల, వెలుపల మేము మా గొంతును లేవనెత్తుతూనే ఉంటాము' అని ఆమె పేర్కొన్నారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**
**ఫారం - C**
**ప్రకటన**

(చట్టంలోని సెక్షన్ – 11 క్రింద 10 A మినహాయింపు ఇవ్వబడినది)
(రూల్ 6/12 చూడుము)

గెజిట్ నెం. GHMC-12 తేది: 27.01.2026
నెం. C/37/2026 తేది: 27.01.2026

తెలంగాణ ప్రభుత్వం/ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ) & కమిషనర్, జిహెచ్ఎంసి వారికి ప్రజా ప్రయోజనం కోసం రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామంలో మొత్తం 4427.31 చదరపు గజాలు ప్రతిపాదిత 60 మీటర్ల వెడల్పు రహదారి విస్తరణ కోసం H-CITI కింద గచ్చిబౌలి ఫ్లైఓవర్ నుండి మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్ వరకు బొటానికల్ గార్డెన్ (అంజయ్య నగర్ నుండి రామ్కీ టవర్ రోడ్డు) వరకు భూమి అవసరమని భావించడమైనది.

కాబట్టి, పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామంలో సుమారుగా 4427.31 చదరపు గజాల ప్రామాణిక కొలత గల భూమిని సేకరించడానికి ప్రతిపాదించబడినట్లుగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది, దాని వివరణాత్మక వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| క్ర సంఖ్య | ప్రాంగణం నెం. / సర్వే నెం | [illegible] | [illegible] | సేకరణ క్రింద విస్తీర్ణం చ.గ. లలో | ఆసక్తి గల వ్యక్తి పేరు | సరిహద్దులు | | | | చెట్లు | | కట్టడాలు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | తూర్పు | పశ్చిమం | ఉత్తరం | దక్షిణం | రకం | సంఖ్య | రకం | [illegible] |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 1-60/30/1/134 | - | - | 36.66 | శ్రీ పి.మఘురం చౌదరి | లొకేషన్ స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 2 | 1-60/30/1/134 | - | - | 36.66 | శ్రీ పి.ప్రకాష్ చౌదరి | | | | | - | - | - | - |
| 3 | 1-60/30/1/134 | - | - | 9.22 | శ్రీ అజహర్ హుస్సేన్ | | | | | - | - | - | - |
| 4 | 1-60/30/2/134 | - | - | 95.77 | శ్రీమతి ఎం.వసంత | | | | | - | - | - | - |
| 5 | 1-60/A/3 | - | - | 110.44 | శ్రీమతి పోని దేవి చౌదరి | | | | | - | - | - | - |
| 6 | ప్లాట్ నెం.4, సర్వే నెం.134 | - | - | 110.00 | శ్రీమతి కళావతి | | | | | - | - | - | - |
| 7 | 1-60/30/11/134 | - | - | 26.11 | ఎల్ నరసింగరావు | | | | | - | - | - | - |
| 8 | 1-60/30/8/5 | - | - | 160.44 | శ్రీ చెల్లూరి శ్రీనివాస్ | | | | | - | - | - | - |
| 9 | 1-60/8/6 | - | - | 121.00 | శ్రీ మంథని సుధాకర్ | | | | | - | - | - | - |
| 10 | 1-60/30/8/134 | - | - | 65.11 | శ్రీ పవన్ కుమార్ | | | | | - | - | - | - |
| 11 | 1-60/30/9/134 | - | - | 55.55 | శ్రీ నవీన్ చౌదరి | | | | | - | - | - | - |
| 12 | 1-60/30/7/134 | - | - | 140.00 | గణేష్ గౌడ్ & కె.సుచిత్ర | | | | | - | - | - | - |
| 13 | 1-60/30/7/134/1 | - | - | 19.44 | శ్రీమతి కె.భాగ్యమ్మ | | | | | - | - | - | - |
| 14 | సర్వే నెం. 134 | - | - | 192.22 | ఆలయ ఆస్తి | | | | | - | - | - | - |
| 15 | 1-60/30/12 | - | - | 10.44 | శ్రీమతి గంగాదేవి చౌదరి | | | | | - | - | - | - |
| 16 | 1-60/34/1 | - | - | 31.66 | ఎల్. దశరథ రామ రెడ్డి | | | | | - | - | - | - |
| 17 | 1-60/36 | - | - | 97.55 | శ్రీ పి.శ్రీనివాసరావు | | | | | - | - | - | - |
| 18 | 1-60/38/A | - | - | 112.33 | శ్రీమతి ఓ సాయిలు | | | | | - | - | - | - |
| 19 | ఉత్తర భాగం 1-60/30/10/A | - | - | 55.00 | శ్రీమతి కమలా దేవి | | | | | - | - | - | - |
| 20 | దక్షిణ భాగం 1-60/30/10/A | - | - | 54.78 | శ్రీ ప్రకాష్ చౌదరి | | | | | - | - | - | - |
| 21 | 1-60/30/10 & 1-60/30/9/5/9 | - | - | 163.33 | శ్రీ చి.కార్తీక్ రెడ్డి | | | | | - | - | - | - |
| 22 | 1-60/30 | - | - | 132.00 | శ్రీ ఇ.గోపాల్ & ఇ.జైపాల్ | | | | | - | - | - | - |
| 23 | 1-60/30/118/136 | - | - | 136.66 | శ్రీమతి మాయా అగర్వాల్ | | | | | - | - | - | - |
| 24 | 1-60/30/89/136/1 | - | - | 121.00 | శ్రీ కె గణేష్ గౌడ్ | | | | | - | - | - | - |
| 25 | 1-60/30/90/136 | - | - | 11.44 | శ్రీ కె.రవీంద్ర | | | | | - | - | - | - |
| 26 | 1-88/136 | - | - | 63.22 | 1. డాక్టర్ అమరేందర్ రెడ్డి, 2. సి.శ్రీధర్ రెడ్డి, 3. పి.సుదర్శన్ రెడ్డి | | | | | - | - | - | - |
| 27 | సర్వే నెం. 136 | - | - | 116.66 | M/s. ఎస్‌సి కార్పొరేషన్ | | | | | - | - | - | - |
| 28 | 1-60/30/34/136 & 2-62/A/4/1 | - | - | 573.33 | శ్రీ మహమ్మద్ షహనాజ్ ఖానా | | | | | - | - | - | - |
| 29 | 1-60/30/7/136 | - | - | 240.00 | శ్రీమతి మసరత్ బేగం | | | | | - | - | - | - |
| 30 | 1-60/30/9/136 | - | - | 34.89 | శ్రీ జగత్ కుమార్ గౌడ్ | | | | | - | - | - | - |
| 31 | 1-60/30/5/136 | - | - | 110.00 | శ్రీమతి విద్యా బాయి | | | | | - | - | - | - |
| 32 | 1-60/30/6/136 | - | - | 110.00 | శ్రీ సి.వెంకట రాజు | | | | | - | - | - | - |
| 33 | 1-60/30/10/136 | - | - | 30.77 | శ్రీ ఎం.నీలావతి | | | | | - | - | - | - |
| 34 | 1-60/30/11/136 | - | - | 19.44 | శ్రీ.రవికాంత్ | | | | | - | - | - | - |
| 35 | 1-60/30/12/136 | - | - | 11.66 | శ్రీమతి.పి.భారతమ్మ & శ్రీ పి.ప్రతాప్ రెడ్డి | | | | | - | - | - | - |
| 36 | 1-60/4 | - | - | 126.44 | శ్రీ బాబీ వెంకటేష్ | | | | | - | - | - | - |
| 37 | 1-60/30/1/136 | - | - | 156.22 | శ్రీ సయ్యద్ మొహియుద్దీన్ అలీ ఖాన్ | | | | | - | - | - | - |
| 38 | 1-60/2 | - | - | 152.22 | శ్రీ చదవ తరుణ్ రెడ్డి | | | | | - | - | - | - |
| 39 | 1-60/20/1 | - | - | 47.55 | శ్రీ కె.నిఖిల్ రెడ్డి & కె. నరసింహారెడ్డి | | | | | - | - | - | - |
| 40 | 1-60/3/P& 1-60/3 | - | - | 112.22 | శ్రీ నాదెళ్ల శ్రీనివాస్ | | | | | - | - | - | - |
| 41 | 1-60/8 | - | - | 212.44 | శ్రీమతి లీలా దేవి మరియు సంతోషి దేవి | | | | | - | - | - | - |
| 42 | సర్వే నెం. 136 | - | - | 123.00 | పోచమ్మ మైసమ్మ దేవాలయం | | | | | - | - | - | - |
| 43 | 1-60/1 | - | - | 82.44 | శ్రీ బి రాజశేఖర్ రెడ్డి | | | | | - | - | - | - |
| | మొత్తం | | | 4427.31 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013) సెక్షన్–11(1) యొక్క సవరించబడిన భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయ బద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు చట్టం 2016 (చట్టం నెం. 21 ఆఫ్ 2017) ఏర్పాట్ల క్రింద సంబంధితులు అందరికీ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) & కమిషనర్, GHMC, హైదరాబాద్ వారి కార్యాలయంలో ఉంచబడిన భూమి యొక్క ప్లాన్‌ను ఏదేని పని రోజున కార్యాలయ పని వేళల్లో తనిఖీ చేసుకొనగలరు. తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్–సహిత–సముచిత ప్రభుత్వం అధీకృత అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, కమిషనర్, GHMC, హైదరాబాద్ వారిని మరియు వారి సర్వే సిబ్బందిని సర్వే భూమి నందు ప్రవేశించుటకు మరియు భూమిని సర్వే చేయుటకు, ఏదేని భూమి యొక్క లెవల్స్ తీసుకొనుటకు, సబ్–సాయిల్‌ను తవ్వుటకు లేదా బోరు వేయుటకు మరియు సదరు చట్టం యొక్క సెక్షన్ – 12 నందు ఏర్పాటు చేయబడిన మరియు నిర్దిష్ట పరిచిన విధంగా తమ పని కొరకు అవసరమైన అన్ని ఇతర చర్యల్ని చేపట్టు నిమిత్తం వారిని అధీకృతుల్ని చేయుటకు సమ్మతించినారు.

చట్టం యొక్క సెక్షన్–11(4) క్రింద స్పెషల్ కలెక్టర్ వారి ముందస్తు అనుమతి లేకుండా సదరు ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏ వ్యక్తి అయినా సదరు భూమికి సంబంధించి ఏ విధమైన లావాదేవీ నిర్వహించుట కానీ, ఏదేని లావాదేవీ కొరకు ప్రేరేపించుట కానీ అనగా విక్రయం / కొనుగోలు, వగైరా లేదా సదరు భూమిపై ఏవేని తాకట్టు రుణభారాలు కల్పించుట కానీ చేయరాదు.

ఒకవేళ సేకరణకు సంబంధించి ఏవేని అభ్యంతరములు ఉన్న యెడల మరియు సంప్రదింపు ద్వారా నష్ట పరిహారం సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తి గల / బాధిత వ్యక్తులు అందరి నుండి ఏవేని క్లెయిములు ఉన్నచో చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజుల్లోగా స్పెషల్ కలెక్టర్ / అధీకృత అధికారి సమక్షమున ఫైల్ చేయవలెను.

సం/–
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ. సే.),
జి. హెచ్.ఎం.సి., హైదరాబాద్.

సం/– స్పెషల్ కలెక్టర్, (భూ. సే.) &
కమీషనర్, జి. హెచ్.ఎం.సి., హైదరాబాద్.

DIPR No. 1098/LA/PP-Advt/Agency/2025-26


# 25 శాతం తగ్గనున్న పదో తరగతి సిలబస్..

### వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు చేయనున్న కేరళ

**తిరువనతంపురం :** విద్యారంగంలో ముందుండే రాష్ట్రంగా గుర్తింపు తెచ్చుకున్న కేరళ.. మరో కీలక మార్పు దిశగా అడుగులేయబోతుంది. పదో తరగతి విద్యార్థులపై అకడమిక్ భారాన్ని తగ్గించేందుకు 25 శాతం సిలబస్ తగ్గించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని కేరళలోని కొల్లాంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి వి.శివకుట్టి ప్రకటించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచే ఈ నిర్ణయం అమలవుతుందని ఆయన వెల్లడించారు. విద్యార్థులపై ప్రస్తుతం సిలబస్ ఎక్కువగా ఉండటంతో ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సిలబస్ తగ్గించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అక్కడి ప్రభుత్వాన్ని చాలా కాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో నిపుణుల సూచన మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి సిలబస్‌ను 25 శాతం తగ్గించనున్నారు. ఇందుకు సంబంధిత కమిటీ ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న సిలబస్‌లో 25 శాతం తగ్గుతుందని, అయితే, కంటెంట్ మాత్రం మారకుండా చూసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలని, ఒత్తిడి తగ్గించాలనే లక్ష్యంతోనే, విశాల దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

# తమిళనాడు–కర్ణాటక జలవివాదంపై ట్రిబ్యునల్

### నెలరోజుల్లో నోటిఫికేషన్: కేంద్రానికి 'సుప్రీం' ఉత్తర్వు



**న్యూఢిల్లీ:** తమిళనాడు–కర్ణాటక మధ్య జల వివాద పరిష్కారానికి, పెన్నానదీ జలాల సమాన పంపిణీకోసం ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మార్గదర్శనం చేసింది. ఈ మేరకు నెల రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ మార్గదర్శనం చేసింది. "ఈ రెండు రాష్ట్రాలమధ్య జల వివాద పరిష్కారానికి ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ అధికారిక గజెట్‌లో నోటిఫికేషన్ జారీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం దూరంగా ఉండటానికి గకారణం మాకు కనిపించలేదు, అందువల్ల సమస్య పరిష్కారం నిమిత్తం ఈ రోజు నుండి నెలరోజులలోపు ఒక నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది'' ఉత్తర్వులో ధర్మాసనం తెలియజేసింది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య పెన్నానదీ జలాల పంపిణీపై వివాదాలున్నాయి. ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వం 2018 లోనే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 1892 నాటి ఒప్పందానికి కర్ణాటక కట్టుబడి ఉండాలని కోరింది. ఈ ఒప్పందం ప్రకారం పొరుగురాష్ట్రం తమిళనాడుకు చెప్పకుండా, ఎలాంటి సమాచారం, ప్రణాళికలు ఇవ్వకుండా నదిపై ఎలాంటి చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ జలాల దారి మళ్ళింపు చర్యలూ చేపట్టకూడదని, ఇలాంటి చర్యలను అడ్డుకోవాలని తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరింది. నదిని దారి మళ్ళించి చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్న కర్ణాటక ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకించింది. రాష్ట్రాలమధ్య ప్రవహించే ఈ నదీ జలాలు జాతీయ ఆస్తి అని, ఏ రాష్ట్రం ప్రత్యేకంగా ఇదంతా మాదే అని ప్రకటించుకునే అవకాశం లేదని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన తన పిటిషన్‌లో వాదించింది. దక్షిణ పెన్నార్ నదిని కర్ణాటకలో దక్షిణ పినాకిని, తమిళనాడులో పెన్నైయార్,పొన్నైయార్ అనీ పిలుస్తారు. తమిళనాడులో 497 కి.మీ పరీవాహకప్రాంతం గల రెండో అతిపెద్ద నది పెన్నైయార్. కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్ళాపుర జిల్లా నందిహిల్స్ పెన్నానది జన్మస్థానం కావడంతో కర్ణాటక ప్రభుత్వం పెద్ద గొంతుతో వాదిస్తోంది. పెన్నానదికి రెండు రాష్ట్రాల లోనూ 3,690 చదరకు కి.మీ పరీవాహకప్రాంతం ఉంది. వర్షాకాలంలో తప్ప దాదాపు ఏడాది అంతా ఈ నదిలో నీటి ప్రవాహం ఉండదు. కర్ణాటకలో పరిశ్రమల మురికినీరు ఈ నదిలోనే కలుస్తూ ఉండటం మరో వివాదంగా ఉంది.

### ఎఐ విమాన ప్రమాదంపై

# దర్యాప్తు జరుపుతున్నాం

### రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానమిచ్చిన పౌర విమానయాన మంత్రిత్వ శాఖ



**న్యూఢిల్లీ :** గత ఏడాది జూన్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలను దర్యాప్తు చేస్తున్నామని, దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. 260 మంది మృతి చెందిన ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) దర్యాప్తు చేస్తోంది. భారతదేశంలో అత్యంత దారుణమైన విమాన ప్రమాదాలలో ఒకటి, జూన్ 12, 2025న అహ్మదాబాద్ నుండి లండన్ గాట్విక్‌కు వెళ్లే ఎయిర్ ఇండియా బోయింగ్ 7878 విమానం ఎఐ 171 అయిన వెంటనే కూలిపోవడంతో 241 మంది ప్రయాణికులు సహా మొత్తం 260 మంది మరణించారు. ఎఎఐబి దర్యాప్తు పురోగతిలో ఉందని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ సోమవారం రాజ్యసభకు తెలిపారు. 'ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ఆయన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. గత ఏడాది జులై 12న విడుదలైన ఈ ప్రమాదంపై ప్రాథమిక నివేదికలో, విమానం రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా ఒక సెకను వ్యవధిలో నిలిపివేయబడిందని, దీని వలన అయిన వెంటనే కాక్‌పిట్‌లో గందరగోళం ఏర్పడిందని ఎఎఐబి తెలిపింది. 'కాక్‌పిట్ వాయిస్ రికార్డింగ్‌లో, పైలట్‌లలో ఒకరు మరొకరిని ఎందుకు ఆపివేసారని అడుగుతున్నట్లు వినబడింది. మరొక పైలట్ తాను అలా చేయలేదని ప్రతిస్పందించాడు' అని ఆయన చెప్పారు.

### బిజెపి స్కామ్ బయటపెడతానన్న

# 10 రోజులకే అజిత్ మృతి

### దాదా' మరణంపై సంజయ్ రౌత్ అనుమానం



**ముంబయి :** మహారాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణంపై శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ అనుమానం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ కుంభకోణాన్ని బయటపెడుతానని బిజెపిని బెదిరించిన 10 రోజుల్లోనే ఆయన మరణించారని తీవ్ర ఆరోపణలు చేశారు. బిజెపితో తెగదెంపులు చేసుకుని ఎన్‌సిపిలో తిరిగి విలీనం కావాలని అజిత్ పవార్ నిర్ణయం తీసుకున్నారని ఆయన వెల్లడించారు. ఈ పరిణామాలన్నింటిని పరిశీలిస్తే ఆయన మరణం అనుమానాస్పదంగా కనిపిస్తుందని అన్నారు. 'అజిత్ దాదా మరణంపై కచ్చితంగా ప్రశ్నలు తలెత్తుతాయి, అలాగే ప్రశ్నించాలి కూడా. మహారాష్ట్రకు చెందిన అజిత్ పవార్ లాంటి కీలక నేత విమాన ప్రమాదంలో మరణించిన తీరు, వెలుగులోకి వస్తున్న వాస్తవాలపై విచారణ జరపాలి. ఈ విషయంలో ఏదో అనుమానాస్పదంగా ఉందని నేను అనుకుంటున్నాను. ఈ ప్రశ్నలను అజిత్ దాదా పార్టీ వారే లేవనెత్తుతున్నారు. ఆయన మరణం అనుమానాస్పదంగా ఉంది. అజిత్ పవార్ చాలా రోజుల నుంచి బిజెపి స్కామ్‌కు సంబంధించిన ఫైల్ తన వద్ద ఉందని చెబుతున్నారు. దీనిని బయటపెడతానని ఇటీవలే జనవరి 15న కూడా చెప్పారు. ఆయన చెప్పిన పది రోజులకే మరణించారు. ఇవన్నీ చూస్తే అనుమానాస్పదంగా కనిపిస్తుంది. బిజెపి స్కామ్‌కు సంబంధించిన ఫైల్ ఉందని చెప్పినప్పటి నుంచే నాకు అనుమానంగానే ఉంది. వీటిని గమనిస్తే బిజెపితో తెగదెంపులు చేసుకోవాలని అజిత్ పవార్ నిర్ణయించుకున్నట్లే ఉన్నారు. తిరిగి శరద్ పవార్‌తో కలిసి పని చేయాలని నిర్ణయం తీసుకున్నట్లే కనిపిస్తుంది. స్వయంగా ఉపముఖ్యమంత్రే స్కామ్ గురించి బయటపెట్టారు. ఇరిగేషన్ బడ్జెట్‌ను ఎక్కువగా పెంచి వాటిని పార్టీ నిధులకు మళ్లించారని అజిత్ పవార్ చెప్పారు. అజిత్ పవార్ లాంటి ముఖ్య నేత ప్రయాణించే విమానంలో ఓఎస్‌డీ సహా కీలకమైన వ్యక్తులు ఎవరూ లేరు. ఇంకా ఆ విమానానికి ఎలాంటి మెయింటెనెన్స్ సర్టిఫికెట్ లేదు.

# డిప్యూటీ సిఎంగా సునేత్ర వెనుక బిజెపి 'సూత్రధారి'

### శివసేన (యుబిటి) అధికారక పత్రిక సామ్నా సంపాకీయంలో ఆరోపణలు

**ముంబయి :** తన భర్త అజిత్ పవార్ నిష్క్రమించిన కొద్ది రోజులకే, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఎన్‌సిపి నాయకురాలు సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం చేయడం వెనుక బిజెపి నాయకత్వం 'సూత్రధారి' అని ప్రతిపక్ష శివసేన (యుబిటి) సోమవారం పేర్కొంది. సేన (యుబిటి) అధికార పత్రిక 'సామ్నా'లోని సంపాదకీయం కూడా బిజెపి నాయకత్వం, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సునీల్ తట్కరే, ప్రఫుల్ పటేల్ రెండు ఎన్‌సిపి వర్గాల ఏకీకరణను కోరుకోవడం లేదని ఆరోపించింది. పుణె జిల్లాలోని బారామతి వద్ద జరిగిన విమాన ప్రమాదంలో ఎన్‌సిపి నాయకురాలు అజిత్ పవార్, మరో నలుగురు మరణించిన మూడు రోజులకే, రాష్ట్ర తొలి మహిళా డిప్యూటీ సిఎంగా సునేత్రా పవార్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ పరిణామం జరిగిన వేగంపై కొన్ని వర్గాల నుండి విమర్శలు వచ్చాయి. ప్రత్యర్థి ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత, అజిత్ పవార్ బాబాయ్ శరద్ పవార్ శనివారం తన ప్రమాణ స్వీకారం గురించి తనకు తెలియదని పేర్కొన్నారు. సునేత్రా పవార్ డిప్యూటీ సిఎం పదవి అలంకారప్రాయంగా ఉండకూడదని, ఆమె 'గుంగి గుడియా' (మూగ బొమ్మ) కాకపోవచ్చునని, సమర్థవంతంగా పనిచేయవచ్చని సంపాదకీయం పేర్కొంది. ఎన్‌సిపి 'సనాతన భావాలు కలిగిన' బిజెపితో పొత్తులో ఉందని, తన భర్త మరణానంతర కర్మలు పూర్తి కాకముందే సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం చేయడం హిందూత్వ విశ్వాసాలకు సరిపోదని అది పేర్కొంది. సునేత్రా పవార్ డిప్యూటీ సిఎంగా ఎవరి కోరిక అనేది మహారాష్ట్ర ముందున్న ప్రశ్న అని, ఎందుకంటే ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షురాలు శరద్ పవార్, దాని వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సులే, లేదా పవార్ కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియదని సంపాదకీయం పేర్కొంది. సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం కోసం బారామతి నుండి ముంబైకి వెళ్తున్నట్లు కనీస సూచన కూడా ఇవ్వలేదని అది పేర్కొంది. ఈ రాజకీయాల వెనుక బిజెపి నాయకత్వం 'సూత్రధారి' అని ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) పేర్కొంది. అజిత్ పవార్ మరణం తర్వాత పవార్ కుటుంబంలో, మహారాష్ట్ర రాజకీయాల్లో చిక్కులు పెరిగాయి. ఈ సమస్యలు పరిష్కారం కాకూడదని చాలామంది కోరుకుంటున్నారు' అని సామ్నా సంపాదకీయంలో పేర్కొన్నారు. అజిత్ పవార్ మరణం తర్వాత, కొంతమంది నాయకులు మరింత ప్రతిష్టాత్మకంగా మారడంతో, పార్టీలో డిప్యూటీ సిఎంగా బాధ్యతలు స్వీకరించడానికి పోటీ ఏర్పడటంతో ఎన్‌సిపిలో అశాంతి నెలకొందని సంపాదకీయం పేర్కొంది. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి కచ్చితంగా స్వతంత్రంగా పోటీ చేస్తుందని, శివసేన, ఎన్‌సిపి నుండి చాలా మంది ఎమ్మెల్యేలు కాషాయ పార్టీలో చేరుతారని సంపాదకీయం పేర్కొంది.

# పని హక్కుపై ఉక్కుపాదం!

ఉపాధి కల్పించలేని ప్రభుత్వాలు ఎవరికి ప్రయోజనం. ఏటా కోటి ఉద్యోగాల హామీ దశాబ్దానికిపైగా అటకపైనే ఉంది. 2006 ఫిబ్రవరి 2న గ్రామీణ ఉపాధికి హామీ ఇచ్చే 'ఎంజినరేగా' చట్టం వచ్చినప్పుడు, దేశ చరిత్రలో ఒక కీలక మలుపుగా పేర్కొన్నారు. కానీ మోదీ సర్కారు ఆ ఉన్నతాశయంతో చేసిన చట్టాన్ని అటకెక్కించి, 'విబి – జి రామ్ జి'ని ప్రవేశపెట్టడం ముమ్మాటికీ పని హక్కుపై ఉక్కుపాదం మోపడమే. ప్రతిపక్ష పార్టీలు సోమవారం పార్లమెంటులో పలు అంశాలు లేవనెత్తాయి. విస్తృత చర్చకు డిమాండ్ చేశాయి. గ్రామీణ భారత సమాజంలో ఉపాధి అనేది కేవలం ఆదాయం పొందే మార్గంగా మాత్రమేగాక, జీవన భద్రత, ఆత్మగౌరవం, సామాజిక స్థిరత్వం, ప్రజాస్వామ్య భాగస్వామ్యం వంటి అనేక అంశాలతో ముడిపడి ఉన్న ఓ కీలక అవసరం. రెండు దశాబ్దాల క్రితం వచ్చిన 'ఎంజినరేగా' గ్రామీణ పేదలకు పని దయ కాదు, హక్కు అనే భావనను అందించింది.

రెండు దశాబ్దాల పాటు ఆ చట్టం గ్రామీణ జీవితాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేసింది. అదే చట్టాన్ని పూర్తిగా భర్తీ చేస్తూ కొత్త వ్యవస్థను తీసుకురావడం పట్ల ఇప్పుడు సహజంగానే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ వ్యతిరేకత వెనుక రాజకీయ భావోద్వేగా లు కంటే లోతైన సామాజిక, ఆర్థిక, రాజ్యాంగ సంబంధిత కారణాలే ఎక్కువ గా ఉన్నాయి. పాత గ్రామీణ ఉపాధి చట్టం ఒక హక్కు ఆధారిత చట్టం. గ్రామీణ ప్రాంతంలో నివసించే ఏ పౌరుడైనా పని కావాలంటూ దరఖాస్తు చేస్తే, నిర్దిష్ట కాలవ్యవధిలో పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండేది. పని ఇవ్వలేకపోతే పరిహారం చెల్లించాల్సిన నిబంధన కూడా ఉండేది. ఈ చట్టం ఒక సంక్షేమ పథకం కాదు. ఒక చట్టబద్ధమైన హక్కు. ఈ భావన రాజ్యాంగంలోని దిశానిర్దేశక సూత్రాల నుంచి ప్రేరణ పొందింది. గ్రామీణ పేదరికాన్ని ఎదుర్కొనే బాధ్యత రాష్ట్రానిదే అనే భావన దీనిలో నిక్షిప్తమై ఉంది. కొత్త చట్టం ఈ హక్కు భావనను బలహీనపరుస్తోంది. ఇప్పుడు పని పౌరుల డిమాండ్ ఆధారంగా కాకుండా, ప్రభుత్వ ప్రణాళికలు, బడ్జెట్ పరిమితులు, ఎంపిక చేసిన ప్రాంతాల ఆధారంగా మాత్రమే అందుబాటులోకి వస్తోంది. పాత వ్యవస్థలో డిమాండ్ ఆధారిత ఉపాధి ఒక కీలక బలంగా ఉండేది. గ్రామంలో వర్షాలు పడకపోయినా, పంటలు నష్టపోయినా, మార్కెట్ పరిస్థితులు దెబ్బతిన్నా, ప్రజలు వెంటనే పని కోరగలిగేవారు. అవసరాన్ని ప్రాతిపదికగా తీసుకున్న కారణంగా, పని అవసరం పెరిగినప్పుడు ఖర్చును కూడా పెంచేవారు. కానీ, కొత్త విధానంలో ముందుగా కేటాయించిన బడ్జెట్ మేరకే పని ఉంటుంది. ఎంత అవసరం ఉన్నా, కేటాయింపు పూర్తయిన తర్వాత పని నిలిచిపోతుంది. ఇది గ్రామీణ జీవితం ఎదుర్కొనే అనిశ్చిత పరిస్థితులకు సరైన స్పందన కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రకృతి మీద, వ్యవసాయం మీద ఆధారపడినది. అక్కడ అవసరాలు ముందుగా అంచనా వేయడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. అలాంటి పరిస్థితుల్లో హక్కు స్థానంలో పరిపాలనా హామీ మాత్రమే ఉండటం పేదల భద్రతను తగ్గిస్తుంది. సంవత్సరంలో రెండు నెలలు ఉపాధిని పూర్తిగా నిలిపివేయడం కొత్త చట్టంలో మరో ప్రధాన అభ్యంతరం. ఈ విరామం వ్యవసాయ పనుల కాలంతో ముడిపడి ఉందని చెప్పబడుతున్నప్పటికీ, వాస్తవ ప్రభావం మాత్రం భిన్నంగా ఉంటుందని విమర్శకులు చెబుతున్నారు. గ్రామీణ ఉపాధి హామీ ఉన్నప్పుడు, కూలీలకు ఒక ప్రత్యామ్నాయ అవకాశం ఉండేది. వ్యవసాయ యజమానులు తక్కువ కూలి ఇవ్వాలనుకున్నప్పుడు, కూలీలు ప్రభుత్వ పనికి వెళ్లే అవకాశం ఉండేది. ఈ పరిస్థితి వల్ల కూలీలకు తమదైన ఎంపిక ఉండేది. కొత్త వ్యవస్థలో రెండు నెలల విరామంతో కూలీలు పూర్తిగా ప్రైవేట్ యజమానులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల తక్కువ వేతనాలు, అసురక్షిత పనిపరిస్థితులు పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా భూమిలేని కూలీలు ఈ మార్పుతో ఎక్కువగా నష్టపోతారు. స్థానిక స్వయం పాలనపై ప్రభావం కూడా వ్యతిరేకతకు ఒక ప్రధాన కారణం. పాత చట్టంలో గ్రామ పంచాయతీల పాత్ర అత్యంత కీలకం. గ్రామానికి ఏ పనులు అవసరం, ఎక్కడ నీటి సంరక్షణ చేయాలి, ఏ రహదారి అవసరం, ఏ చెరువు పూడిక తీయాలి వంటి నిర్ణయాలు గ్రామస్థాయిలోనే తీసుకునేవారు. ఈ ప్రక్రియలో గ్రామ సభలు, ప్రజల భాగస్వామ్యం కీలక పాత్ర పోషించేవి. దీనివల్ల గ్రామీణ ప్రజాస్వామ్యం బలోపేతమైంది. కొత్త చట్టంలో ఈ అధికారాలు పైస్థాయికి వెళ్లిపోవడం ఆందోళనకరం. పనుల ప్రణాళికలు, ప్రాధాన్యతలు కేంద్రస్థాయిలో జరిగితే, గ్రామ పంచాయతీలు కేవలం అమలు చేసే యంత్రాంగంగా మారిపోతాయి. ఇది భారత రాజ్యాంగంలో ప్రతిపాదించిన వికేంద్రీకరణ సూత్రాలకు విరుద్ధమని విమర్శలు వస్తున్నాయి.

ఆర్థిక కోణంలో చూస్తే, రాష్ట్రాలపై పెరుగుతున్న వ్యయం మరో ప్రధాన సమస్యగా మారింది. పాత వ్యవస్థలో రాష్ట్రాల వాటా తక్కువగా ఉండేది. దీనివల్ల ఆర్థికంగా బలహీనమైన రాష్ట్రాలు కూడా ఉపాధి పనులను విస్తృతంగా అమలు చేయగలిగాయి. కొత్త చట్టంలో రాష్ట్రాలపై భారీ వ్యయాన్ని మోపుతున్నారు. ఇప్పటికే అప్పులు, ఆదాయ లోటు, సంక్షేమ వ్యయాలతో ఇబ్బంది పడుతున్న రాష్ట్రాలకు ఇది అదనపు భారం అవుతుంది. ఫలితంగా కొన్ని రాష్ట్రాలు ఖర్చును భరించలేక పనులను పరిమితం చేసే అవకాశం ఉంది. అలా జరిగితే ఉపాధి హక్కు కాగితాలకే పరిమితమై, వాస్తవంలో గ్రామీణ పేదలకు అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉంది. పారదర్శకత, సామాజిక తనిఖీల విషయంలో కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ఆస్తుల సృష్టి విషయంలో కూడా పాత చట్టం కీలక పాత్ర పోషించింది. చెరువులు, కాలువలు, గ్రామ రహదారులు, నీటి సంరక్షణ నిర్మాణాలు వంటి లక్షలాది ఆస్తులు ఈ చట్టం ద్వారా వృద్ధి చెందాయి. ఇవి కేవలం ఉపాధి కల్పించడమే కాకుండా, దీర్ఘకాలిక గ్రామీణ అభివృద్ధికి పునాదిగా నిలిచాయి. కొత్త వ్యవస్థలో ప్రాధాన్యతలు మారడం వల్ల ఇలాంటి స్థానిక అవసరాల ఆధారిత ఆస్తుల సృష్టి తగ్గిపోతుందనే భయం ఉంది. కేంద్రస్థాయి ప్రణాళికలు స్థానిక అవసరాలను పూర్తిగా ప్రతిబింబించలేవన్న భావన కూడా దీనికి తోడవుతోంది. ఏ రకంగా చూసినా ఎంజినరేగాతో పోలిస్తే కొత్త చట్టం భారత గ్రామీణ అవసరాలకు ఏమాత్రం అనువుగా లేవు. ఈ చట్టాన్ని ఉపాధి హక్కుపై గొడ్డలిపెట్టుగా ప్రతిపక్షాలు అభవర్ణించడంలో ఏమాత్రం తప్పులేదు.



## కేంద్రం తెచ్చిన కొత్త చట్టం ఓ లోపం

రెండు దశాబ్దాల క్రితం యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక పరివర్తనాత్మక చట్టం. ఇటీవల కేంద్ర తీసుకొచ్చిన కొత్త పథకం ఒక లోపం. పాత పథకాన్ని కొత్త పథకం బుల్డోజ్ చేసింది. ఈ 20 ఏండ్లలో గ్రామీణ ప్రజలకు ఈ పథకం 180 కోట్ల పనిదినాలను కల్పించింది. అంతేగాక దాదాపు 10 కోట్ల సామాజిక ఆస్తులను సృష్టించింది. ఈ పథకం వలసలను తగ్గించింది. గ్రామపంచాయతీలను బలోపేతం చేసింది. గ్రామీణ పేదలు అధిక వేతనాలు పొందే శక్తిని ఇచ్చింది. ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన వారికి నేరుగా వారి ఖాతాల్లోనే నగదు బదిలీ అయింది. ఉపాధి హామీ పథకం కింద సన్నకారు రైతులకు వారి సొంతభూముల్లో బావులు తవ్వడం లాంటి సాగునీటి సదుపాయాలు సమకూరాయి.

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి
జైరామ్ రమేశ్



## మహిళా వైద్యుల అంకితభావాన్ని అభినందించలేమా !

1849లో అమెరికాలో వైద్య పట్టా పొందిన తొలి మహిళ 'డాక్టర్:ఎలిజబెత్ బ్లాక్‌వెల్' జన్మదినాన్ని పురస్కరించుకుని 2016 నుండి ఫిబ్రవరి 03న జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం (నేషనల్ ఉమెన్ ఫిజీషియన్స్‌డే) జరుపుకుంటున్నాం. పవిత్రమైన వైద్య వృత్తి నుండి మహిళలను దూరంగా ఉంచిన అడ్డంకులను ఈ చారిత్రాత్మక సంఘటన బద్దలు కొట్టింది. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవ వేదిక వైద్యరంగంలో మహిళల అంకిత భావం, పోరాట పటిమ, కరుణ హృదయాలను హైలైట్ చేస్తుంది, అదే సమయంలో కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధన, పౌర సమాజ మద్దతు అవసరాన్ని పరిష్కరించడానికి దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, వైద్య పరిశోధనా రంగాల్లో అద్భుతమైన నైపుణ్యాలు, సహానుభూతి, రోగుల సంరక్షణ, వృత్తి నిబద్ధత కలిగి తమ జీవితాలను వైద్యరంగానికి అంకితంచేసిన మహిళా వైద్యులు ఎందరో ఉన్నారు.

**వైద్యరంగంలో లింగ అసమానతలు:** ప్రస్తుతం దాదాపు 35శాతం మంది వైద్యులు మహిళలు ఉన్నప్పటికీ, వైద్యపరంగా మరింత మెరుగైన లింగ సమానత్వాన్ని కోరుతున్నారు. ఈ రోజు మహిళా వైద్యులు అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి, అడ్డంకులు లేకుండా నడిపించడానికి సమగ్ర వాతావరణాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది. మహిళా ఫిజీషియన్లు రోగులను నయం చేయడమే కాకుండా, రేపటితరం మహిళా వైద్యులకు స్ఫూర్తినిస్తున్నారు. పౌర సమాజ జీవితాలను మెరుగుపరచడం, రోగులను జాగ్రత్తగా చూసుకోవడం, ఆధునిక వైద్యం యొక్క సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం లాంటి అంశాల్లో వారి నిబద్ధతను అభినందించాలి. మూడింట ఒక వంతు మహిళా వైద్యులందరూ కార్యాలయంలో లైంగిక వేధింపులు, ఎక్కువమంది లింగ పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నారు.

**భారతదేశంలో మహిళా వైద్యులు:** భారతదేశంలో 19వ శతాబ్దం చివరలో పాశ్చాత్య ఆధునిక వైద్యాన్ని మొదటగా అభ్యసించిన డాక్టర్: ఆనందీబాయి జోషి (1886), డాక్టర్: కాదంబినీ గంగూలీ (1886) వంటి మహిళామణులు ఇతర మహిళా వైద్యులకు మార్గదర్శకులుగా నిలిచారు. ప్రస్తుతం ఎంబిబిఎస్ విద్యార్థులలో దాదాపు 50శాతం మంది మహిళలు ఉండడం లింగ అంతర నివారణకు గొప్ప సంకేతం. సంఖ్య పెరుగుతున్నప్పటికీ, భారతదేశంలోని మొత్తం వైద్యుల్లో 14.2శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. డాక్టర్: ఆనందీబాయి జోషి (మొదటి భారతీయ మహిళా వైద్యురాలు), డాక్టర్: కేతన్యున్ అర్దేశిర్ దిన్షా (మొదటి మహిళా రేడియోథెరపిస్ట్), డాక్టర్: ఇందిరా హిందూజా (మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీని ప్రసవించారు), డాక్టర్: మంజుల అనగాని (లాపరోస్కోపిక్ సర్జన్), డాక్టర్: గగన్‌దీప్ కాంగ్ (రాయల్ సొసైటీ మొదటి మహిళా ఫెలో) వంటి మేటి మహిళా వైద్యులు భారతదేశ వైద్యరంగానికి చారిత్రాత్మక కృషి చేశారు. వైద్యులకు వృత్తి వ్యక్తిగత జీవన సమతుల్యత, మానసిక ఆరోగ్య మద్దతు అవసరాన్ని గుర్తిద్దాం. ప్రస్తుత పౌర సమాజం, తల్లిదండ్రులు తమ యువ బిడ్డలు, బాలికలను వైద్యరంగంలోకి రావడానికి ప్రోత్సహించాలి. మహిళల వైద్యరంగ ప్రవేశం, సమానత్వ సాధనలకు సహాయపడే ఉద్యమాన్ని ప్రారంభించండి. మహిళా వైద్యుల అద్భుతమైన విజయాలను కొనియాడడం, సహోద్యోగులు సహాయపడడం, స్నేహితుల ప్రోత్సాహం, కుటుంబ సభ్యులచేయూత, పౌర సమాజం మద్దతు ఇవ్వడం మన కనీస కర్తవ్యంగా భావిద్దాం.

(ఫిబ్రవరి 03న 'జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం'సందర్భంగా)

డాక్టర్ బుర్ర మధుసూధన్ రెడ్డి, 9949700037

# పడిపోయింది రూపాయి విలువ కాదు, ప్రభుత్వం విలువ!



ప్రొ॥ దేవరాజు మహారాజు

"రూపాయి పడిపోవడం దేశ ఆర్థిక వ్యవస్థకి చాలా మంచిది" – అని సెలవిచ్చారు నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు. అందుకే కాబోలు దేశ ఆర్థికమంత్రి సంతోషంగా ఉన్నారు. నిజమే మరి! ఆయన చెప్పిన లాజిక్కే అధికారంలో ఉన్న దేశ నాయకులంతా పాటిస్తున్నట్లుంది. కాలుష్యం ఆరోగ్యానికి మంచిది అని పర్యావరణ మంత్రి ఆనందంగా ఉన్నారు. ఢిల్లీతో పాటు దేశంలోని ప్రధాన నగరాలు కాలుష్యమయమైపోయినా, ఆయన నోరు విప్పడం లేదు. ఇండిగో విమానాల రద్దు దేశంలో పెద్ద సమస్యగా తయారైనా, విమాన శాఖా మంత్రి ఎంత సంతోషంగా ఉంటున్నారో చెప్పలేం. పైగా ఈయన తెలుగువాడు. మోడి చంకలో చేరి, ఆయనకు ఊతమిచ్చి నిలబెట్టిన ఎన్‌డిఎ భాగస్వామి పార్టీ సభ్యుడు. ఈ దెబ్బతో తెలుగు వారి ప్రతిభ ప్రపంచవ్యాప్తం చేశాడు. తెలుగు దేశం పార్టీ సభ్యులే కాదు, తెలుగు వాళ్ళంతా చంకలు గుద్దుకుని ఎగిరి గంతేయాల్సిన సందర్భం! "బరువైన వస్తువులు వేగంగా కింద పడతాయి. అలాగే భారతదేశపు రూపాయి బరువుగా ఉంటుంది కనుక, త్వరత్వరగా కింద పడిపోతుంది" – ఈ వ్యాఖ్య ప్రతిపక్షాల వారిది కాదు. స్వయానా అధికార పక్షం లోకసభ బిజెపి యం.పి కంగనా రనౌత్ జీ అన్నదే! బిజెపి వారి పరువు తీయడానికి ప్రతిపక్ష సభ్యులు అవసరం లేదు. వాళ్ళ పరువు వారే తీసుకోగల సమర్థులు. ఇదిగో ఇలాంటి వాళ్ళకే పద్మశ్రీలు కూడా దక్కుతూ ఉంటాయి.

రూపాయి విలువ పడిపోయి, దేశ ఆర్థిక వ్యవస్థ బలపడిన సందర్భంలో దేశ ఆర్థిక మంత్రి ఒకే ఒక్క మాట ఎంతో నిజాయితీగా చెప్పారు. " నేను డా. మన్ మోహన్ సింగ్ లాగా కాదలుచుకోలేదు" అని! నిజమే మరి! ఆయన చదువూ, విజ్ఞత, దార్శనికత ఎక్కడ? మోడి భక్తురాలైన ఈమె అవగాహనా స్థాయి ఎక్కడ? పైగా ఈమె తెలుగింటి కోడలు. అందువల్ల తెలుగువాళ్ళు తమ వీపు తామే చరుచుకుని అభినందించుకోవాల్సిన సందర్భం! మన తెలుగువారు పి.వి. నరసింహారావు ప్రధాని అయినప్పుడు ఆయనకు ఆర్థిక రంగం గురించి తెలియకపోయినా, డా.మన్ మోహన్ సింగ్ వంటి ప్రొఫెసర్ ను తన ఆర్థిక మంత్రిగా చేసుకుని ఆర్థిక వ్యవస్థను స్థిరపరిచారు. తర్వాత మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యాక పరిస్థితిని మరింతగా మెరుగు పరిచారు. ఆ తర్వాత దేవగౌడ, ఐ.కె.గుజ్రాల్ వంటి వారు ప్రధానులయిన కాలంలో కూడా రూపాయి విలువ ఇంతగా దిగజారలేదు.

ఇక బిజెపి పూర్తి మెజారిటీతో గెలిచి, నరేంద్ర మోదీ ప్రధాని కావడంతో ఈ దేశ ప్రజలందరూ ఎంతో ఆశించారు. మంచి మెజారిటీతో గెలిచిన ప్రభుత్వం గనుక, చాలా మంచి పనులు చేస్తూ ప్రజారంజకమైన పరిపాలన అందిస్తారని ఆశించారు. కానీ, వారి ఆశ అడియాసే అయింది. మోదీ ప్రభుత్వం ఆర్థికరంగాన్నే కాదు, క్రమంగా అన్ని రంగాలనూ దిగజార్చుతూ వచ్చింది. నోట్ల రద్దుతో దేశానికి పెద్ద దెబ్బ తగిలింది. దాని ప్రభావంతో వందలమంది చనిపోయారు. ఒక రకంగా దేశ ఆర్థిక వ్యవస్థ అప్పుడే కుప్ప గూలింది. ఆ తర్వాత జి.ఎస్.టి ఎప్పుడైతే ప్రవేశపెట్టారో అప్పుడు మధ్యస్థాయి, కింది స్థాయి పారిశ్రామిక రంగాలన్నీ మూల పడ్డాయి. లక్షల మంది ఉపాధి కోల్పోయారు. మళ్ళీ పుంజుకునే అవకాశం కూడా మోడి ప్రభుత్వం ఆ పరిశ్రమలకు ఇవ్వలేదు. ఇక కొవిడ్ సమయంలో దేశం మరింతగా కుప్పకూలింది. కూలి, నాలి జనానికి బస్సు, రైలు సౌకర్యం కూడా కల్పించలేని నిస్సహాయ స్థితికి ప్రభుత్వం దిగజారింది. పనికిరాని మాటలు తప్ప, స్థూలంగా దేశ పౌరులకు చేసింది ఏమీ లేదు. చెయ్యాల్సింది చేయకుండా – 'చప్పట్లు చరచండి! పళ్ళాలు మోగించండ'ని దేశ ప్రధాని పిలుపు నిచ్చారు. ఏళ్ళు గడుస్తున్నా, ఈ దేశ ప్రజలింకా చప్పట్లు చరిచి ప్లేట్లు మోగిస్తూనే ఉన్నారు. ఎందుకంటే వారికి ఇంత తిండి పెట్టే నాథుడో, ఉపాధి కల్పించే యోధుడో వస్తాడేమోనని!

అమెరికా డాలర్ తో భారతదేశపు రూపాయి 91 అయ్యింది. ఇది ఇంకా ఇంకా పడిపోవచ్చని నిపుణులు చెపుతున్నారు. కేంద్ర మంత్రులు, బిజెపి నాయకులు మాత్రం 'దేశ ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంది' అని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రతి మనిషికి ఆత్మసాక్షి అనేది ఉంటుంది. బహుశా, ప్రస్తుత మన దేశ నాయకులకు అదంటే ఏమిటో కూడా తెలియనట్టుంది. డా. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు రూపాయి విలువ కొద్దిగా పడిపోయింది(సుమారు 53 రూపాయలు). అప్పుడు ఇదే మోడీజీ దాన్నొక పెద్ద సమస్యగా చిత్రించి నాటి ప్రభుత్వాన్ని నానా మాటలు అన్నారు. అప్పుడు కొద్దిగా పడిపోయిన దానికీ, ఇప్పుడు పూర్తిగా పడిపోయిన దానికీ పోలికే లేదు. గతంలో తను మాట్లాడిన వీడియో క్లిప్పింగ్ చూసుకుని మోడీజీ నాలిక కరుచుకుని, దేశ ప్రజలకు క్షమాపణలు చెపుతారా? అసలు అంత హుందాగా ఆయన ఎప్పుడు ప్రవర్తించారనీ! పైగా ఆయన భక్తులేమో ఇక్కడ విషయాల్ని వక్రీకరించి చెపుతూ ఉంటారు. రూపాయి విలువ ఎంత పడిపోతే దేశ ఆర్థిక వ్యవస్థ అంత బలపడుతుందని వివరణలిస్తారు. ఆర్థికరంగం గురించి ఏమాత్రం పరిజ్ఞానం లేని వారికైనా – అదొక మూర్ఖపు ప్రకటన అని తెలిసిపోవడం లేదా ? రూపాయి విలువ ఇంతగా పడిపోతే అంతర్జాతీయ మార్కెట్లో నిలబడేదెట్లా? నిలదొక్కు కునేది తర్వాత సంగతి! తమ తమ అహాల్ని వదిలి ఆర్థికమంత్రి, ప్రధాని ఆర్థికరంగ నిపుణుల్ని సంప్రదించాలి! పునరుద్ధరణకు పూనుకోవాలి! పన్నెండేళ్ళుగా అధికారంలో కొనసాగుతున్న ఈ ప్రభుత్వం, ఏ రంగం మీద దృష్టి పెట్టిందన్నది ఆత్మ విమర్శ చేసుకోవాలి!

ఒకప్పుడు నమస్తే ట్రంప్‌లాగా ఇప్పుడు నమస్తే పుతిన్ కార్యక్రమం జరిగింది. దేశంలో మారణకాండలు జరిపించిన మోడీజీ విదేశాలలో శాంతి కాముకుడిగా తిరిగొస్తాడు. అక్కడ ఉక్రెయిన్‌ను సర్వనాశనం చేసిన పుతిన్, మరో శాంతి కపోతంలా భారత్ పై ఇలా వాలి అలా వెళ్ళిపోతాడు. ఇక ఇరు దేశాల ప్రజలు ఏదో అద్భుతం జరిగిందన్న భ్రమలో పిచ్చివాళ్ళయి బతుకుతూ ఉండాలి. ఇవన్నీ గమనించే 'సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. ఎన్. శ్రీ కృష్ణ ఇలా అన్నారు. "నేడు పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. నేను ఎక్కడైనా పబ్లిక్ ప్లేస్‌లో నిలబడి ప్రధాన మంత్రి ముఖం నాకు నచ్చలేదు.. అని చెపితే చాలు! అంతే ఇంకా ఏమీ అనునక్కరలేదు. ఆ మాటతో ఎవరైనా నా మీద దాడి చేయొచ్చు. అరెస్ట్ చెయ్యొచ్చు. కారణమేదీ చెప్పకుండానే జైల్లో కూడా వెయ్యొచ్చు–" జస్టిస్ అంతటివాడే అంతగా భయపడుతూ ఉంటే, ఇక సామానుల హక్కుల గూర్చి మాట్లాడేదెవరు?

దేశ ప్రజల కష్టార్జితమైన రూపాయికి విలువే లేదని విమానయాన సంస్థ కూడా ఈ మధ్య రుజువు చేసింది కదా? 2025 డిసెంబర్ 4–8 తేదీల్లో వందల సంఖ్యలో విమానాలు రద్దయి వేలమంది ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. విమానాల రద్దు గురించి వారికి మెసేజో, మెయిలో పంపలేదు. వేలమంది ప్రధాన నగరాల్లోని ఎయిర్ పోర్టులకు పోయి చివరి క్షణంలో విమానాలు రద్దయ్యాయన్న బోర్డులు చూసి నీరుగారిపొయ్యారు. ఆ ప్రయాణాలు కొందరికి ఎంతో ముఖ్యమైనవి కావచ్చు. భావోద్వేగాలకు గురై కొందరు భోరుమని ఏడ్చారు. విమానాలు రద్దయినప్పుడు విమాన సంస్థ ప్రయాణికుల ఛార్జీలు వెంటనే వెనక్కి తిరిగి ఇచ్చేయాల్సింది. ఆ పని వారు చేయలేదు. విమానాశ్రయాల నిర్వహణ కుప్పకూలింది. టి, డ్రింక్స్, స్నాక్స్ అందివ్వక పోవడం – అలా ఉంచి వాష్ రూంలు వాడకానికి పనికిరాకుండా అయ్యాయి. విమానయాన మంత్రిత్వ శాఖ ఉంది. దానికో మంత్రి ఉన్నాడు. సంవత్సరకాలంగా ఇండిగో సంస్థ నిర్వహణ సరిగా లేక విమానాలు రద్దవుతుంటే కేంద్ర ప్రభుత్వమేం చేస్తోంది ? డబ్బులు పోగొట్టుకొని ప్రయాణికులు అల్లలాడుతూ ఉంటే అక్కడేం జరిగిందీ? ప్రజల రూపాయికి విలువే లేదని తేలిపోయింది!!

2014కు ముందు డా.మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఏ ఒక్క విమాన సంస్థనూ బలపడనీయలేదు. ఎక్కువ సంస్థలకు అవకాశమిచ్చారు. అన్నింటినీ ఒక హద్దులో ఉంచారు. ఉదాహరణకు అప్పటి వివరాలు... ఎయిర్ ఏసియా ఒక శాతం – గో ఎయిర్ తొమ్మిది శాతం – ఎయిర్ ఇండియా 18 శాతం – స్పైస్ జెట్18 శాతం, జెట్ ఎయిర్ వేస్ 21 శాతం , ఇండిగో 30 శాతం ఇతరులు 3 శాతం ఉండేవారు. 2014 తర్వాత మోదీ ప్రధాని అయ్యాక పరిస్థితి మారింది. తనకు కావల్సిన వారికి ఎక్కువ మేలు చేస్తూ వచ్చారు. వారినే బలపడనిచ్చారు. ఇప్పటి వివరాలు ఇలా ఉన్నాయి. ఇండిగో 65 శాతం అయితే, ఎయిర్ ఇండియా 18 నుండి 30కి పెరిగింది. మిగతా సంస్థలు 5 శాతం ఉన్నాయి. ఇండిగోకు ఎక్కువ మేలు చేసిన విషయం స్పష్టంగా కనిపిస్తోంది. నిబంధనలకు అనుగుణంగా పనిచేయలేకపోతున్న ఇండిగో తన గుత్తాధిపత్యం వదులుకోలేకపోతోంది. సంవత్సరకాలంగా సమస్యలు సృష్టిస్తున్నా భారత విమాన మంత్రిత్వ శాఖ చోద్యం చూస్తూ ఉంది. 2025 డిసెంబర్ నెల మొదటి రెండువారాలు విమాన సర్వీసులు రద్దయి లక్షల మంది ప్రయాణికులు లబోదిబోమన్నారు. టికెట్ డబ్బులు వారివి వారికి వెంటనే తిరిగి ఇవ్వాలి కదా? అది కూడా చేయలేక పోయారు. దీనికి ప్రధాన కారణం మోదీ, షా వారి మంత్రివర్గ సహచరుడు ఎన్డీఏ భాగస్వామి (తెలుగుదేశం) మంత్రి రామమోహన్ నాయుడి అసమర్థత ! ఆంధ్ర రాష్ట్రంతో సంబంధమున్న ఆర్థికమంత్రీ, విమానయాన మంత్రీ తెలుగువారి పరువు ప్రపంచం ముందు ఏ మాత్రం మిగల్చలేదు –

ఇండిగో సంక్షోభంలో పడడంతో మిగతా ఎయిర్ లైన్స్ విమాన ఛార్జీలు ఉన్నఫళంగా 5–6 రెట్లు పెంచాయి. ఫలితంగా దగ్గరున్న విదేశాలకు అయ్యే ఛార్జీ కంటే దేశంలో మరో నగరానికి వెళ్ళాలంటే ఎక్కువ ఛార్జీ పెట్టాల్సి వచ్చింది. ఇంత ఘోరం జరుగుతూ ఉంటే, ఈ దేశానికి ఓ ప్రధానీ ఓ హోం మంత్రి ఉన్నారు కదా? వాళ్ళెందుకు నోరు మెదపలేదు? ముందు నిలబడి సహాయక చర్యలు చేపట్టడం తర్వాత సంగతి! ఇదీ ప్రస్తుతం దేశ పరిస్థితి ఇక్కడ దేశంలో పెరిగిన ధరలూ, టాక్సులూ చూసి బతుకు భారమైపోవడం చూసి, ఉపాధి లేకపోవడం చూసి, స్వేచ్ఛ లేకపోవడం చూసి యువత ఎలాగోలా విదేశాలకు వెళ్ళిపోవాలనుకుంటోంది. ముందే వెళ్ళిపోయిన వారు తిరిగి రావడానికి సాహసించడం లేదు. ఇక్కడ జైశ్రీరామ్ అంటూ కూచుంటే కడుపునిండే అవకాశం లేదుకదా? పాలకులు ఎంతసేపూ గల్లీల పేర్లు, ఊర్ల పేర్లు, నగరాల పేర్లు మార్చడమే గొప్ప సంస్కరణ అని అనుకుంటున్నారు. బెంగాల్ ఎన్నికలు వస్తున్నాయి గనుక వందేమాతరం గీతాన్ని వివాదాస్పదం చేసి పార్లమెంట్‌లో చర్చకు పెడతారు. దేశ ప్రజల సమస్యలు వీరికి కనపడవు, ఇవన్నీ గమనించే ప్రఖ్యాత రచయిత్రి అరుంధతీ రాయ్ అన్నారు... "భారతదేశం కార్పొరేట్ దేశంగా, హిందూమత రాజ్యంగా, పోలీస్ రాజ్యంగా, భయపెట్టే దేశంగా మారిపోయింది"— అని! "నఫ్రత్ కి బజార్ మె హం మొహబ్బత్ కి దుకాన్ ఖోల్ తే జాయింగే" – విద్వేష పూరితమైన మీ వీధుల్లో మేం ప్రేమ దుకాణాలు తెరుస్తాం!– అన్నది కేవలం ప్రతిపక్ష నేత ఇచ్చిన నినాదం కాదు. అందులో ప్రతి భారతీయుడి గుండె కొట్టుకుంటోంది!

**(రచయిత : సాహితీవేత్త, జీవశాస్త్ర వేత్త)**

# డబ్బుకు కాదు.. ప్రజాస్వామ్యానికి ఓటు

మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది. ఈ పునాదిని ఈ రోజు డబ్బు రాజకీయాలు బలహీనపరుస్తున్నాయి. సేవ, అభివృద్ధి, ప్రజా సమస్యలపై పోటీ ఉండాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పుడు ఖర్చుల పోటీగా మారుతున్నాయనే ఆందోళన పెరుగుతోంది. అభ్యర్థులు గెలుపుకోసం డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేయడం, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర భంగం కలిగిస్తోంది. డబ్బు శక్తి పెరిగితే సామాన్యుడి గొంతు నొక్కబడుతుంది. నైతిక రాజకీయాలు కనుమరుగవుతాయి. ఈ పరిస్థితిని అడ్డుకోవాలంటే ఎన్నికల కమిషన్ కఠిన చర్యలతో పాటు రాజకీయ పార్టీ బాధ్యతాయుత ప్రవర్తన, ప్రజల చైతన్యం తప్పనిసరి. ఎన్నికల ఖర్చులపై పారదర్శకత లేకపోతే, మున్సిపల్ పాలన కూడా డబ్బుకు బానిస అవుతుంది. నగదు పంపిణీ, మద్యం, ఉచితాల పేరుతో లంచాలు ఇవ్వడం.. ఇవన్నీ ఎన్నికల నేరాలుగా పరిగణించి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సోషల్ మీడియా ప్రచార ఖర్చులకు లెక్కలు ఉండాలి. ఫ్లయింగ్ స్క్వాడ్లు కేవలం పేరుకే కాకుండా, ఫలితాలు చూపాలి. ఇక ఓటర్లు కూడా మౌన ప్రేక్షకులుగా ఉండకూడదు. డబ్బు తీసుకుని ఓటువేస్తే, రేపటి పాలనపై నైతిక హక్కును కోల్పోయినట్టే. డబ్బుకు కాదు అభివృద్ధికి ఓటు అనే అవగాహన పెరగాల్సిన సమయం ఇది. మున్సిపల్ ఎన్నికల్లో ఖర్చుల కట్టడే నిజమైన సంస్కరణ. డబ్బు ప్రభావం తగ్గితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. పట్టణాభివృద్ధి నిజమవుతుంది.

**గెలిచినా గాయమే..ఓడినా అప్పులే..** గత సర్పంచ్ ఎన్నికలలో కళ్లారా కనిపించిన సంఘటన లు ఎన్నో ఉన్నవి. మున్సిపల్ ఎన్నికల్లో మళ్లీ పునరావృతం కాకూడదనేదే మేధావుల అభిప్రాయం. గత సర్పంచ్ ఎన్నిక లు గ్రామీణ రాజకీయాల్లో ఒక చేదు నిజాన్ని బయటపెట్టాయి. విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుచేసి గెలిచినవారు, ఓడినవారు చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గెలుపు ఆనందం కంటే అప్పుల భారం ఎక్కువైంది. ఓడిన వారికి రాజకీయ పరాజయం సరిపోక ఆర్థిక విధ్వంసం వెంటాడింది. ఓట్లు కొనేందుకు, ప్రచారానికి, ఉచితాలకు ఖర్చుచేసిన డబ్బు కోసం కొందరు అభ్యర్థులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. మరి కొందరు భూములు తాకట్టు పెట్టారు. ఇంకొందరేమో వ్యక్తిగత ఆస్తులు అమ్ముకున్నారు. ఇవన్నీ కూడా యదార్థ సంఘటనలు మరువకముందే మళ్లీ మున్సిపల్ ఎన్నికల కూడా రానే వచ్చాయి. సర్పంచ్ ఎన్నికల ఫలితం ఏమైంది సర్పంచ్ పదవి వచ్చిందా? రాలేదా? అన్నది పక్కనపెడితే చాలామంది జీవితాలు అప్పుల పాలయ్యాయి. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల వేళ అదే పరిస్థితి పునరావృతం కాకుండా ఉండాలంటే అధికారులు, పోలీసు యంత్రాంగం, ఎన్నికల అధికారులు, ప్రజాప్రతినిధులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నిబంధనలు స్పష్టంగా ఉన్నా అమలులో సడలింపు ఉంటే డబ్బు రాజకీయాలు మళ్లీ రాజ్యం చేస్తాయి. నగదు పంపిణీ, మద్యం, ఉచితాల పైన కఠిన విధానం అమలు చేయాల్సిన సమయం ఇది. ఫ్లయింగ్




స్క్వాడ్లు, చెక్‌పోస్టులు కేవలం ఫార్మాలిటీగా కాకుండా ఫలితాలు కనిపించేలా పనిచేయాలి.

పట్టుబడిన డబ్బు వివరాలు ప్రజలకు వెల్లడించాలి. నిబంధనలు ఉల్లంఘించిన అభ్యర్థుల పై అనర్హత వరకు వెళ్లే చర్యలు తీసుకోవాల్సిందే. అంతేకాదు. రాజకీయ పార్టీలు బాధ్యత వహించాలి. డబ్బు, ఖర్చు చేసే వారికే టికెట్లు అన్న అపవాదుకు చెక్ పెట్టాలి. లేకపోతే ప్రజాసేవ పేరుతో ప్రజలను అప్పులపాలు చేసే రాజకీయాలే మిగులుతాయి. ఇక ప్రజల పాత్ర అత్యంత కీలకం. డబ్బు తీసుకుం టే క్షణిక లాభం. కానీ రేపటి పాలనపై నష్టం. డబ్బుకు ఓటు అంటే అప్పుల పాలనకు ఆహ్వానం ఇచ్చినట్టే. గత సర్పంచ్ ఎన్నికలు ఒక హెచ్చరిక. మున్సిపల్ ఎన్నికలు మరోసారి అదే తప్పు చేయకూడదు. గెలుపు తర్వాత అప్పులు మిగలకుండా ఉండాలంటే ఎన్నికల సమయంలో కఠినత తప్పదు.

**నిబంధనలు స్పష్టం అమలే ప్రశ్న?**

మున్సిపల్ ఎన్నికల్లో ఖర్చుల నియంత్రణపై ఎన్నికల కమిషన్ కఠిన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై ఎన్నికల కమిషన్ స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, అమలు స్థాయిలో అవి ఎంతవరకు ఫలిస్తున్నాయన్నది కీలక ప్రశ్నగా మారింది. ఎన్నికల ప్రవర్త నా నియమావళి ప్రకారం ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చును నిర్దేశిత పరిమితిలోనే ఉంచాలి. నగదు పంపిణీ, మద్యం, ఉచిత వస్తువుల పంపకాన్ని ఎన్నికల నేరంగా పరిగణించాలన్నది. స్పష్టమైన ఆదేశం. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థిచేసే ప్రతి ప్రచార ఖర్చు లెక్కలోకి రావాలి. నగదు లావాదేవీలకు అవకాశం లేకుండా బ్యాంక్ ఖాతాల ద్వారానే ఖర్చులు జరగాలి. ఫ్లెక్సీలు, వాహనాలు, సభలు, సోషల్ మీడియా ప్రచారం అన్ని వ్యయాల్లో నమోదు చేయాలి.

నిబంధనలకు విరుద్ధంగా ఖర్చులు చేస్తే అనర్హత, కేసులు తప్పవు, అయితే వాస్తవ పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ప్రచార ఖర్చులు అధికారిక లెక్కలను దూరంగా సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగదు, మద్యం స్వాధీనాలు జరుగుతున్నా డబ్బు ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే స్థాయిలో నియంత్రణ కనిపించడం లేదన్న విమర్శలు చాలా స్పష్టం. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పనిచేసే ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అలాగే రాజకీయ పార్టీలు కూడా తమ అభ్యర్థుల ఖర్చులపై అంతర్గత నియంత్రణ పెట్టాలని నిబంధనలు సూచిస్తున్నాయి. ఇక ఓటర్ల పాత్ర కూడా కీలకం.

ఎన్నికల కమిషన్ స్పష్టం చేసినట్టుగా డబ్బు, మద్యం తీసుకోవడమే ఎన్నికల నేరం. అవి స్వీకరించినా, ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవు. నిబంధనలు ఉన్నాయి. ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. ఇప్పుడు అవసరం ఉంది. కఠిన అమలు, రాజకీయ సంకల్పం, ప్రజల చైతన్యం. అప్పుడే మున్సిపల్ ఎన్నికలు డబ్బు ప్రభావం నుంచి భయటపడి, నిజమైన ప్రజాస్వామ్య పండుగగా మారగలవు.

**జి.మధు,** వనపర్తి, ప్రజాపక్షం ప్రతినిధి

## ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

-ఐటిడిఎ పిఒ రాహుల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** 2025–26 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ తెలిపారు. 5 నుండి 8 తరగతులు చదివే బాలురకు రూ.1 వెయ్యి, బాలికలకు రూ.1500 ఏడాది మొత్తానికి మంజూరవుతాయని చెప్పారు. రాజీవ్ విద్యాదీవెన స్కీమ్ ద్వారా 9,10 తరగతులు చదువుతున్న డేస్ స్కాలర్స్‌కు రూ.2,250, హాస్టలర్స్‌కు రూ.4500 సంవత్సరానికి మంజూరు అవుతాయన్నారు. విద్యార్థులు కుల, ఆదాయం ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకములతో డబ్ల్యూడబ్ల్యూ,డబ్ల్యూ.తెలంగాణఇపాస్,సిజిజి.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మార్చి 31వ తేది నాటికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పిఓ సూచించారు.

## పెద్దలు పనిలో పిల్లలు బడిలో...

రిటైర్డ్ హెచ్‌ఎం వేమిశెట్టి మోహన్‌దాస్

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పెద్దలు పనిలో పిల్లలు బడిలో ఉండాలన్నదే తన ఉద్దేశమని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వేమిశెట్టి మోహన్‌దాస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా శ్రీరంగపట్నంకు చెందిన దుర్గారావు, రాజేశ్వరిలు బతుకుదెరువు కోసం మండల పరిధిలోని శివాయిగూడెం వద్ద టైల్స్ ఫ్యాక్టరీలో కూలీలుగా పనిచేస్తున్నారు. వారికి కుమార్తె అంజలి, కుమారుడు రాజు ఉన్నారు. వారి పిల్లలు బడికి వెళ్లకుండా పని ప్రదేశంలోనే ఉంటున్నారని తెలుసుకున్న రిటైర్డ్ హెచ్‌ఎం మోహన్‌దాస్ వారి తల్లిదండ్రులను కలిసి చదువు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సమీపంలోని మంచుకొండ ప్రాథమిక పాఠశాలలో పిల్లలను చేర్పించారు. ఇరువురిని పాఠశాలలో చేర్చుకున్న హెచ్‌ఎం బి. రమణకు మోహన్‌దాస్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్‌దాస్ మాట్లాడుతూ 2025లో జూ న్‌లో ప్రభుత్వం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కూడా ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేసినట్లు ఆయన తెలిపారు. పిల్లలు లేకుండా మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను అధికారులు, తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఏడాది జూన్‌లో బడిబాటలో విద్యార్థులను చేర్పించి పాఠశాలలను పునఃప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తానని మోహన్‌దాస్ తెలిపా రు.

## ప్రజావాణిలో పాల్గొన్న మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలిపేందుకు కార్పోరేషన్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేయర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, ఈఈ కృష్ణలాల్, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి ఆఫీసర్ శ్యాంసింగ్‌కు పదోన్నతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో పిఈటి, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసింగ్‌కు థర్డ్ ఆఫీసర్ నుంచి సెకండ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. సోమవారం 11(టి) బెటాలియన్ కార్యాలయంలో నిర్వహించిన ర్యాంక్ ప్రధానోత్సవ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కె భద్ర, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ నవీన్ యాదవ్ లు శ్యాంసింగ్ భుజాలపై షోల్డర్ స్టార్స్‌ను అధికారికంగా ధరింపజేశారు. ఈ కార్యక్రమం సైనిక సంప్రదాయాలు, క్రమశిక్షణతో గౌరవ ప్రదంగా నిర్వహించారు. శ్యాంసింగ్ ఎన్‌సిసి క్యాడెట్ల శిక్షణలో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి అంకిత భావంతో సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పదోన్నతి లభించడం గర్వకారణంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శ్యాంసింగ్‌ను స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు.




## ఇసుక ర్యాంప్‌పై ముగిసిన వివాదం



**ప్రజాపక్షం/చర్ల :** తేగడ ఇసుక రీచ్ వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. తేగడ గ్రామంలో సోమవారం సర్పంచ్ జమ్మల మురళీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గత రెండు రోజులుగా తేగడ ఇసుక రీచ్‌కి వెళ్లే రహదారి పై వివాదం చెలరేగింది. తాలిపేరు, గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఒడ్డున ఇసుక రీచ్ కాంట్రాక్టర్లు సుమారు 3కి.మి మేర అక్రమంగా గ్రావెల్‌తో రహదారి నిర్మించారని తేగడ, మేడువాయి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఇసుక రీచ్‌కి వచ్చి పోయే లారీలను నిలుపుదల చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. గోదావరి నది ఒడ్డున సీతమ్మ సాగర్ కరకట్ట నిర్మాణం కోసం కేటాయించిన భూముల్లో గ్రావెల్ రహదారి నిర్మించడం వల్ల రాబోయే వర్షాకాలంలో వరదలు వచ్చి తమ గ్రామాలు మునకకు గురవుతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తేగడ సర్పంచ్ గ్రామసభ నిర్వహించి సమస్యను పరిష్కరించుకుందామని హామీ ఇచ్చి సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసలు సమస్య అయిన గ్రావెల్ రహదారి గురించి కాకుండా ఇసుక ర్యాంపుకు వచ్చే లారీ ఒక్కొక్క దానికి రూ.100 చొప్పున గ్రామ పంచాయితీకి చెల్లించాలని, ఇసుక లారీలకు టార్బల్ కట్టే పని గ్రామస్తులందరికీ అవకాశం కల్పించాలని చర్చించుకున్నారు. ఇసుక కాంట్రాక్టులు వేసిన రహదారి విషయంలో ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే ఇసుస క్వారీ సొసైటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేయగా తేగడ ఇసుక క్వారీ సొసైటీ సభ్యులు దానికి నిరాకరించారని గ్రామస్తులు తెలిపారు. ఏది ఏమైనా గోదావరి నది ఒడ్డున పెసా కమిటీ తీర్మాణం లేకుండా నిర్మించిన అక్రమ గ్రావెల్ రహదారి విషయంలో పంచాయితీ పాలక వర్గం ఉదాసీనంగా వ్యవహరించిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

# నేటితో తేలనున్న ప్రత్యర్థులు

ఉపసంహరణకు నేడు తుది గడువు

బుజ్జగింపుల్లో రాజకీయ పార్టీలు

చర్చలకు తెర




**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల్లో బరిలో నిలిచే ప్రత్యర్థులెవరో మంగళవారంతో తేలనుంది. ఉపసంహరణకు మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలతో గడువు ముగియనుంది. పలు చోట్ల స్వతంత్రులుగా వివిధ పార్టీల నుంచి రెబల్స్‌గా నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధికంగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ పరిస్థితిలో ఆయా అభ్యర్థులను ఒక్కొక్కరిగా పిలిచి బరిలో నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారు. వార్డుల వారీగా అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. సత్తుపల్లి, వైరా, కల్లూరులో అధికార పార్టీలో పోటాపోటీగా ఉన్నట్లు సమాచారం. వైరాలో అయితే ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల అనుచరులు పోటాపోటీగా నామినేషన్లు వేశారు. ఇదే సమయంలో వైరా ఛైర్‌పర్సన్ స్థానం కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. కాంగ్రెస్‌కు చెందిన డిసిసి మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సతీమణి ఇందుమతి, కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్ సతీమణి ఉమాదేవి ఛైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తున్నారు. ఇదే క్రమంలో ఇరు వర్గాల వారు పెద్ద సంఖ్యలో వార్డుల్లో నామినేషన్లు వేశారు. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్, సిపిఐ మధ్య కూడా పొత్తుల వ్యవహారం ఒక కొలిక్కి రాలేదు. వైరాలో 15వ వార్డు నుంచి పోటీ చేసిన సిపిఐ అభ్యర్థికి బిఆర్‌ఎస్, సిపిఎం పార్టీలు మద్దతు పలకడం గమనార్హం. మధిర, కల్లూరు, సత్తుపల్లిలో సిపిఐ అభ్యర్థులకు సంబంధించి ఎటువంటి ఒడంబడిక కుదరలేదు. ఏదులాపురంలో ఒంటరి పోరుకే సిపిఐ సై అంటోంది. ఇప్పటికే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజక వర్గ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జిగా ఉన్న కొండా సురేఖ రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించిన ఫలితం లేక పోయింది. ఐక్యంగా ఉండమని ఉద్బోధించారు తప్ప ఐక్యత కోసం చర్చలు జరపలేదు. పార్టీ నిర్ణయించిన వారికి బిఫాం ఇస్తామని, బిఫాం దక్కిన వారిని అందరూ కలిసి గెలిపించాలని పార్టీ నిర్ణయాన్ని కాదంటే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. బిఆర్‌ఎస్, సిపిఎంలు ఐక్యంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి.

# రబీ సీజన్ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

యూరియా పంపిణీ

పకడ్బందీగా చేపట్టాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెటి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రబీ సీజన్ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో రబీ ధాన్యం సేకరణ, యూరియా పంపిణీ, మున్సిపల్ ఎన్నికలు, జిల్లా అధికారుల హాజరుపై అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్ దిగుబడి అంచనాలకు తగినట్లు కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను అధిగమించాలన్నారు. మిల్లర్లకు కొనుగోలుపై ముందే అవగాహన కల్పించాలని సమస్యలు ఉంటే ముందుగానే పరిష్కరించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. యూరియా పంపిణీ వంద శాతం యాప్ ద్వారా జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు యూరియా పంపిణీపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. యూరియా నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. కొరత ఉంటే ముందస్తుగానే తెలపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది శిక్షణకు ఏర్పాటు చేయాలన్నారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణంతో షాపులు కోల్పోయిన వారితో మాట్లాడి స్థలం గురించి ఒక స్ట్రీట్ వెండర్ జోన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. దానవాయిగూడెం బాలికల హాస్టల్ వరదల్లో దెబ్బతినగా వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ప్రతిపాదిత అన్ని పనులు పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా అధికారులు తమ క్షేత్ర పర్యటనలు కొనసాగించాలన్నారు. పాఠశాల, హాస్టళ్ల సందర్శన, భోజన నాణ్యత పరిశీలన, ప్రాధాన్యత పనుల పర్యవేక్షణ, ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ చేయాలన్నారు. సిబ్బంది హాజరు మెరుగవ్వాలన్నారు. అనుమతి లేని గైర్హాజరు పై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం నుండి సరఫరా అయిన హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే పరికరాన్ని కలెక్టర్ ప్రారంభించి వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించారు.




**ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి**

ప్రజల దరఖాస్తులను అధికారులు ప్రాధాన్యత నిచ్చి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల్లో పనిచేసి జనవరి 31న ఉద్యోగ విరమణ పొందిన ఏడుగురు అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎవో కె. శ్రీనివాస రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు చెల్లించాలని కార్మికుల నిరసన

మద్దతు తెలిపిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు సోమవారం ఉదయం పంచాయతీ కార్యాలయం గేటు ముందు కూర్చొని తమ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి, మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య వార్డు మెంబర్లు వెంకటేశ్వర్లు వేరుపుల నరేష్ తదితరులు హాజరై పంచాయతీ కార్మికులకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్‌లు మండల కార్యదర్శి జక్కుల రాజబాబులు మాట్లాడుతూ మణుగూరు మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన సమితి సింగారం పంచాయతీలో 33 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో కొంతమందికి 11 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, మిగిలిన వారికి మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి వీరికి జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఇల్లు గడిపే పరిస్థితి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, కనీసం పిల్లల చదువు, కూడా చదివించుకోలేక నానా అవస్థలు పడుతున్నారని, ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన ఎవరూ పట్టించుకోవడంలేదని, మా జీతాలు మాకు ఇప్పించండి అని అధికారులకు వేడుకుంటే చేస్తే చేయండి లేకపోతే మానుకోండి అనే విధంగా వారు మాట్లాడుతున్నారని, అధికారులు ఈ విధంగా పనిచేయించుకొని జీతం అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా వారి జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. వారికి రావాల్సినటువంటి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికులకు కనీసం జీతభత్యాలు ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని వారు ప్రశ్నించారు. కార్మికులను పని చేయిస్తున్న ప్రభుత్వం, అధికారులు మరి వారు మంచి కూడా చూడాల్సిన బాధ్యత లేదా అని వారన్నారు. పంచాయతీ కార్మికులు చేస్తున్న ఆందోళనకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని భవిష్యత్తులో వీరి జీతాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో వారికి మద్దతుగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పంచాయతీ అధికారి

టి.రాంబాబు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రతీ పంచాయతీలో పారిశుద్ధ్య పనుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి టి.రాంబాబు ఆదేశించారు. డీపీవో సోమవారం మేజర్ పంచాయతీని సందర్శించారు. చెత్తచెదారం కలిగిన ప్రాంతాలను పరిశీలించారు. పారిశుద్ధం పనుల పట్ల అసంతృప్తి ని వ్యక్తం చేశారు. సిబ్బంది పై అగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో దగ్గర ఉండి చెత్త ను తొలిగించే పనులు చేయించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల తో మాట్లాడారు. జిల్లాలో పారిశుద్ధం పట్ల నిర్లక్ష్యం చేస్తు సహించేది లేదని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం కోసం పారిశుద్ధం పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతీ పంచాయతీలో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దోమల నివారణ కు ఫాగింగ్ తప్పనిసరిగా చేయించాలని సూచించారు. పంచాయతీలలో తాగునీటి సమస్యలను తీర్చేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాలలో మంగళవారం నుంచి సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లకు మొదటి విడతలో 190 మంది కి శిక్షణ అందించినట్లు తెలిపారు. మంగళవారం నుంచి జరగాల్సిన రెండో విడతసర్పంచల శిక్షణ మున్సిపల్ ఎన్నికల కారణంగా తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తిరిగి 17 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 571 పంచాయతీలలో 5,300 మంది వార్డు సభ్యులకు ఈ నెల 20 నుంచి ఆయా మండల స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 48 శాతం పన్నులు వసూలు చేసినట్లు తెలిపారు. మార్చి నాటికి నూరు శాతం సాధిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సిహెచ్.శివ, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, కార్యదర్శి శ్రీనివాస్ లు ఉన్నారు.



## విద్యుత్ శాఖ అభివృద్ధిలో కీలక ఘట్టం

**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలం గుట్ట మల్లారం పంచాయతీ పరిధిలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన భవనాన్ని శుభప్రదంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన విద్యుత్ సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయం ప్రారంభం కావడం ద్వారా మణుగూరు మండలం తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు విద్యుత్ సమస్యల పరిష్కారం మరింత సులభతరం అవుతుందని అన్నారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, పరిపాలనా పనులు ఇకపై స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని, ఎమ్మెల్యే అన్నారు.

## సిసి డ్రైన్ల నిర్మాణానికి మేయర్ శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 32వ డివిజన్‌లో సిసి డ్రైన్ నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. సోమవారం డివిజన్ పరిధిలో రూ.25 లక్షలతో నిర్మించనున్న సిసి డ్రైన్ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు కార్పోరేషన్ ఆధ్వర్యంలో డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. పనుల్లో నాణ్యతలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం మేయర్ జమలాపురం కేశవరావు పార్కులో నూతనంగా నిర్మించిన ప్రజా మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దోన్‌వాన్ సరస్వతి, మాజీ కార్పొరేటర్ రమాదేవి, నాయకులు శంకర్ నాయక్, ఉమేష్, తోళ్ల రాకేష్, కుటుంబరావు, తేజావత్ శ్రీను, మన్నేపల్లి నగేష్, జగదీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు

ఐటిడిఎ పిఒ రాహుల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హత గల గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందిస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యలపై విన్నవించేందుకు వచ్చిన గిరిజనుల నుండి యూనిట్ అధికారుల సమక్ష్యంలో ఆయన అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత యూనిట్‌ల అధికారులకు బట్వాడా చేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల నుండి వ్యయప్రయాసలకు ఓర్చి ఇక్కడిదాక వచ్చి దరఖాస్తులు సమర్పించిన గిరిజనులకు న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. నిజమైన అర్హులకు న్యాయం జరిగిన నాడే అధికారుల పనితీరుకు కితాబు దక్కుతుందని చెప్పారు. గిరిజన సంక్షేమం కోసం ఏర్పాటైన ఐడిడిఏల ద్వారా గిరిజన జీవితాలకు మేలు చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి అశోక్, ఇఇ మధుకర్‌తో పాటు పలుశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## పేదలను విద్యకు దూరం చేస్తున్న కేంద్రం

బడ్జెట్‌లో తీరని అన్యాయం

ఐఎఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్త-గూడెం :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన పద్దులో విద్యారంగానికి తీరని అన్యాయం జరిగిందని, కేంద్రం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ పేదలను విద్యకు దూరం చేసే కుట్రకు తెగబడుతోందని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే షాహీద్, వరక అజిత్ అన్నారు. 12 ఏళ్ల మోదీ పాలనలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో విద్యారంగానికి సముచిత స్థానం దక్కడం లేదన్నారు. ఈ ఏడాది రూ.53.5 లక్షల కోట్లు మొత్తం బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన నిధులు కేవలం రూ.13,92,089 కోట్లని, ఇది 2.6 శాతం మాత్రమే అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 10శాతం, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని అనేక ఏళ్లుగా విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీ చట్టంలో ఉన్న విద్యా సంస్థలను కేటాయించకుండా అడుగడుగునా మొండి వైఖరిని ప్రదర్శిస్తుందని, 8 మంది బిజెపి ఎంపిలు ఉన్నప్పటికీ తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కుల గురించి నోరుమెదపలేని పరిస్థితి నెలకొందన్నారు. రాజకీయ ప్రసంగాలు చేయడంలో ముందు వరుసలో ఉండే బిజెపి ఎంపిలు రాష్ట్రానికి తీరని అన్యాయం కళ్లముందే జరుగుతున్నప్పటికీ చేతులు కట్టుకుని ఉంటూ తెలంగాణ విద్యార్థులు, ప్రజలకు మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎన్ని ప్రసంగాలు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పేద, మధ్య విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలంలోని ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు రూ.60,000 విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరంలో ఉన్న ప్రజలకు ప్రభుత్వ సహాయాన్ని అందించడం తమ బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం పేదలు, బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చింతిర్యాల వీరభద్రం, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, సీనియర్ నాయకులు పోలమూరి రాజు, విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కప్‌లో రెజొనెన్స్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిఎం కప్ క్రీడా పోటీల్లో ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ మైదానంలో జనవరి 28 నుంచి 31 వరకు జరిగిన ఈ పోటీల్లో ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో రెజొనెన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన అభినందన సభలో పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చేలా తమ పాఠశాలలో శిక్షణ అందిస్తున్నామన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. ప్రతిభ చూపి బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# జాతర ప్రతిష్టను దెబ్బతీయాలనే కుట్రలు సహించం



## కెటిఆర్ అహంకారం తగ్గించుకోవాలి
### మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/ములుగు:**ప్రపంచ ప్రఖ్యాత శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర ప్రతిష్టను దెబ్బతీసేలా కావాలనే కొంత మంది రాజకీయ పార్టీలు, కొన్ని మీడియా సంస్థలు, కొందరు స్వాములు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని, కెటిఆర్ ఆహంకారాన్ని తగ్గించుకొని మాట్లాడాలని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మేడారం జాతర నిర్వహణలో భాగంగా వారం రోజుల పాటు తాము 24గంటలు అక్కడే ఉండి పనిచేశామని, కోట్లాది మంది భక్తులు సుఖ శాంతులతో దర్శనం చేసుకున్నారని తెలిపారు. జాతరను సక్సెస్ చేయడంలో సహకరించిన ములుగు మీడియా సోదరులకు, అధికారులు, పోలీసులు, పారిశుద్ధ్య సిబ్బందికి మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. గుడి నిర్మాణం ప్రారంభమైన నాటి నుండే ఆదివాసీ విశ్వాసాలకు వ్యతిరేకమని తప్పుడు ప్రచారాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. గుడిలో చేసిన ప్రతి మార్పు పూజారుల ఆమోదం, ఎండోమెంట్ కమిషనర్ అనుమతితోనే జరిగిందని స్పష్టం చేశారు. అయినప్పటికీసమ్మక్క గద్దెల వద్ద కూడా రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు. శుక్రవారం సాయంత్రం విఐపి వాహనాలు భారీగా రావడంతో కొంత సేపు ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడిందని, అది బస్సులు లేకపోవడం వలన కాదని తెలిపారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గాయని పేర్కొన్నారు. కొంత మంది విఐపిలు వందలాది మందితో అనేక వాహనాలతో రావడం వల్లే ఇబ్బందులు తలెత్తాయన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమాలు చేస్తే తామే బాధ్యత వహిస్తామని స్పష్టం చేశారు. జాతరలో ప్రమాదాలు జరుగుతాయని, ప్రాణనష్టం జరుగుతుందని యూట్యూబ్‌లు, టివి ఛానళ్లలో చేసిన ప్రచారం పూర్తిగా అవాస్తమని అన్నారు. ఈ సారి మాస్‌తో పాటు క్లాస్, సూపర్ క్లాస్ భక్తులు కూడా పెద్దయెత్తున రావడం కొందరుజీర్ణించుకోలేక నెగటివ్ నరేటివ్‌ను సృష్టిస్తున్నారని విమర్శించారు.జాతరలో 13వేల మంది పోలీసులు, 40 రోజుల పాటు జిల్లా యంత్రాంగం సేవలందించిందని తెలిపారు.చిన్న చిన్న లోపాలు ఉంటే భవిష్యత్తులో సరిదిద్దుకుంటామని తెలిపారు. సమ్మక్క సారలమ్మలు అన్ని కులాలు, అన్ని మతాలు నమ్మే ప్రకృతి దేవతలని, వారి కీర్తిని తగ్గించే కుట్రలను తక్షణమే మానుకోవాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

**జాతరను విజయవంతం చేసిన మంత్రి సీతక్కకు సన్మానం**



మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరను అపూర్వ విజయంగా నిర్వహించిన రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, నీటి పారుదల శాఖ మంత్రి ధనసరి సీతక్కకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ కాంగ్రెస్ ఘనంగా సన్మానించారు. లక్షలాది భక్తులు తరలివచ్చిన మేడారం జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భద్రత, త్రాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అన్ని విభాగాలను సమన్వయంతో ముందుకు నడపినందుకు మంత్రి సీతక్క నాయకత్వానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికార వర్గాలు ప్రశంసలు కురిపించారు. జాతర ఏర్పాట్లను మంత్రి సీతక్క స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, రాత్రింబవళ్లు శ్రమి ంచి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం వల్లే మే డారం జాతర ఈ స్థాయిలో విజయవంతమైందని పలువురు పేర్కొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతో ప్రజల సహకారం, అధికారుల సమన్వయంతోనే ఈ మహాజాతర విజయవంతమైందని తెలిపారు. భవిష్యత్తులో మేడారం అభివృద్ధికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి ఇర్సవడ్ల వెంకన్న, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమంలో పత్రికలది కీలక పాత్ర
### రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/కాటారం;**ప్రజాసంక్షేమంలో పత్రికలు కీలక పాత్రపోషించాలని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.సోమవారం మండలంలోని ధన్వాడ గ్రామంలో ప్రజాపక్షం దినపత్రిక 2026 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై మంచి కథనాలు అందిస్తూ ప్రజాపక్షం దినపత్రిక ప్రజల మన్ననలు పొందుతుందని అన్నారు.వాస్తవాలను అందిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న దిన పత్రిక ప్రజాపక్షం భవిష్యత్తులో మరెన్నో విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు,కాటారం మాజీ ఎంపిపి పంతకాని సమ్మయ్య,సర్పంచ్ దబ్బెట రాజేష్,పలిమెల మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతి,కారెంగుల శ్రీనివాస్ గౌడ్,వంశీకృష్ణ రావు,ఆర్వీ ఇంచార్జ్ గంట దేవదాస్,ప్రజాపక్షం పాత్రికేయుడు మాజిద్,సమ్మయ్య,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రానికి కేంద్రం అన్యాయం**

**ప్రజాపక్షం/కాటారం;**కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేసిందని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రిదుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.సోమవారం మండలంలోని ధన్వాడ గ్రామంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని రంగాల్లో అన్యాయం చేసిందని అన్నారు.రాష్ట్ర విభజన రిశ్వారంలోని 42 అంశాలను కేంద్రం విస్మరించిందని అన్నారు.హైదరాబాద్‌లోని మెట్రో రైల్ ఫేస్2,కేంద్రీయ నవోదయ విద్యాలయాలు మంజూరు కాలేదని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు,మాజీ ఎంపిపి పంతకాని సమ్మయ్య,నాయకులు జవ్వాజి ఇతిరుతి,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల జాగ్రత్త



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**భూపాలపల్లి మండలంలో నాగారం గ్రామపంచాయతీ ప్రాంగణంలో ప్రభుత్వ రంగ సంస్థ తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రవేశపెట్టే పథకాలపై ప్రజలలో అవగాహనకోసం నాబార్డ్ వారి ఆర్థిక అక్షరాస్యత నిధుల సహకారంతో కళాజాత బృందం ద్వారా విస్తృత ప్రచార కార్యక్రమంలో భాగంగా పీర్లాలకృష్ణ బృందం ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మీకు లాటరీ తగిలిందని మీ ఏటీఎం కార్డు కొత్తగా వచ్చిందని మేము బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఎకౌంట్ నెంబర్ చెప్పమని ఫోన్ చేస్తే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, మన అకౌంట్లో సొమ్ము కాజేసే అవకాశం ఉందని సైబర్ మోసాలు అరికట్టే విధంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎఫ్ఎల్‌సి కౌన్సిలర్ ప్రేమ్ కుమార్, బ్యాంకు మిత్ర మేనేజర్, కళాకారులు పాల్గొన్నారు.

## సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డిఎ ఐదు బకాయిలను చెల్లించండి



**ప్రజాపక్షం/గూడూరు;** తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డిఎ వాయిదా బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిచంద్ర డిమాండ్ చేశారు.సోమవారం గూడూరు మండల కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డిఎలను వాయిదాలుగా చెల్లించడం బాధాకరమనిఅన్నారు.ప్రభుత్వం సకాలంలో వీటిని చెల్లించకుండా వాయిదాల సంఖ్యను పెంచుకుంటూ పోవడం వల్ల అవి 60 కి చేరాయనిఆవేదన వ్యక్తం చేశారు.ఈ వాయిదాల ద్వారా రావాల్సిన మొత్తం 1200 కోట్లులకు చేరిందని ఉద్యోగ ఉపాధ్యాయులు రిటైర్మెంట్ తీసుకున్న వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి నెల విడుదల చేస్తున్న 700 కోట్లు నిధులులో భాగంగా ఈనెల తప్పనిసరిగా సిపిఎస్ బకాయిల కోసం కేటాయించాలని కోరారు.ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో టిఎస్‌సిపి ఎస్యువి మండల అధ్యక్షుడు మల్లేశం ప్రధాన కార్యదర్శి మనోహర్ చంద్రమౌళి సాయి దాలి అక్ష్మి పతి విజయ్ శ్రీను రమేష్ కుమారస్వామి రజిత తదితరులు పాల్గొన్నారు.

## పల్లా రాజేశ్వర రెడ్డి పాదయాత్ర

**ప్రజాపక్షం/జనగామ :**అభివృద్ధి కోసం బిఆర్ఎస్ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం జనగామ మున్సిపాల్టీలోని 1,2,3,4,14,15 వార్డుల్లో పర్యటించారు. వాడవాడలా పాదయాత్ర చేసి కార్నర్ సమావేశాలు నిర్వయించారు. ఈ సందర్భంగా పలు చోట్ల మాట్లాడుతూ అభివృద్ధియే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందన్నారు. ఒకప్పుడు జనగామ పట్టణంలో తాగునీటితో అల్లాడేదని, నేడు మిషన్ భగీరథతో పుష్కలంగా నీరు ఇవ్వడం జరుగుతుందన్నారు. జనగామలో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పేదలకు పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రోడ్ల మరమ్మత్తు, అవాస పాత్రాల అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జనగామ మున్సిపాల్టీ అభివృద్ధి చెందితేనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అందుకే భారీ మెజార్టీలో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు ప్రసాద్, రావెల రవి, జూకంటి లక్ష్మి శ్రీశైలం, స్వరూప చంద్రయ్య, రాజశేఖర్‌రెడ్డి, మాజీద్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బాల్నె సిద్దిలింగం, శ్రీనివాస్‌రెడ్డి, గద్దల నర్సింగరావు, ధర్మపురి శ్రీనివాస్, రాజుపాల్గొన్నారు.

## తాటిచెట్టుపై నుండి పడి గీత కార్మికుడికి గాయాలు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని చెన్నూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టుపై నుండి పడి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఎం మల్లేష్ రోజువారీగా కల్లు గీసేందుకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు జారీ కింద పడినట్లు గ్రామస్థులు తెలిపారు. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. గాయపడిన గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో ఆర్డినేటర్ మొలుగూరి యాకయ్య కోరారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి కార్మికులకు కుచ్చుటోపి
### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర ఆర్థికశాఖ మంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ గ్రామీణ పేదలకు, వ్యవసాయ కూలీలకు కుచ్చుటోపి పెట్టిందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో విబిజిరామ్‌జి చట్టాన్ని తెచ్చి సంవత్సరంలో 125 రోజులు పనులు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకు మూడు లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా 95 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదించడం తో దేశవ్యాప్తంగాకోట్లాదిమంది కూలీలకు పనులు ఎలా కలిగిస్తారని ప్రశ్నించారు. కొత్త చట్టం అమలులోకి వచ్చేవరకు నరేగాను కొనసాగించడానికి పెండింగ్ పనులు పూర్తయ్యేదానికి రూ.30 వేల కోట్లు ప్రతిపాదించిన అవి పాత బకాయిలకే సరిపోయే పరిస్థితి లేదన్నారు. నరేగా చట్టం వలన కూలీలకు తమ స్వగ్రామాలలో పనులు దొరికి వలసలకు పోవడం ఆగిందని, ప్రజల కొనుగోలు శక్తి ,కూలీల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. విబిజిరామ్‌జి చట్టంతో ఉపాధి పనులకు గ్యారంటీ లేకుండా పోయిందని, కేంద్ర ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి ఉంటుందన్నారు. పది శాతం నిధులనే భరించలేని రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనుండి 40% నిధులు భరించాల్సి ఉంటుందని, రాష్ట్రాలు నిధులు ఇవ్వకపోతే కేంద్రం నుండి నిధులు రావని చివరకు ఈ పథకాన్ని రద్దు చేసే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. పేదల పొట్టలు కొట్టే చట్టాన్నిరద్దుచేసి, నరేగా ను పునరుద్ధరించి రూ.మూడు లక్షల కోట్లు కేటాయించనిచో పోరాటాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం మధ్య పొత్తు

**ప్రజాపక్షం/జనగామ:**జనగామ మున్సిపాల్టీలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం మధ్య పొత్తు కుదిరించి, సిపిఎం, సిపిఐకి నాలుగు స్థానాలకు కేటాయించగా ఆదివారం 21 స్థానాలకు కాంగ్రెస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన ఐదు స్థానాలకు సోమవారం అభ్యర్థులను ప్రకటించారు. సిపిఎంకు మూడు స్థానాలకు అంగీకరించగా 3,5,7 వార్డులు కేటాయించారు. సిపిఐకి ఒక స్థానం ప్రకటించిచగా 11వ వార్డు కేటాయించారు. ఆ వార్డు నుండి ఆకుల సరస్వతి పోటీ చేస్తున్నారు. మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. 1వ వార్డు నుండి మూడ్ లక్ష్మన్‌నాయక్, రెండో వార్డు నుండి రామగళ్ల విజయ్‌కుమార్, మూడో వార్డు సిపిఎం నుండి బూడిత జ్యోతి, నాల్గో వార్డు నుండి మంత్రి సుమలత, ఐదో వార్డు సిపిఎంకు కేటాయించగా పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, ఆరో వార్డు నుండి బుక్కా బాల భరద్వాజ్, 7వ వార్డు నుండి సిపిఎం నుండి మహ్మద్ గౌసియా, 8వ వార్డు నుండి ఎర్ర రజిని, 9వ వార్డు నుండి వంగాల కళ్యాణి, 10వ వార్డు నుండి నీరటి రజిని, 11వ వార్డు సిపిఐకి కేటాయించిగా ఆకుల సరస్వతి, 12 వార్డు నుండి వంగ ఉమ, 13వ వార్డు నుండి మేడ శ్రీనివాస్, 14వ వార్డు తిరువాయిపాడి అండాలు, 15వ వార్డు సిద్ధం శివకుమార్, 16వ వార్డు కడకంచి సుశీల, 17వ వార్డు గాదెపాక రాంచందర్, 18వ వార్డు కొండా శ్రీనివాసరావు, 19వ వార్డు దోర్నాల అనిత, 20వ వార్డు గాదరి రేణుక, 22వ వార్డు కడకంచి బాలమణి, 23వ వార్డు బాల్దె మల్లేశం, 24వ వార్డు వేమళ్ల పద్మ, 25వ వార్డు పాముకుంట్ల ప్రసాద్ గౌడ్, 26వ వార్డు జక్కుల వేణుమాదవ్, 27,చెంచారపు కరుణాకర్‌రెడ్డి, 28 రయితా బేగం, 29వ వార్డు మరికుక్కల శ్రీనివాస్‌లు, 30వ వార్డు ఆరుట్ల లోకమంత్‌రెడ్డి పేర్లను ప్రకటించారు.

## సరస్వతి అంత్య పుష్కరాలకు ఏర్పాట్లు పూర్తి
### దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి శైలజ రామయ్యర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్ల పై దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, రాష్ట్ర ధార్మిక సలహాదారు గోవింద హరితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడిఓసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ, కాళేశ్వరం లో గత సంవత్సరం సరస్వతి పుష్కరాలు అంగరంగ వైభవంగా నిర్వహించామని, లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఈ సంవత్సరం మే 21 నుండి నిర్వహించబోయే సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం సుమారు రూ.30.60 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. లక్షలాది భక్తులు అంత్య పుష్కరాలలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చే అవకాశం ఉందని, భక్తుల సౌ కర్యార్థం త్రాగు నీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణతో పాటు విద్యుత్ సరఫరా, దేవస్థానం ప్రాంగణంలో భక్తుల క్యూలైన్ల ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సరస్వతి ఆది పుష్కరాలలో చేపట్టిన శాశ్వత ప్రాతిపదిక పనులను త్వరిత గ తిన పూర్తి చేయాలని ప్రసాదం కౌంటర్, రైలింగ్, సరస్వతి వి గ్రహం వద్ద పెయింట్ వర్క్స్ గ్రానైట్ పరచడం అర్చ్‌ల నిర్మా ణం, విద్యుత్ పనులు, పెయింట్ పనులు పూర్తి చేయాలని ఆ దేశించారు.8వ తేదీ వరకు అంచనా ప్రతిపాదనలు అందచే యాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌పి సంకీర్త్, అద నపు కలెక్టర్ ఆశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పంచాయతి రాజ్, దేవాదాయ, వైద్య, ఆర్ అండ్ బి, విద్యుత్తు, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల సమస్యలకు వేగంగా పరిష్కారం
### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:**ప్రజలు అందజేసిన దరఖాస్తుల సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించాలని బల్ది యా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్(ప్రజావాణి) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు వివరాలు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్ 42, ఇంజనీరింగ్ 19, రెవెన్యూ 07, హెల్త్, శానిటేషన్ 07, నీటి సరఫరా 03, హార్టికల్చర్ 01, మొత్తం 79 వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్‌రావు, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్‌లింగం, సిహెచ్ఓ రమేష్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్‌లు ప్రసన్న రాణి, సమ్మయ్య, టిఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి
### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు :** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు మున్సిపాలిటీలోని 16 వార్డులకు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు అధికారికంగా పార్టీ బీ ఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించాలన్నారు. తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందన్నారు. పార్టీ బలపర్చిన అభ్యర్థులందరూ సమన్వయంతో పని చేసి ప్రజల మద్దతు పొందాలన్నారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడే పార్టీ అని అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రతీ వార్డులో కాంగ్రెస్ జెండా ఎగరవేసే విధంగా ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపాలిటీ వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

## సమ్మెనోటీసు అందజేత
### వరంగల్ జిల్లా కార్మిక సంఘాల పిలుపు



**ప్రజాపక్షం/ వరంగల్:** ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు ఐఎన్‌టియుసిజిల్లా ఉపాధ్యక్షులు మేకల సమ్మె య ఎఐటియుసిదామర కృష్ణ ఎఐసిటియు వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి సిఐటియు జిల్లా కార్యదర్శి అరూర్ కుమారు బిఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రాజబోయిన యాకయ్య ఎఐసిటియు జిల్లా కార్యదర్శి అక్కనపల్లి యాదగిరి బిఎన్ ఆర్ కేస్ జిల్లా నాయకుడు చిలువేరు రాజేందర్ అన్నారు. వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ అధ్యక్షతన వరంగల్ ఏనుమాములమార్కెట్ కార్యదర్శి మల్లేశంకు సమ్మె నోటీసును అందించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12 తారీఖున కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, విబిజి రాంజీ గ్రామీణ ఉపాధి హామీ నూతన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మార్కెట్‌ను బందు చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తున్నది. కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను కఠినంతరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు బిజెపి ప్ర భు త్వం బరితెగించింది రాజ్యాంగం కల్పించిన హక్కులన్నిటిని తుంగలోకి తొక్కి కార్మికులుగా గుర్తించకుండా వెట్టి చాకిరి చేసే విధంగా ప్రయత్నం సాగితుందన్నారు. గుమాస్తా, కార్మికులందరూ కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్ సౌకర్యం కల్పించాలని, ఎనిమిది గంటల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి బషీర్, సుంచు జగదీశ్వర్, దండు లక్ష్మ ణ్ నరహరి, అడుప యాదగిరి, యాకూబ్, అశోక్, మైదాం ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ యాప్ ద్వారానే యూరియాను బుక్ చేసుకోవాలి

**ప్రజాపక్షం/ నర్సంపేట:** ప్రతి రైతు యూరియా, ఎరువుల కావాలంటే తప్పనిసరిగానే యాప్‌ద్వారానే బుక్ చేసుకోవాలని వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. నర్సంపేట ప్యాక్స్‌లో ఎరువుల యాప్ ద్వార యూరియా విక్రయాలను సోమవారం పరిశీలిచారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ సెల్ ఫోన్ ఉపయోగించే ప్రతీ రైతు ఎరువుల యాప్ ను ఇన్ స్టాల్ చేసుకొని యూరియా బుక్ చేసుకోవాలని, ఫోన్ అందుబాటులో లేని రైతులు ప్యాక్స్ కానీ ప్రైవేట్ షాప్‌కి కానీ వారి ఆధార్ కార్డ్ తీసుకుని వెళితే అక్కడ ఉన్నా ఎఇఒ కానీ వాలెంటర్ మీకు బుకింగ్ చేసుకోవడంలో సహాయం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణకుమార్ ఎఇఒలు త్రివేణి వినయ్‌కుమార్, సొసైటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఊపందుకున్న మున్సిపల్ ప్రచారం



**ప్రజాపక్షం/జనగామ:**మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మంగళవారం బిఫాంలు అందజేయడంతో పాటు విత్‌డ్రాలు కూడా జరగనున్నాయి. అనంతరం తుది జాబితాను ప్రకటించనున్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు మాత్రం ప్రచారంలో నిమగ్నమయ్యారు. కొందరు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి అభ్యర్థిస్తుండగా మరికొందరు ఏకంగా ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వయిస్తున్నారు. ఇక మంగళవారం తుది జాబితా వెలువడనుంది. ఈ నేపధ్యంలో ప్రచారం మరింత ఊపందుకోనుంది. మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు ప్రచారంలో నిమగ్నం కానున్నారు.

మున్సిపల్ ఎన్నికల మొదటి పర్వం ముగిసింది. రెండో పర్వం విత్ డ్రాలు, బిఫాంల అందజేత మంగళవారం జరిగి తుది జాబితా కూడా వెలువడనుంది. దీనితో ప్రచారినికి 6 రోజులు, పోలింగ్‌కు 8 రోజుల సమయం మాత్రమే ఉండనుంది. కాంగ్రెస్ తుది జాబితా కూడా సోమవారం ప్రకటించారు ఉదయం 5 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు ప్రచారాలు జరుగుతున్నాయి. బిఆర్ఎస్ అధికారికంగా గతంలోనే ప్రారంభించినా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం ఐదు వార్డుల్లో ర్యాలీలు, సభలు నిర్వయించారు. కాంగ్రెస్ ఇంకా మొదలు పెట్టనప్పటికి అభ్యర్దులు మాత్రం ఇంటింటికి తిరుగుతూ ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో కాంగ్రెస్ ప్రచారం కూడా మొదలు కానుంది.

**నేడు బిఫాంలు, విత్ డ్రాలు**

జనగామ జిల్లాలో రెండు మున్సిపాల్టీలు ఉండగా జనగామ మున్సిపాల్టీలోని 30 వార్డులకు 292 నామినేషన్లు వచ్చాయి. పరిశీలన అనంతరం 186 మంది, 186 నామినేషన్లు వేసినట్లు అధికారులు ధృవీకరించి జాబితా విడుదత చేశారు. ఆ తరువాత పార్టీల్లోని నాయకుల మధ్య సయోధ్య కుదుర్చి విత్ డ్రాలు చేయించడం మొదలైంది. మంగళవారం విత్ డ్రాలు పూర్తి కానున్నాయి. అనంతరం పార్టీ బిఫాం అందజేసిన వారికి పార్టీ గుర్తు, అందజేయని వారికి స్వతంత్ర అభ్యర్థిగాఅభ్యర్థిగా గుర్తిం చనున్నారు. స్వతంత్రులకు సైతం గుర్తులు కేటాయిస్తారు. తుది జాబితా మంగళవారం సాయంత్రం వరకు ప్రకటిస్తారు. వారికే వార్డుల వారిగా బ్యాలెట్ ప్రేపర్ తయారు కానుంది. ఎన్నికల సామాగ్రిని సైతం అధికారులు సిద్ధం చేసి ఈ నెల 10న పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నారు.

**ప్రచారంలో బిఆర్ఎస్ హవా**

ప్రచారంలో బిఆర్ఎస్ హవా కొనసాగుతోంది. ఇప్పటికే అభ్యర్థులు ఒకటికి రెండు సార్లు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ర్యాలీలు, సభలు నిర్వయిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా ప్రచారం మొదలు పెట్టలేదు. ఆ పార్టీకి సంబందించిన జెండాలు, వాల్ పోస్టర్లు, డోర్ పోస్టర్లు సైతం కనిపించడం లేదు. టిక్కెట్ల కేటాయింపు పూర్తి కావడంతో మంగళవారం నుండి ప్రచారంలో నిమగ్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# జగదీశన్ విశ్వరూపం..

## వామప్ మ్యాచ్‌లో 49 బంతుల్లో సెంచరీ!

పొట్టి ప్రపంచకప్ వామప్‌ల్లో భారత ఏ జట్టు ఆటగాడు నారాయన్ జగదీశన్(104) రెచ్చిపోయాడు. యుఎస్ఎ బౌలర్లను బెంబేలెత్తిస్తూ బౌండరీలతో విరుచుకుపడిన అతడు 49 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. కెప్టెన్ ఆయుష్ బదొని(60 నాటౌట్) అర్ధ శతకంతో వీరవిహారం చేయడంతో ఇండియా ఎ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికే 238 పరుగులు చేసింది. నవీ ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో భారత ఏ జట్టు భారీ స్కోర్‌తో యుఎస్ఎకు సవాల్ విసిరింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న అమెరికా జట్టుకు జస్దీప్ సింగ్ ఆదిలోనే బ్రేకిస్తూ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(28)ను వెనక్కి పంపాడు. నాలుగో ఓవర్‌లోనే తొలి వికెట్ పడినా.. నారాయన్ జగదీశన్(104 : 55 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్లు) బౌలర్లకు చుక్కలు చూపించాడు. విధ్వంసక ఆట తో చెలరేగిన అతడు 26 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. అదే ఊపులో ప్రత్యర్థి బౌలర్లను ఉతికేస్తూ ఎడాపెడా బౌండరీలు బాదిన జగదీశన్ మరో 23 బంతుల్లోనే సెంచరీ కొట్టడం విశేషం. సర్జరీ నుంచి కోలుకుని ఈ మ్యాచ్‌లో పునరాగమనం చేసిన తిలక్ వర్మ(38) విఫలమైనా.. ఆయుష్ బదొని(60 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. జగదీశన్‌తో కలిసి అర్ధ శతకం భాగస్వామ్యంతో జట్టు స్కోర్ 230 దాటించాడు. వీరిద్దరి మెరుపులతో ప్రత్యర్థికి 239 పరుగుల కష్టమైన లక్ష్యాన్ని ఇండియా ఎ నిర్దేశించింది.

# 'ఐసిసి ప్రొటోకాల్ పాటిస్తాం'

## పాకిస్తాన్‌తో మ్యాచ్‌పై బిసిసిఐ కీలక నిర్ణయం!



టి–20 వరల్డ్ కప్‌లో భారత జట్టుతో మ్యాచ్ బాయ్‌కాట్ చేయాలని పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయం పెద్ద దుమారం రేపుతోంది. ఎంపిక పద్ధతిన మెగా టోర్నీలో పాక్ జట్టు ఆడాలనుకోవడాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి తప్పు పడుతోంది. పాక్ ప్రభుత్వం, ఆ దేశ బోర్డు తమ నిర్ణయాన్ని మార్చుకోకుంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది కూడా. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి సైతం తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించింది. తాము ఐసిసి నిబంధనలను పాటిస్తామని.. పిసిబి చీఫ్ మొహ్సిన్ నక్వీ మాదిరిగా పూటకో మాట, రోజుకో విధంగా ప్రవర్తించడం తమకు తెలియదని బిసిసిఐ పేర్కొంది. స్వదేశంలో మొదలయ్యే పొట్టి ప్రపంచకప్ కోసం పక్కాగా సిద్ధమైన భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డనుంది. సన్నాహక సిరీస్‌లో విజయంతో కొండంత ఆత్మవిశ్వాసంతో ఉన్న టీమిండియా ట్రోఫీ వేటకు కాచుకొని ఉంది. షెడ్యూల్ ప్రకారం లీగ్ దశలో సూర్యకుమార్ యాదవ్ సేన ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో తలపడాలి. కానీ, ఇండియాతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామని పాక్ ప్రభుత్వం ప్రకటించడం చర్చనీయాంశమైంది. దాయాదుల బిగ్ ఫైట్ చూడాలనుకున్న కోట్లాదిమంది ఒకింత షాక్ అవుతున్నారు. అయితే.. బిసిసిఐ మాత్రం పాక్ ప్రభుత్వ నిర్ణయాన్ని తేలికగానే తీసుకుంది. తాము ఐసిసి ప్రొటోకాల్ పాటిస్తామని, షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న భారత జట్టు కొలంబో స్టేడియానికి వెళ్తుందని సోమవారం బిసిసిఐ వర్గాలు తెలిపాయి. 'వరల్డ్ కప్ ఫిబ్రవరి15 వ తేదీన లీగ్ దశ మ్యాచ్ కోసం భారత జట్టు శ్రీలంకకు వెళ్తుంది. ఐసిసి ప్రొటోకాల్.. షెడ్యూల్ ప్రకారం టీమిండియా క్రికెటర్లు సాధన చేస్తారు. మ్యాచ్‌కు ముందు మీడియా సమావేశంలో కూడా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతాడు. మ్యాచ్ సమయానికి భారత బృందం స్టేడియానికి చేరుకుంటుంది. ఒకవేళ పాక్ జట్టు ఆడేందుకు సిద్ధంగా లేదంటే ఆ తర్వాత రిఫరీ నిర్ణయం కోసం మేము ఎదురుచూస్తాం. రిఫరీ మ్యాచ్ రద్దు చేశామని చెప్పాకే స్టేడియం నుంచి బయటకొస్తాం' అని బిసిసిఐ వర్గాలు చెప్పినట్టు పలు కథనాలు పేర్కొంటున్నాయి.

**ఆధిపత్యం మనదే..** ఇప్పటివరకూ పొట్టి వరల్డ్ కప్‌లో భారత్, పాక్ జట్లు 8 సార్లు తలపడ్డాయి. ఏడు పర్యాయాలు టీమిండియా జయభేరి మోగించి దాయాదిపై ఆధిక్యం కనబరిచింది. ఇప్పుడు కూడా ఓటమి భయంతోనే పాక్ బాయ్‌కాట్‌కు సిద్ధపడిందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మెగా టోర్నీకి మరో ఐదు రోజులు ఉన్నందున ఆలోపు పాక్ ప్రభుత్వ నిర్ణయంపై ఐసిసి ఎలా స్పందిస్తుందో చూడాలి.

# బాయ్‌కాట్ నిర్ణయం మాది కాదు. మేము ఏమీ చేయలేం..!



పదో సీజన్ టి–20 ప్రపంచ కప్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉత్కంఠ నెలకొంది. లీగ్ దశలో టీమిండియాతో ఆడబోమని పాక్ ప్రభుత్వం తేల్చిచెప్పడంతో ఫిబ్రవరి 15న దాయాదుల మ్యాచ్ సందేహమే అనిపిస్తోంది. ఇదే విషయంపై పాక్ కెప్టెన్ సల్మాన్ అఘాను విలేకరులు ప్రశ్నించగా అతడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బాయ్‌కాట్ నిర్ణయం తమది కాదని, ప్రభుత్వం చెప్పినట్టు వినడం తప్పా ఏమీ చేయలేమని అతడు వెల్లడించాడు. భారత్‌లో వరల్డ్‌కప్ ఆడబోమని పంతం పట్టిన బంగ్లాదేశ్‌పై వేటు పడగా.. ఇప్పుడు పాకిస్థాన్ అదే తీరుగా వ్యవహరిస్తోంది. లీగ్ దశలో ఫిబ్రవరి 15న కొలంబోలో టీమిండియాతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నామని ఆ దేశం స్పష్టం చేసింది. అయితే.. ఎంచుకొని మ్యాచ్ ఆడడాన్ని సహించమని పిసిబిని ఐసిసి హెచ్చరించింది. అయినా సరే పాక్ బోర్డు మాత్రం స్పందించలేదు. వరల్డ్‌కప్ కోసం సోమవారం పాక్ జట్టు శ్రీలంకకు బయల్దేరింది. జెర్సీ ఆవిష్కరణ అనంతరం కెప్టెన్ సల్మాన్ అఘా మీడియాతో మాట్లాడాడు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ ఇది మా నిర్ణయం కాదు..మేము ఏమీ చేయలేం అని బదులిచ్చాడు.

'వరల్డ్‌కప్‌లో ప్రతి మ్యాచ్ కీలకమే. మేము మూడు లీగ్ మ్యాచ్‌లు గెలవాలనుకుంటున్నాం. మేము ప్రపంచకప్ ఆడేందుకు వెళ్తున్నాం. అయితే.. భారత జట్టుతో మ్యాచ్ బాయ్‌కాట్ చేయాలనేది మా నిర్ణయం కాదు. మేము ఏం చేయలేం. మా ప్రభుత్వం, పిసిబి చైర్మన్ ఆదేశాలను మేము పాటించాల్సి ఉంటుంది. మేము అదే చేస్తాం. ఇక వరల్డ్‌కప్‌లో ప్రతి మ్యాచ్ ముఖ్యమైనదే. తొలి రౌండ్‌లో మేము మూడు మ్యాచ్‌లు ఆడుతాం. మూడుకు మూడు కీలకమే. అందుకని ఈ మూడు మ్యాచ్‌లను మేము తేలికగా తీసుకోము' అని సల్మాన్ అఘా వెల్లడించాడు.

## యువతరంగం

### కార్మిక సమస్యలు

# విస్మరించిన బడ్జెట్



కేంద్ర బడ్జెట్ 2026–27 ఉద్యోగాలు, నైపుణ్యాలు, భవిష్యత్‌కు సిద్ధత వంటి పదాలతో నిండినప్పటికీ, దేశంలోని కార్మిక వర్గం ఎదుర్కొంటున్న మూల సమస్యలను గణనీయంగా విస్మరించింది. యువత సరైన అవకాశాలు లభించక, జీవనం కోసం చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ, భద్రత లేని రోజులు గడుపుతున్నారు. ఇలాంటి నిరుద్యోగులు, ప్రచ్ఛన్న నిరుద్యోగులు, చిరుద్యోగులు, గిగ్ వర్కర్ల గురించిన ప్రస్తావన ఎక్కడా లేదు. కార్మికులపై కనికరం లేని బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బడ్జెట్ మొత్తం దృష్టి ఆర్థిక వృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై ఉండగా, ఆ వృద్ధి వల్ల స్వయం చాలకంగా గౌరవప్రదమైన ఉపాధి ఏర్పడుతుందనే ఒక ప్రమాదకరమైన ఊహపై ఆధారపడింది. గత పదేళ్ల అనుభవం ఈ ఊహను ఖండించినా, అదే దారిని మళ్లీ అనుసరించడం ఈ బడ్జెట్‌లో అత్యంత ఆందోళన కలిగించే అంశం. దేశంలో గ్రామీణ కార్మికులకు అందుబాటులో ఉన్న ఏకైక హక్కు ఆధారిత ఉపాధి వ్యవస్థను తొలగించడం ఈ బడ్జెట్‌లోని అత్యంత తీవ్రమైన నిర్ణయం. పని కావాలంటూ అడిగితే ఇవ్వాల్సిన చట్టబద్ధ బాధ్యతను తొలగించి, పరిపాలనా హామీకి పరిమితం చేయడం వల్ల గ్రామీణ కార్మికులు పూర్తిగా ప్రభుత్వ దయపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పని దినాలను కాగితాలపై పెంచినా, దానికి తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల ఈ హామీ అమలులో సాధ్యం కాదన్న సందేహాలు బలపడుతున్నాయి. అదనంగా, ఖర్చులో పెద్ద భాగాన్ని ఆర్థికంగా బలహీనమైన రాష్ట్రాలపై మోపడం వల్ల, వాస్తవంగా పనులే నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఈ బడ్జెట్‌లో సంఘటిత రంగ కార్మికుల సమస్యలైనా, అసంఘటిత రంగ కార్మికుల భద్రతైనా సరైన స్థాయిలో ప్రస్తావనకు రాలేదు. దేశంలోని కార్మికుల్లో తొంభై శాతం పైగా అసంఘటిత రంగానికి చెందినవారే అయినా, వారి కోసం ప్రత్యేకమైన సామాజిక భద్రతా నిధి, సమగ్ర చట్టబద్ధ వ్యవస్థ కనిపించదు. పెన్షన్, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి మౌలిక అంశాలను ఎప్పటి మాదిరిగానే, ఈసారి కూడా ప్రస్తావించలేదు. ఇది కార్మికులను ఆర్థిక వ్యవస్థకు ఇన్‌పుట్‌గా మాత్రమే చూడటాన్ని సూచిస్తుంది. కాగా, కనీస వేతనాల సంస్కరణ, సమూహ చర్చ హక్కు, కాంట్రాక్టు వ్యవస్థ దుర్వినియోగంపై నియంత్రణ వంటి అంశాలు ఈ బడ్జెట్‌లో లేవు. కార్మిక చట్టాల అమలుతో ఉద్యోగ భద్రత మరింత బలహీనపడే ప్రమాదం ఉన్నా, కార్మిక రక్షణలపై స్పష్టత లేదు. ఇది కార్మికులను మరింత అసురక్షిత స్థితిలోకి నెట్టే ప్రమాదాన్ని పెంచుతోంది. ఏ రకంగా చూసినా, కేంద్ర బడ్జెట్ 2026–27 కార్మికులను దేశ ఆర్థిక వ్యవస్థలో సమాన భాగస్వాములుగా చూడలేదు. వారు కేవలం వృద్ధికి అవసరమైన సాధనంగా మాత్రమే మారుతున్నారు. హక్కుల ఆధారిత ఉపాధి, సామాజిక భద్రత, వేతన భద్రత వంటి అంశాలను పక్కనపెట్టి, వృద్ధి వస్తే ఉద్యోగాలు వస్తాయనే ఊహపై ఆధారపడటం ఈ బడ్జెట్‌లోని మౌలిక లోపం. నిర్మాణాత్మక లోపాలు, ఆర్థిక లోటులు, ప్రజాస్వామ్య లోపాలు అన్నీ కలిసి ఈ బడ్జెట్‌ను కార్మిక వర్గానికి ఒక చేదు అనుభవంగా మార్చాయి. దేశ ఆర్థిక భవిష్యత్తును నిర్మించే కార్మికులకు ఇది గౌరవం కాదు.. ఒక స్పష్టమైన నిర్లక్ష్య సంకేతం.



### కార్మిక సంఘాల అసంతృప్తి...

కార్మిక వర్గానికి దగ్గరగా ఉండే సంఘాలు కూడా ఈ బడ్జెట్‌ను తీవ్రంగా విమర్శించడం గమనార్హం. వృద్ధి కేంద్రితమైనప్పటికీ, కార్మికులకు మేలు చేసే అంశాలు లేవని, సామాజిక భద్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఈ సంఘాలు స్పష్టం చేశాయి. నైపుణ్యాభివృద్ధి, రంగాల ప్రోత్సాహం పేరుతో ఉద్యోగాలు రావచ్చని చెప్పినా, తగిన వేతనం, భద్రత, హక్కులు లేకుండా వచ్చే ఉద్యోగాలను సమగ్ర అభివృద్ధిగా పరిగణించలేమని అవి హెచ్చరిస్తున్నాయి.

వస్త్ర పరిశ్రమ, పర్యాటకం, ఆరోగ్యం, సూక్ష్మ–చిన్న–మధ్యతరహా పరిశ్రమలు వంటి రంగాలపై ఈ బడ్జెట్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇవి ఉపాధి సృష్టికి అనుకూల రంగాలే అయినా, ఆ ఉపాధి స్వభావం ఏంటి అనే ప్రశ్నకు సమాధానం లేదు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ వంటి అంశాలు బలపరచకుండా కేవలం రంగాల ప్రోత్సాహం ద్వారా వచ్చే ఉద్యోగాలు, అస్థిరమైనవి, తక్కువ వేతనాలవిగా మారే ప్రమాదం ఉంది. యువత కోసం శిక్షణ, అప్రెంటిస్‌షిప్, సేవారంగ నైపుణ్యాలపై బడ్జెట్‌లో ప్రస్తావన ఉంది. అయితే

### ఉపాధి స్వభావం లేని ప్రోత్సాహం

ఇది చదువుకున్న నిరుద్యోగం, ఉద్యోగాల లేని వృద్ధి వంటి మూల సమస్యలకు సమాధానం ఇవ్వదు. నైపుణ్యం ఉన్నా ఉద్యోగం లేకపోతే, ఆ శిక్షణ ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నకు బడ్జెట్‌లో సమాధానం కనిపించదు. నిరుద్యోగ భృతి, ప్రభుత్వ రంగ నియామకాలపై స్పష్టమైన దిశానిర్దేశం లేదు. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి అనే మాట బడ్జెట్‌లో వినిపించినా, వాస్తవ చర్యలు కనిపించవు. సంరక్షణ రంగంలో పనిచేసే మహిళా కార్మికులకు వేతన సవరణ లేదు. వారి పనిని పనిగా గుర్తించే చట్టబద్ధ హోదా లేదు. పెన్షన్, ప్రసూతి రక్షణ, సామాజిక భద్రత విస్తరణ వంటి అంశాలు పట్టించుకోలేదు. ఇది మహిళల శ్రమను ఇంకా అదృశ్యంగానే ఉంచే దిశగా తీసుకెళ్తుంది.

# లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ ఎఐటియుసి కార్యాలయంలో సోమవారం డైరీ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ 1920లో ఎఐటియుసి ఏర్పడ్డ నుండి అనేక పోరాటాలు చేసి కార్మికులకు అనేక హక్కులను సాధించినటువంటి ఘన చరిత్ర ఉందన్నారు. కార్మికుల హక్కులతో పాటు దేశ స్వాతంత్రం కొరకు పోరాటాలు చేసిందన్నారు. కేంద్రప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా చేస్తుందని, ఈ చట్టాలకు వ్యతిరేకంగా, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12న జరిగే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షులు కడారి బీరయ్య, కార్యవర్గ సభ్యులు రామారావు, రాజు, ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు విద్యను దూరం చేసే కుట్ర

### ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్



**ప్రజాపక్షం/వరంగల్ :** కేంద్ర బడ్జెట్ లో విద్యారంగానికి అన్యాయమని, కేంద్ర ప్రభుత్వం పేదలకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తుందని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదాళ్ల శరత్ విమర్శించారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శివకుమార్ అధ్యక్షతన నిర్వహించగా ల్యాదాళ్ళ శరత్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో విద్యా రంగానికి అన్యాయం చేసిందన్నారు. 12 ఏళ్ల మోదీ పాలనలో విద్యా రంగానికి కేటాయింపులు తగిన మొత్తంలో జరగటంలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 10శాతం, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కనీసం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ విభజన హామీ చట్టంలో ఉన్న విద్యాసంస్థలను కేటాయించకుండా, రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా మొండి వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. 8 మంది బిజెపి ఎంపిలు ఉన్నా తెలంగాణకి రావలసిన నిధులు, హక్కుల గురించి నోరుమెదపలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. రాజకీయ ప్రసంగాలు చేయడంలో ముందు వరుసలో ఉండే బిజెపి ఎంపిలు రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా చేతులు కట్టుకొని ఉంటున్నారన్నారు. తెలంగాణలో ఉన్న విద్యార్థులను, ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎన్ని ప్రసంగాలు చేసినా క్షేత్రస్థాయిలో పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య అందని ద్రాక్షగా మిగులుతుందన్నారు. సమావేశంలో విద్యార్థి నాయకులు మేకల అభిరామ్, రాజు, కార్తీక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు

# సిపిఐ ఇంటింటి ప్రచారం





**ప్రజాపక్షం/పాల్వంచ :** నిత్యం ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే కమ్యూనిస్టులను ఆదరించాలని, కంకీ కొడవలి గుర్తుపై ఓటేసి సిపిఐని గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం కోరారు. కొత్తగూడెం కార్పోరేషన్ పాల్వంచ డివిజన్ పరిధి 3, 9, 34, 38, 40, 44, 45, 47, డివిజన్‌లో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులు గుగులోత్ కల్పన, వార్డు వాడె లక్ష్మి, భట్టు విజయ, చెరుకూరి శేఖర్‌బాబు, అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, మొగులూరి క్రిష్ణ, గుర్రం వెంకటేశ్వర్లుల విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం ఉన్నాలేకపోయినా ప్రజల మధ్యన ఉండే నాయకత్వాన్ని ఆదరించి గెలిపిస్తే వార్డులు మరింత అభివృద్ధి జరుగుతాయన్నారు. సిపిఐ అభ్యర్థుల గెలుపుతో పాల్వంచ అభివృద్ధి వేగంగా జరుతుందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు అహర్నిశలు పాటుపడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో నేడు ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఎందరు ఎన్ని కుయుక్తులు పన్నినా అనుకున్న లక్ష్యంతో ఎన్నికలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే నాయకత్వంపై ప్రజలు నమ్మకంతో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని, పాల్వంచ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎటువంటి ప్రలోభాలకు తావులేకుండా, నీతి, నిజాయితీ, నిబద్ధత, నమ్మి సిద్ధాంతం కోసం ప్రజల తరుపున, ప్రజలకోసం కొట్లాడే ఎమ్మెల్యే కూనంనని సాంబశివరావు నాయకత్వాన్ని బలపరుద్దామని అన్నారు. పాల్వంచ అభివృద్ధికి ఇప్పటికే వందల కోట్ల నిధులు తెచ్చి పనులు చేస్తున్నారని చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రాధాన్యతా క్రమంలో డెవలప్‌మెంట్ పనులు చేస్తున్నారన్నారు. అవినీతికి ఆస్కారం లేని పాలన కావాలంటే కంకీ కొడవలి గుర్తుపై ఓటేసి సిపిఐ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి పాల్వంచ అభివృద్ధికి బాటలు వేయాలని విశ్వనాథం ఓటర్లను కోరారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ పట్టణ, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# సేవచేసేవారిని ఆదరించండి

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** సేవ చేసేవారిని ఆదరించాలని, విద్యావంతుడైన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నూనావత్ పాండురంగాన్ని ఆశీర్వదించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 24వ డివిజన్‌లో సూర్యనగర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో అభ్యర్థి విజయాన్ని కాంక్షింస్తూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు అభ్యర్థి నూనావత్ పాండురంగంతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. ఆర్‌డిఒగా ప్రజలకు సేవలనందించి, రాజకీయంగా ప్రజలకు అండగా ఉండేందుకు వస్తున్న పాండురంగాన్ని కౌన్సిలర్‌గా గెలిపించుకుంటే అభివృద్ధికి తోడ్పడుతాడన్నారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజ్మీరా రామ్మూర్తినాయక్, కూచిపూడి రవి, జిల్లా సమితి సభ్యుడు బానోత్ రాంకోటి, ఖమ్మంరూరల్ మండల సహాయ కార్యదర్శి బానోత్ రామ్మూర్తి, శాఖ సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.



# ఎరువులపై సబ్సిడీ తగ్గింపు అన్యాయం

### రైతుసంఘం ములుగు జిల్లా కార్యదర్శి అంజాద్ పాషా



**ప్రజాపక్షం/ములుగు :** ములుగు జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం సమావేశం బానోత్ నారాయణ సింగ్ ములుగు మండల అధ్యక్షుడు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజాద్‌పాషా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిండు పార్లమెంట్‌లో ఆర్థిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కీలకమైన ఎరువులపైన 4.47 శాతం సబ్సిడీ తగ్గించడాన్ని ములుగు జిల్లా రైతాంగం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మూలిగే నక్కపై తాడిపండు పడ్డ చందంగా రైతులు వ్యవసాయ రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సందర్భంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎరువులపైన ఆహారం ఇంధనంపైన నాలుగు పాయింట్ 47 శాతాన్ని తగ్గించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగానికి అవసరమయ్యే ఎరువులు పురుగుమందులు, డీజిల్, కూలి రేట్లు పెరిగి అతి వృష్టి, అనావృష్టి, గిట్టుబాటు ధర లేక నానా ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ఎరువులపైన సబ్సిడీ ఎత్తేయడం అన్యాయమని ఈ సబ్సిడీ తగ్గింపుకు వ్యతిరేకంగా రైతాంగం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం ములుగు మండల అధ్యక్షులు బానోతు నారాయణసింగ్, జేరిపోతుల పైడి బాబు, భూక్య హనుమాన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రాజెక్టులకు నిధులివ్వని కేంద్రం

### సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్రఅన్యాయం చేశారని నాగర్‌కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో సిపిఐ జిల్లాసమితి ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఫయాజ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్న అనేక ప్రాజెక్టులు ఈ బడ్జెట్‌లో ఊసేలేదన్నారు. రాష్ట్రానికి అతి ముఖ్యమైనటువంటి స్టీల్ ఫ్యాక్టరీ, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్డు ప్రస్తావనే లేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కెటాయించకున్న రాష్ట్రంనుంచి ఎన్నికైన బిజెపి ఎంపిల మౌనం పాటించడం అన్యాయమన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు 2014లో ఇచ్చిన హామీ ఇప్పటికీ బిజెపి ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ప్రకటనలకే పరిమితమైందన్నారు. జడ్చర్ల వయా కొల్లాపూర్ నంద్యాల్ గద్వాల్ డోర్నకల్ రైల్వేలైన్ల ఊసేలేకపోవడం జిల్లాప్రజలను మరోసారి మోసం చేయడమే అవుతుందన్నారు. బిజెపికి చెందిన ఎనిమిదిమంది ఎంపిలు స్పందించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, మండల నాయకులు రామకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

ఇది రాష్ట్ర ఆత్మగౌరవంపై దాడి

టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రం పట్ల తీవ్ర వివక్షతో కూడుకున్నదని, ఇది ముమ్మాటికీ తెలంగానకు అన్యాయం చేయడమేనని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ తీవ్రంగా ఖండించారు. దేశాభివృద్ధిలో,పన్నుల వసూళ్లలో,వ్యవసాయం,పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ,కేంద్రం నిరంతరం రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. **విభజన హామీల విస్మరణ..** రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన హామీలు,ప్రాజెక్టులు ప్రత్యేక కేటాయింపుల ప్రస్తావన ఈ బడ్జెట్‌లో లేకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని బయటపెడుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి చెందడం కేంద్రానికి ఇష్టం లేదనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోతోందని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ గతంలో తెలంగాణ ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ,అదే మనస్తత్వంతో ఇప్పుడు ఆర్థిక కోతలు విధిస్తూ రాష్ట్రంపై ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు.



## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అంగన్‌వాడీల సమరశంఖం


ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు కలిందర్ అలీ ఖాన్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను అంగన్‌వాడీలు విజయవంతం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు కలిందర్ అలీఖాన్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా సంక్షేమ అధికారికి సమ్మె నోటీసు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం అనేక పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నాలుగు కోడ్లుగా విభజించి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని మండిపడ్డారు. తక్షణమే కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అందరూ సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తోకల సరస్వతి, ఉపాధ్యక్షురాలు అపర్ణ, నాయకులు సురేఖ, కవిత, నాగమణి, పద్మావతి, కృపా, రాజవ్వ, సూరజ, అరుణ, రాజమణి పాల్గొన్నారు.

## రక్షణ కవచమే రాక్షసత్వమైతే?

మంచిర్యాలలో కానిస్టేబుల్ ఉన్మాదం

**ప్రజాపక్షం/మంచిర్యాల :** శాంతి భద్రతలను కాపాడాల్సిన ఖాకీ చొక్కా.. మత్తులో చిత్తయ్యి ఉన్మాదంతో ఊగిపోయింది. మంచిర్యాల పట్టణం రెడ్డి కాలనీ రోడ్ నెంబర్ 14లో కానిస్టేబుల్ రవిప్రసాద్ సృష్టించిన బీభత్సం మానవత్వాన్ని మంటగలిపింది. మద్యం మత్తులో విజ్ఞత కోల్పోయిన సదరు కానిస్టేబుల్ మృగంలా ప్రవర్తించాడు. నగ్నంగా రోడ్లపై తిరుగుతూనే, కట్టుకున్న భార్యను జుట్టు పట్టుకుని వీధిలోకి ఈడ్చుకొచ్చి కనికరం లేకుండా దాడి చేశాడు. ఆమె పీకపై కాలు వేసి ప్రాణాలు తీసేందుకు ప్రయత్నించిన తీరు అక్కడి వారిని నివ్వెరపరిచింది. మహిళలు, కుటుంబాలు నివసించే ప్రాంతంలో ఒక పోలీస్ ఇంతటి సంస్కారహీనంగా, అమానుషంగా వ్యవహరించడంపై స్థానికులు నిప్పులు చెరుగుతున్నారు. ఈ ఘటనతో రోడ్ నెంబర్ 14 నివాసితులు భయంతో వణికిపోయి ఇళ్ల తలుపులు వేసుకున్నారు. పోలీస్ వ్యవస్థ ప్రతిష్టను గంగలో కలిపిన రవిప్రసాద్ పై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని, సర్వీసు నుండి తొలగించాలని ఉన్నతాధికారులను ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.



## మాజీ చైర్‌పర్సన్‌కు బి ఫామ్ అందచేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ తూము పద్మావతి శరత్ రెడ్డి మరోసారి మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు నాగేష్ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బీఫామ్‌లు అందచేశారు. ఈ సందర్భంగా మాజీ ఛైర్ పర్సన్ తూము పద్మావతి వారి చేతుల మీదుగా బీఫామ్‌ను స్వీకరించారు. పార్టీ అభ్యర్థులు ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా కష్టపడాలని బోధన్ మున్సిపల్ ఎన్నికలలో భారీ మేజార్టీతో గెలవాలని ఆకాంక్షించారు.

## కల్యాణోత్సవంలో మాజీ మంత్రి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని సికింద్రాపూర్‌లో అత్యంత వైభవంగా జరిగిన రేణుకా ఎల్లమ్మతల్లి కళ్యాణోత్సవంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ఘనస్వాగతం పలికారు. అధ్యాత్మిక శోభతో సికింద్రాపూర్ గ్రామదేవత కళ్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలను భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని పూజించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ మహేష్, మాజీ జడ్పీటీసీ రవి, మాజీ సొసైటీ చైర్మన్ నర్సయ్య, సర్పంచ్ గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** పటాన్‌చెరు అమీన్పూర్ బల్దియా సర్కిల్ల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడకుండా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని పటాన్‌చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డి జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో జిహెచ్‌ఎంసి, రెవెన్యూ, ఇంజరీరింగ్, శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పటాన్చెరు, అమీన్పూర్ సర్కిల్ పరిదిలోని డివిజన్లో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగత నివేదకలపై చర్చించారు.
ప్రధానంగా మినీ పంక్షన్ హాళ్లు ,ఇండోర్ స్టేడియం ,అంతర్గత మురుగునీటి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. పటాన్చెరు డివిజన్‌లో నిర్మిస్తున్న వార్డు కార్యాలయాన్ని ప్రత్యేకతను పూర్తి చేయాలన్నారు. ముత్తంగి డివిజన్ పరిధిలో పాటి గ్రామంలో వివేకానంద స్టేడియం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.27కోట్లు మంజూరు చేశామని, పనులు ప్రారంభించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించి నిర్దేశిత , గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్లతో ఆధునిక స్లాటర్ హౌస్ (పశువధశాల) నిర్మచబోతున్నట్లు తెలిపారు. నూతన టెక్నాలజీతో నిర్మాణం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో ,ముల్లో ఔట్లు ,అనుమతి లేని నిర్మాణాలు చెరువులు,కుంటల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని , క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించి కబ్జాదారులపై ఉక్కు పాదం మోపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు, జారీ చేశారు. సమావేశంలో పటాన్చెరు డిప్యూటీ కమీషనర్ జ్యోతి రెడ్డి, ఎమార్వో హరిబాబు, రామచంద్రపురం , తహసీల్దార్ సరస్వతి విద్యుత్ శాఖ డీఈ బాస్కర రావు, నీటిపారుదల ఈఈ బీమ్, రామస్వామి, జిహెచ్‌ఎంసి ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, మొదలైనవారు. పాల్గొన్నారు.



## సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధాన్ని నిరసిస్తూ... కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆందోళన

**ప్రజాపక్షం/గజ్వేల్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సిఎం కెసిఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు చేయగా, దీనిని జీర్ణించుకోలేని అహ్మదీపూర్ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిఎం రేవంత్ రెడ్డి బొమ్మను ఊరేగించి దగ్ధం చేశారు. దీంతో ఆగ్రహించిన కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రభాకర్, మల్లేశం, అంజా గౌడ్‌ల ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సోమవారం కెసిఆర్, హరీష్ రావు దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలన అవినీతి అక్రమాలతో సాగగా, తప్పు చేస్తే ఎవరైనా చట్టాలకు అతీతులు కారని నిలదీశారు. ఉద్యమ సమయంలో తెలంగాణ సెంటిమెంటును రగిలించిన కెసిఆర్ కాంట్రాక్టులన్నీ వారికే అప్పగించగా, వచ్చిన కమిషన్లతో కెసిఆర్ కుటుంబం జల్సాలు చేస్తున్నట్లు విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చట్టవిరుద్ధమని తెలిసినప్పటికీ దొంగచాటుగా సొంత అల్లుడితోపాటు ప్రతిపక్ష నేతలు, సినిమా హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసినట్లు గుర్తుచేశారు. ఈ కేసులో సంబంధిత పోలీసు అధికారులు జైలుకెళ్ళగా, సంబంధం ఉన్న కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులకు నోటీసులు జారీ చేస్తే తప్పేమిటని నిలదీశారు. తప్పు చేయకుంటే భయం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మరోసారి ప్రజలను రెచ్చగొడితే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసిన నేతలపై పోలీసు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



## ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యం

నేటి ప్రజావాణికి 16 విన్నపాలు

కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రజావాణి లో వచ్చిన పిర్దాల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అడిషనల్ కలెక్టర్లు మాదురి పాండు లతో కలసి వినతులను స్వీకరించారు. ఈసందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులను పరిశీలించి ఆర్జీ దారుల సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్జీ దారులు ,భూసమ్యలు ఆసరా పెంచన్లు ఇందిరమ్మ, ఇండ్లు తదితర అంశాలతో పాటు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విద్యుత్ ,వ్యవసాయం ,విద్య ఆరోగ్య ఎక్సైజ్, డి డబ్లు, ఓడిడిఎస్ ఓ పశుసంవర్ధక శాఖలకు సంబందించిన పిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబందిత శాఖల అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు వివిధ శాఖల అధికారులు ,రెవెన్యూ డివిజనల్ అదికారులు కలెక్టరేట్ ఏఓ ప్రజలు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అభిలాష అభినవ్ గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఆయా మండలాల వారీగా పుష్కర ఘాట్ల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాసర పుష్కర ఘాట్ వద్దకు పుష్కరాల స్నానాలు ఆచరించే భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పార్కింగ్ ప్రాంతాలలో, పుష్కర ఘాట్‌ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు పట్టిష్ట పోలీసు బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,అదనపు ఎస్పీ ఉపేంద్రా రెడ్డి, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు,మున్సిపల్ కమిషనర్‌లు, తహసీల్దార్‌లు, ఎంపిడిఒలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా,పటిష్ట భద్రత మధ్య నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలకు కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ చేపట్టిన భద్రతా చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,లెక్కింపునకు అవసరమైన సిబ్బందిని ముందుగానే కేటాయించాలని,గదుల్లో సరిపడా ఏర్పాటు చేయాలని సూచించారు.అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సీటింగ్ సదుపాయం కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్,సుందర్ సింగ్,తహసిల్దార్ రాజు ఉన్నారు.

# కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా ముమ్మర ప్రచారం

6,7,8,9,12వార్డుల్లో అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టిన జనం

ఇంటింటికి వెళ్తూ ఆరు గ్యారంటీల వివరణ మహిళల నీరాజనాలు



**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** కాంగ్రెస్‌కే మా ఓటు అంటున్న ఓటర్లు పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ మున్సిపల్ ఎన్నికల రాజకీయం రసత్తరంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా 6,7,8,9,12 వార్డులో హస్తం గాలి బలంగా వీస్తోంది. ప్రత్యర్థులకు సవాల్ విసురతూ విజయం సాధించడమే లక్ష్యంగా ప్రచారాన్ని ఆదృతం చేశారు.

**వీకర్ సెక్షన్‌లో జననీరంజనం .. అభ్యర్థులకు ఘన స్వాగతం**

సోమవారం వీకర్ సెక్షన్‌కాలనీలో కాంగ్రెస్ అభ్యర్థులు ముమ్మరంగా పర్యటించారు. 6వ వార్డు అభ్యర్థి ఐలాపురం , నాగరాజు, 7 వ వార్డు రఘు నాయక్ ,8వ వార్డు బ్యాగరి మల్లేష్, 9వ వార్డు కేతపల్లి స్వామి ,12వ వార్డు ఐలాపురం అనిల్ కుమార్, తమ మద్దతు దారులతో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. కాలనీ మహిళలు అభ్యర్థులకు మంగళహారతులు, తిలకాలు, పెట్టి అపూర్వ స్వాగతం పలికారు. ఈ స్పందన చూసి కార్యకర్తల్లో విజయ ధీమా కనిపిస్తోంది.

**ఆరు గెలుపు గుర్రాలు... పేదలకు ప్రయోజనాలు :** ప్రచారంలో అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రూ. 500లకు గ్యాస్ సిలిండర్, వంటీ హామీలు తక్కువ కాలంలోనే అమలు అవుతునానయని వివరించారు. తమను గెలిపిస్తే వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైనవిగా మార్చుతామని హామిచ్చారు. రాజకీయ విశ్లేషణ కాంగ్రెస్ జెండా ఎగరవచ్చు ప్రజల మద్దతు. అభ్యర్థుల ప్రత్యేక ప్రయత్నాలు చూస్తే 6,7,8,9,12 వార్డుల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని విశ్లేషకులు బావిస్తున్నారు. స్థానిక సమస్యలు తెలుసుకోవడం ప్రజలతో మమేకంగా ఉండటం పార్టీ ప్లస్ అవుతాయని చెబుతున్నారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కుటికెల వెంకటస్వామి చొరవతో రూ.25వేల ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/కేరమేరి :** కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద మహిళకు దాతల సహకారంతో ఆర్థిక సాయం అందించి ఒక విలేకరి తన మానవత్వాన్ని చాటుకున్నారు. కేరమేరి మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీకి చెందిన బొమ్మెన శిరీష గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఆమె తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ప్రజాపక్షం విలేకరి కుటికేల వెంకటస్వామి సామాజిక బాధ్యతగా స్పందించారు. శిరీష పరిస్థితిని వివరిస్తూ దాతల సాయం కోరడంతో పలువురు ఉదారంగా ముందుకు వచ్చారు. అందరి సహకారంతో సేకరించిన రూ.25,000 నగదును వెంకటస్వామి సోమవారం బాధితురాలికి అందజేశారు. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడంలో ఉండే తృప్తి వేరని, తన వంతుగా ఈ చిన్న ప్రయత్నం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆపద సమయంలో స్పందించి ఆర్థిక సాయం అందించిన వెంకటస్వామిని, దాతలను కాలనీ వాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోర్ల శ్రీనివాస్, ఎర్రవార్ ఫోషం, కూటికెల ఆనంద్ రావు, అన్నిశెట్టి రమేష్, స్థానిక యువకులు, బాధితురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సిపిఐ పోరాట ఫలితమే కోటగిరి నూతన బస్టాండ్ నిర్మాణం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సిపిఐ పోరాట ఫలితమే కోటగిరి నూతన బస్టాండ్ నిర్మాణమని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. సోమవారం కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ నలంద స్కూల్‌లో సిపిఐ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి సుధాకర్ హాజరై మాట్లాడారు. సిపిఐ సుధీర్ఘ పోరాట ఫలితమే కోటగిరిలో నూతన బస్టాండ్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. మండల కేంద్రమైనప్పటికీ బస్టాండ్ లేక మహిళలకు టాయిలెట్లు, మరుగుదొడ్లు లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులు మహిళలు నడి రోడ్డుపై నిలబడి బస్సు కోసం వెయిటింగ్ చేసి ఎండనక, వాననక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సిపిఐ సుధీర్ఘ పోరాటాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడి తహసీల్దార్‌కు వినతిపత్రాలు, ధర్నాలు దశలవారిగా నిర్వహించామన్నారు. నూతన బస్టాండ్ నిర్మించటం చాలా సంతోషమైనప్పటికీ బస్టాండ్ నిర్మాణానికి రూ.15 లక్షలతో నిర్మించటం సమంజసం కాదన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి దత్తత తీసుకున్న గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం కనీసం 1000 గజాల స్థలాన్ని తీసుకుని సుమారు 50 లక్షలతో బస్టాండ్ నిర్మిస్తే బాగుంటుందన్నారు. ఇప్పటికైనా కోటగిరిలోని ప్రజాప్రతినిధులు నాయకులు ఆలోచించాలని ఈ విషయంపై దృష్టి పెట్టి బస్టాండ్ నిర్మాణంకు మీరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ఓమయ్య, గంగాధర్, వీరేశం, సునీల్, ప్రసాద్, ముజీప్ పాల్గొన్నారు.

## మహిళలు చిన్నపిల్లల రక్షణే పోలీసుల తొలి ప్రాధాన్యత

జిల్లా ఎస్‌పి నితిక పంత్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలోని మహిళలు, చిన్నపిల్లల రక్షణే పోలీసు శాఖ తొలి ప్రాధాన్యతని జిల్లా ఎస్‌పి నితిక పంత్ తెలిపారు. జిల్లాలో మహిళలు, యువతులు, బాలికలు ఎవరైనా హింసకు గురైతే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని అన్నారు. అన్యాయానికి గురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళలు, చిన్నపిల్లల రక్షణ కోసం షీ టీమ్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీమ్, భరోసా సెంటర్లు నిరంతరం పనిచేస్తున్నాయని వివరించారు. జనవరి నెలలో షీ టీమ్ ద్వారా జిల్లావ్యాప్తంగా 83 హాట్‌స్పాట్ ప్రదేశాలను గుర్తించామని, 24 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెలలో మొత్తం 11 ఫిర్యాదులు రాగా, 3 కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, 7 ఫిర్యాదుల్లో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోగా, ఒకరికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు. వేధింపులకు గురై నేరుగా పోలీసులను సంప్రదించలేని వారు షీ టీమ్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ఆసిఫాబాద్ డివిజన్ షీ టీమ్ నంబర్ 8712670564, కాగజ్ నగర్ డివిజన్ షీ టీమ్ నంబర్ 8712670565 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ నితిక పంత్ స్పష్టం చేశారు.

## జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబందించి పిర్యాదులను స్వీకరించేందుకు సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబందించిన పిర్యాదులను సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్ 8125352721 కు కాల్ చేసి పిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ హెల్ప్ డెస్క్ మున్సిపల్ ఎన్నికలు పూర్తియ్యే వరకు ప్రభుత్వ సెలవు రోజులతో సహా 24 గంటలు ,మూడు షిఫ్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ నిరంతరంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. హెల్ప్ డెస్క్‌కు వచ్చే ప్రతి పిర్యాదును వెంటనే నమోదు చేసి పరిశీలించి ఎన్నికల నిబందనలు ,మార్గదర్శకాల మేరకు సంబందిత అదికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.



## బావ, బావమరుదులు కళ్ళుండి చూడలేని కబోదులు

మెదక్ ఎంపి రఘునందన్ రావు ఎద్దేవా

**ప్రజాపక్షం/గజ్వేల్ :** బావ, బావమరుదులకు మతి చెడిందని, వారు కళ్ళుండి చూడలేని కబోదులైనట్లు మెదక్ ఎంపి రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. సోమవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో అభ్యర్థులు గాడిపల్లి కల్యాణి భాస్కర్, పాల్పనూరి కల్పన ప్రభాకర్ రెడ్డి, ఉప్పల మధుసూదన్, పేర్ల సిద్దేశ్వరి శ్రీనివాస్, రేణుక నాగు ముదిరాజ్, సందీప్‌కుమార్ తదితరులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడాదికన్నా రైల్వేకు 15 శాతం బడ్జెట్ అధికంగా కేటాయించినట్లు తెలిపారు. దీంతో దక్షిణ భారతదేశానికి అధికంగా ప్రయోజనం చేకూర్చుతూ పరిశ్రమల కారిడారుగా ప్రధాని నరేంద్ర మోదీ తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ క్రమంలో 7 సూపర్ ఫాస్ట్ రైల్వేలైన్లు మంజూరి చేస్తుండగా, అందులో తెలంగాణ ప్రాంతానికి మూడు సూపర్ ఫాస్ట్ రైళ్లు కేటాయించినట్లు చెప్పారు. అయినప్పటికీ తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తున్నట్లు మాజీ మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్‌లు విమర్శించడం సిగ్గుచేటన్నారు. గత రెండేళ్ల వ్యవదిలో రాష్ట్రం అప్పుల పాలు కాగా, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో సిఎం రేవంత్ రెడ్డి విఫలమైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు శంకర్ ముదిరాజ్, పట్టణ శాఖ అధ్యక్షులు మనోహర్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

## నిత్యం సాధన చేయాలి.. విజయం సాధించాలి: ఇన్‌చార్జి కలెక్టర్




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై నిత్యం సాధన చేయాలని.. విజయం సాధించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టళ్లలోని పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు ప్రేరణ, అవగాహన తరగతుల కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ లోని ఎస్సీ సంక్షేమ హాస్టల్ లో సోమవారం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులతో ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని స్పష్టం చేశారు. ఇప్పుడు వచ్చిన మార్కులు భవిష్యత్తు చదువులకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించారు. మూడు విషయాలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. గత ప్రశ్నాపత్రాలు కూడా సాధన చేయాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ స్టడీ హావర్ తో పాటుగా సెల్ఫ్ స్టడీ రోజు 3 నుంచి 4 గంటలపాటు చేయాలని సూచించారు. రైటింగ్ కూడా సాధన చేయాలని, వార్షిక పరీక్షల సమయానికి అనుగుణంగా ఇప్పుడు అదే సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సాధన చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, మహేష్ కుమార్, విజయ లక్ష్మి , హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ భవన నిర్మాణానికి పనులు ప్రారంభం

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/ముత్తారం: నిధులు ఉన్న పనులు శూన్యంఅనే వార్త కథనం ఇటీవలే ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురించిన వార్త కథనానికి అధికారులు స్పందించి, పనులు ప్రారంభించారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని అంగన్వాడి మూడో సెంటర్లో గత కొన్ని సంవత్సరాలు క్రితం సుమారుగా 2 లక్షల రూపాయలు నిధులు అంగన్వాడి మరమ్మత్తుల కోసం నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోగా ఈ విషయాన్ని ప్రజాపక్షం దినపత్రిక ముత్తారం మండల విలేకరి ప్రజా పక్షం దినపత్రిక లో ప్రచురించిన వార్త కథనానికి జిల్లా అధికారులు స్పందించి పనులను వెంటనే ప్రారంభించాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం అంగన్వాడి భవన నిర్మాణానికి మరమ్మత్తులు ప్రారంభించారు.అంగన్వాడి కేంద్రంలో పనులు ప్రారంభించక పనులు జాప్యం చేయడం పట్ల ప్రజాపక్షం దినపత్రిక ఇట్టి విషయాన్ని పత్రికలో వార్త కథనం రాసి భవన నిర్మాణానికి మరమ్మతులు చేసేందుకు కృషి చేసిన పత్రిక యాజమాన్యానికి, ముత్తారం మండల విలేకరికి అంగన్వాడి మూడో సెంటర్లోని గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని వినతి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి జిల్లా కేంద్రం లో గౌడ కమ్యూనిటీ హాల్, గౌడ హాస్టల్ కోసం మూడు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని పెద్దపల్లి జిల్లా గౌడ సంఘాల నాయకులు పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకుంట విజయరామణారావు కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా జే ఏ సి నాయకులు రిటైడ్ చిప్ప రాజమౌళి గౌడ్, గోపగోని సారయ్య గౌడ్, బాలసాని వెంకటేశం గౌడ్, సింగం సత్తయ్య గౌడ్ లు మాట్లాడుతూ 2011జనాభా లెక్కల ప్రకారం పెద్దపల్లి జిల్లా జనాభా 7, 95, 332 ఉండగా ఇందులో ప్రదానంగా గౌడ కులానికి చెందిన వారు 80 వేల మంది వరకు ఉన్నారని, ఇందులో చాలా మంది ఇంకా కుల వృత్తినే నమ్ముకొని గీత కార్మికులుగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే గీత కార్మికుల్ల మెజారిటీ జనాభా ఉన్న గౌడ సామాజిక వర్గానికి పెద్దపలి జిల్లా లో ఎక్కడ కూడా ఒక కమ్యూనిటి హాల్ భవనం లేకపోవడం విచారకరం అని అన్నారు. వివాహాది శుభ కార్యాలు నిర్వహించుకోవడానికి అలాగే వివిధ సమస్యలు , అంశాలపై గౌడ కులస్తులు సమావేశాలు నిర్వహించుకోవడానికి కమ్యూనిటి హాల్ అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మల్యాల రాంచంద్రం గౌడ్, పడాల కొమురయ్య గౌడ్,కోల లక్ష్మణ్ గౌడ్, పడాల సతీష్ గౌడ్, అంజి గౌడ్, గుర్రం సదయ్య గౌడ్, కుమార్ గౌడ్, పాల్గొన్నారు.

## సిరిసిల్ల పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు: ఎస్పి మహేష్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజులు (ఫిబ్రవరి 1వ తేది నుండి 28 వరకు) జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్దంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కోరారు.

## న్యూ పోస్టల్ ఫ్రాంచైజీల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/పెద్దపల్లి: పెద్దపల్లి పోస్టల్ డివిజన్ పరిధిలో స్పీడ్ పోస్ట్, పార్సెల్, అంతర్జాతీయ మెయిల్ సేవల బుకింగ్, పికప్, డెలివరీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు భారత పోస్టల్ శాఖ శ్రీకారం చుట్టింది.అధునాతన ఎపిటి 2.0 సాంకేతికత ద్వారా ఈ సేవలను అందించేందుకు కొత్త పోస్టల్ ఫ్రాంచైజీల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పెద్దపల్లి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కె. శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు భారత పోస్టల్ శాఖ అధికారిక వెబ్‌సైట్ indiapost.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనీ తెలిపారు. వయస్సు 18 సంవత్సరాలు పైబడి కనీసం ఇంటర్మీడియట్ (కేవలం డెలివరీ సేవల కోసం అయితే 10వ తరగతి ఉత్తీర్ణత).ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి.ఈ పథకం ద్వారా కమిషన్ ఆధారిత ఆదాయం ప్రోత్సాహకాలు లభిస్తాయి అని వివరించారు.వివరాలకు సమీప పోస్టాఫీస్ గాని లేదా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసు కార్యాలయములో సంప్రదించాలని తెలిపారు.

## హుస్నాబాద్‌ను రాష్ట్రంలోనే అగ్రగామిగా అభివృద్ధి చేస్తా



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హుస్నాబాద్: హుస్నాబాద్‌ను రాష్ట్రంలోనే అగ్రగామిగా అభివృద్ధి చెస్తానని హుస్నాబాద్‌లో జరుగే మున్సిపల్ ఎన్నికల్లో పూర్తిగా 20 వార్డుల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలని తెలంగాణ బిసి, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు ఓటర్లును కోరారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని పలు వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యుర్థులకు మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ మున్సిపాలీటిలో సిసి రోడ్లులు డ్రైనేజీల నిర్మాణాలు, త్రాగునీటి సరఫరా, ఎల్లమ్మ చెరువు సుందరీకర్ణ అభివృద్ధి పనులు కొత్తచెరువు సుందరీకర్ణ అభివృద్ధి పనులు, అర్బన్‌ఫారెస్టు పార్కులాంటి పనులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం అభివృద్ధి చేశామని అన్నారు. 20 వార్డుల్లో అందరిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేయుటకు అవకాశ దొరుకుతుందని అన్నారు. అధికారం ఉన్న పార్టీ అభ్యర్థులను గెలుపొందితే అభివృద్ధికి బాటలు వేసిన వారుఅవుతారని అన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇద్దరమ్మ ఇల్లు, సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు పంపిని అర్‌టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యునీట్ల కరెంటు, రైతు బంధు, రైతు బరోస, మహిళలకు వడ్డిలేని రుణాలు ఇచ్చి మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. హుస్నాబాదును అన్నిరంగల్లో అభివృద్ధి చేసే బాధ్యత నాదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గోన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉన్నత పాఠశాలలో

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విద్యార్థులకు సరిపడు కూరలు చేయనందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిఇఒను ఆదేశించిన కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను కలెక్టర్ సోమవారం అకస్మీకంగా తనిఖీ చేశారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఫార్మాసీ స్టోర్, ల్యాబ్ ఇంజక్షన్ గదులను పరిశీలించారు. లోపల పరిశుభ్రత పాటించాలని రోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ ప్రదర్శించారు. కంటి చూపు సమస్య కొరకు పిహెచ్‌సికి వచ్చిన వృద్దునితో మాట్లాడుతూ దృష్టి లోపం ఎక్కువగా ఉంటే జిజిఎస్‌కి పంపించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు.ఆకుకూరలు బాగా తినాలని, రాగి జావ తాగాలని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని రోగులకు సూచించారు. పిహెచ్‌సి ప్రాంగణంలో చెట్లకు నీరు పోసి శుభ్రం చేయించాలని తెలిపారు. అలాగే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో ఒకే కూర, టమాట పప్పుతో పాటు ఆలుగడ్డ, టమాటకు సరిపడేంత వండలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు హాజరు ప్రకారం వంట చేయాలన్నారు. మీ ఇష్టానుసారంగా వండి పిల్లలకు ఏదో కూరతో తింటారు కాదా అని నిర్లక్ష్యం వహించటం సరికాదని ప్రిన్సిపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు హాజరు ప్రకారం కూరలు సరిపడ వండనందుకు ప్రిన్సిపల్ పై యాక్షన్ తీసుకోవాలని డిఈఓను ఫోన్ ద్వార ఆదేశించారు. కామన్ డైట్ మెను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు సరిపడంత కూరగాయాలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గార్డెన్‌లో కలుపు తీసి రోజు నీరు పెట్టాలని వంట సిబ్బందిని ఆదేశించారు.

## సిఎం సభ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సత్యం



ప్రజాపక్షం/చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో ఈ నెల 5వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా సోమవారం కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి సభాస్థలిని చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సంధర్భంగా సామాన్య ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులందరికీ ప్రాథమిక సామర్థ్యాలు తప్పనిసరి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : విద్యార్థులందరికీ ప్రాథమిక సామర్థ్యాలు తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యాశాఖ అధికారులతో ఎఫ్.ఎల్.ఎన్ అమలుపై జరిగిన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం పై పూర్తి పట్టు ఉండాలని, 3వ తరగతి పూర్తయ్యే నాటికి ప్రతి విద్యార్థి ధారాళంగా చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక గణిత సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. ఎం.ఈ.ఓ లు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి, ఎఫ్.ఎల్.ఎన్ (తొలిమెట్టు) కార్యక్రమం అమలవుతున్న తీరును నిరంతర పర్యవేక్షించాలని, పాఠశాల విద్య లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా వారి సామర్థ్యాలు మేరుగుపడతాయని కలెక్టర్ అన్నారు.విద్యార్థులకు బోధనా ఉపకరణాలు సులభంగా అర్థమయ్యేలా టి.ఎల్.ఎమ్ ను విద్యార్థులు వినియోగించుకోవాలని ,పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయుల చర్యలు తీసుకోవాలి కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకడమిక్ మానిటరింగ్ అధికారి పి ఎం. షేక్ ఎం.ఈ.ఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సెక్రటరీలకు నోటీసులు..

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: గతనెల 21న ప్రజాపక్షందినపత్రికలో రికార్డుల మాయ అనే శీర్షికన వెలువడిన కథనంపై స్పందిన ఎల్లారెడ్డిపేట ఎంపీడీవో సత్తయ్య రాజన్నపేట గ్రామంలో గతరి కార్డుల మాయంపై ఆసమయంలో విధులు నిర్వర్తించిన ఇరువురు సెక్రటరీలకు నోటీసులు జారి చేసినట్లు తెలిసింది.

## కేంద్ర బడ్జెట్ కార్పోరేట్ శక్తులకు అనూకులం

ఎఐవైఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్



ప్రజాపక్షం/హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అది కేవలం కార్పోరేట్ శక్తులకు అనుకూల బడ్జెట్ మాత్రమే కష్టజీవులకు వ్యతిరేఖ బడ్జెట్‌ని ఈ లాంటి బడ్జెట్‌ను అల్ ఇండియా యూత్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తుందని ఎఐ వైఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం అయన హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మా ట్లాడుతూ దేశంలో కోట్లాది నిరుద్యోగ యువత ఎదుర్కోకొంటున్న కఠినమైన వాస్తవాలను దూ రంగా ఉందని అరోపించారు. ఈ బడ్జెట్‌లో నిరుద్యోగ యువతకు ధరల పెరుగుదల అదాయాల క్షీణత వంటి తీవ్రమైన సమస్యలను పరిష్కారించ కుండ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం బాధకరమని అవేదన వ్యక్తం చేశారు. యువత భవిశ్యత్తుకు ఏ లాం టి ప్రణాళికలు లేకుండ కేంద్ర బడ్జెట్ ఎందుకు పెట్టారో వారికే తెలియాలని అన్నారు. సంక్షేమం గాలికి వదిలేసి కొత్త ఉదారత విధానాలతో కేంద్ర ముందుకు పోతుందని అన్నారు. దేశంలో లాక్షలాది మంది కార్మికుల భవిశ్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. ఈ బడడ్జెట్‌లో కార్మికులను రైతులను అణగారిన వర్గాలను పూర్తిగా విస్మరించిందని అరోపించారు. దేశ ప్రజల అర్థిక వాధానాలకు అనుకూలంగా ఉం డాలే తప్ప కార్పోరేట్ శక్తులకు కాకుడదని అ న్నారు. ఈలాంటి ప్రజావ్యతీరేఖ బడ్జెట్‌కు దేశ యువత గళం ఎత్తాలని పిలుపు నిచ్చారు.

## చదువుకో తెలంగాణ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే సత్యం




ప్రజాపక్షం/గంగాధర: ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన మిషన్ 10వ తరగతి అనే పోస్టర్‌ను కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విధ్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన మిషన్ 10వ తరగతి కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రూ.2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ గంగాధర బ్రాంచ్ మేనేజర్ వేముల వాడ అజయ్, సిబ్బంది పోరండ్ల భూపతి, డివో మంత్రి మహేందర్, గోపాలరావుపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, సువీన్ యాదవ్, ఆంజనేయులు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డులకు టార్చిలైట్లు, ఫైబర్ లాఠీలు అందజేత

కృతజ్ఞతలు తెలిపిన ఎఐటియుసి డిపార్ట్మెంట్ కార్యదర్శి రెడ్డి వెంకట్ స్వామి

ప్రజాపక్షం/పెద్దపల్లి: సింగరేణి ఆర్జీ వన్ ఎస్ అండ్ పి సి డిపార్ట్మెంట్‌లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు లకు టార్చిలైట్లు ఫైబర్ లాఠీలు అర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ అందజేశారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అర్జీ వన్ ఎస్ అండ్ పిసి డిపార్ట్మెంట్ కార్యదర్శి రెడ్డి వెంకట్ స్వామి పేర్కొన్నారు. సోమవారం అర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రెడ్డి వెంకట్ స్వామి మాట్లాడుతూ గత కొన్ని నెలల క్రితం అర్జీ వన్ చెక్ పోస్టలలో ఆధునిక వసతులు కల్పించాలని, ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని మరియు సెక్యూరిటీ గార్డు లకు టార్చిలైట్లు ఫైబర్ లాఠీలు, డ్రెస్ మెటీరియల్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేసిన మేరకు యాజమాన్యం స్పందించి వాటిని అమలు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. చెక్‌పోస్టలలో ఫర్నీచర్ ఏర్పాటుతో పాటు సెక్యూరిటీ గార్డులకు టార్చిలైట్లు ఫైబర్ లాఠీలు అందజేసిన అర్జీ వన్ జనరల్ మేనేజర్‌కు ఏఐటియుసి పక్షాన, సిబ్బంది తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి పక్షాన ఎప్పటికప్పుడు ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి దృష్టికి తీసుకెళ్ళిన సందర్భంగా వాటిని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తున్న వీరారెడ్డి కి కూడా సిబ్బంది పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్స్పెక్టర్ లు చంద శ్రీనివాస్, మహ్మద్ అక్బర్ అలీ, జమెదార్లు బి తిరుపతి , మురళి కృష్ణ , బోయిన ఓదెలు ,శ్రీనివాస్,మొండయ్య,కె.సదానందం, ఇంటెలిజెన్స్ టీం రాధాకృష్ణ, మధు, తిరుపతి, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కార్మికులకు ఉరి వేసే విధంగా కేంద్ర బడ్జెట్



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉపాధి కార్మికులకు ఉరి వేసే విధంగా ఉందని ఈ బడ్జెట్ ఉపాధి కార్మికులకు ఏమాత్రము ఉపయోగపడేదిగా లేదని ఏఐటీయూసీ అనుబంధ సంస్థ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గుంటి వేణు అన్నారు. సోమవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవన్ లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సోమ నాగరాజు అధ్యక్షతన జిల్లాస్థాయి వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలోని మోడీ సర్కార్ ఉపాధి హామీ చట్టానికి ఉరేసిందని 125 రోజులకు పని దినాలను పెంచామని గొప్పలకు పోతున్న పనిని ఊడపీకే మొదలు పెట్టిందని విమర్శించారు. కేంద్రం చెప్పినట్టు 125 రోజుల పని దినాలు కల్పించాలంటే 3 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం 95 వేల కోట్లకే పరిమితి చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కేటాయింపులు కూలీల పాత బకాయిలు చెల్లించడానికే సరిపోవు అన్నారు. కేంద్ర నిధుల కొరత తెలంగాణపై స్పష్టంగా కనిపిస్తుందని గత ఏడాది రా ష్ట్రంలో 12:30 కోట్ల పని దినాలు కల్పించగా ఈ ఏడాది కేవలం 7:30 కోట్ల పని దినాలకే పరిమితమైందన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, సంపంగి నరసింహులు, పరశురాములు, సంపత్, కనకయ్య బట్టు వెంకటేష్ సుంకర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి పురపాలకపై అడ్లూరి స్పెషల్ ఫోకస్

గెలుపు గుర్రాలకే టిక్కెట్లు

అసమ్మతి రాగానికి చెక్



ప్రజాపక్షం/ధర్మపురి: ధర్మపురి పురపాలక సంఘం ఎన్నికలపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. తాను అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఏకైక మున్సిపాలిటీ కావడంతో ధర్మపురి బల్దియాపై కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా అందర్నీ సమన్వయం చేస్తూ పావులు కదుపుతున్నారు. ధర్మపురి మున్సిపాలిటీ లో 15 వార్డులుండగా 14,035 మంది ఓటర్లున్నారు. నామినేషన్లు ముగిసి ఉపసంహరణకు మంగళవారం వరకూ గడువున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఒక్కటి రెండుచోట్ల తప్ప అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. పార్టీ టికెట్ ఆశిస్తూ నామినేషన్లు వేసిన అభ్యర్థులను సమావేశపరిచి ఒక్కో వార్డు వారీగా గెలుపు అవకాశాలను వివరిస్తూ రెబల్స్‌కు తావులేకుండా బరిలో నిలిచే అభ్యర్థులను వ్యూహాత్మకంగా ఖరారు చేసినట్లు సమాచారం. గ్రౌండ్ రిపోర్ట్ ఆధారంగా గెలుపు గుర్రాల ఎంపిక జరిగినట్లు చెబుతూ టికెట్లు ఆశించి బంగపడ్డ ఒక్కరిద్దరు సీనియర్ నాయకులకు నామినేటెడ్ పదవులతో సముచిత స్థానం కల్పిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది. కాగా జగిత్యాల జిల్లాలో అయిదు మున్సిపాలిటీలు ఉండగా జిల్లా మంత్రిగా, ఆయా బల్దియాల ఎన్నికల ఇన్చార్జిగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వాటిపై కూడా దృష్టి నిలపాల్సివుండటం మరోవైపు నల్గొండ జిల్లా ఇంచార్జి మంత్రిగా మున్సిపల్ ఎన్నికల్లో అడ్లూరి బిజీబిజీగా ఉండనున్నారు.ఇంటగెలిచి రచ్చ గెలవాలనే సూత్రంగా ధర్మపురి మున్సిపాలిటీలో ఘనవిజయంపై తొలుత దృష్టి నిలిపారు. 2020లో జరిగిన గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య హోరాహోరీగా జరిగిన పోరులో 87 తేడాతో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం, ధర్మపురి టెంపుల్ సిటీ అభివృద్ధికై కంకణబద్ధులై పట్టణానికి అధికనిధులు వెచ్చిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ ఎన్నికల్లో కనీసం12 సీట్లు గెలవాలనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు 15 సీట్లను క్లీన్ స్వీప్ చేసి అడ్లూరికి బహుమతిగా ఇస్తామని స్థానిక నేతలు గంటపథంగా చెబుతున్నారు. కాగా ధర్మపురి మున్సిపల్ చైర్మన్ స్థానం మొదటిసారిగా జనరల్ మహిళకు కేటాయించడంతో బరిలో జిల్లాస్థాయి నాయకులు తమ సతీమణులను పోటీలో నిలపడం ఎన్నికలను మరింత రంజుగా మారుస్తోంది. ధర్మపురి కేంద్రంగా 2027 గోదావరి నది పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో మున్సిపల్ పీఠం అందరినీ ఊరిస్తోంది.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
03-02-2026
www.prajapaksham.in

“ర్యాంప్ వాక్‌లో తళుక్కుమన్న సితార హీరో మహేష్ బాబు కుమార్తె సితార ఘట్టమనేని సోషల్ మీడియాలో ఎప్పుడూ వైరల్ అవుతుంటుంది. జ్యూయలరీ యాడ్స్ చేస్తూ ఉంటుంది. ప్రముఖ జ్యూయలరీ బ్రాండ్‌కు అంబాసిడర్‌గా కూడా పని చేస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో జరుగుతున్న జ్యూయలరీ ఎగ్జి బిషన్‌లో సితార ర్యాంప్ వాక్ చేసింది.”

రీల్

# 6న 'దక్షిణ కాళీ' రిలీజ్



సుబ్బు, ప్రియాంక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'దక్షిణ కాళీ'. హీరోయిన్ అర్చన అమ్మవారి పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రానికి కథను అందించి శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు సత్యవాణి మీసాల. డివోషనల్ కథతో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు తోట కృష్ణ. ఈ సినిమా ఈ నెల 6న తెలుగు, తమిళ, కన్నడలో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ సినిమా సాంగ్స్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ దర్శకుడు వి సముద్ర, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. పాటల విడుదల అనంతరం దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ 'దక్షిణ కాళీ' సినిమా పాటలు, ట్రైలర్ చాలా బాగున్నాయని అన్నారు. ఈ సినిమా కంటెంట్ చూస్తుంటే అమ్మోరు మూవీ గుర్తుకు వస్తోందని అన్నారు. అరుంధతి సినిమాలో సోనూ సూద్ లా ఈ చిత్రంలో విలన్ గా నటించిన ఆజాద్‌కు పేరు రావాలని ఆయన చెప్పారు. దర్శకుడు తోట కృష్ణ మాట్లాడుతూ అమ్మవారి మహిమలు తెలిపేలా దక్షిణ కాళీ చిత్రాన్ని రూపొందించామని అన్నారు. దర్శకత్వంతో పాటు ఓ కీలక పాత్రలో నటించానని తెలిపారు. ప్రేక్షకుల్ని నిరాశపరచకుండా, వాళ్లు కోరుకునే అన్ని అంశాలతో సినిమా ఆకట్టుకుంటుందని ఆయన అన్నారు. నిర్మాత సత్యవాణి మీసాల మాట్లాడుతూ సినిమా నిర్మాణం నుంచి రిలీజ్ దాకా అమ్మవారే మమ్మల్ని నడిపిస్తూ వచ్చారని అన్నారు. నటుడు ఆజాద్ పాల్గొన్నారు.


# 'ది ఇండియా హౌస్'తో తెలుగులో శాశ్వత్ సచ్‌దేవ్



నిఖిల్ సిద్ధార్థ ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా చిత్రం 'ది ఇండియా హౌస్' షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని వి మెగా పిక్చర్స్‌తో కలిసి ది కాశ్మీర్ ఫైల్స్, కార్తికేయ 2 వంటి విజయవంతమైన చిత్రాలని అందించిన అభిషేక్ అగర్వాల్ ఆరట్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సమర్పిస్తున్నారు. సాయి మంజ్రేకర్ కథానాయిక. అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి రామ్ వంశీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ధురంధర్, ఉరి: ది సర్జికల్ స్ట్రైక్ , ఆర్టికల్ 370 చిత్రాలతో పాపులరైన బాలీవుడ్ స్టార్ కంపోజర్ శాశ్వత్ సచ్‌దేవ్ 'ది ఇండియా హౌస్'తో తెలుగులోకి అడుగుపెడుతున్నారని అభిషేక్ అగర్వాల్ ప్రకటించారు. ఆయన ఇప్పటికే ఐదు ఆకట్టుకునే ట్రాక్‌లను కంపోజ్ చేశారు. పాటల చిత్రీకరణ అద్భుతంగా వచ్చింది అని అన్నారు.1905 నాటి రాజకీయ నేపథ్యంలో రూపొందుతున్న 'ది ఇండియా హౌస్' విప్లవం, ప్రేమ, త్యాగం వంటి భావోద్వేగాలతో అద్భుతంగా ఉండబోతుంది. బాహుబలి,ఆర్ ఆర్ ఆర్ ఫేం సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ డీవోపీగా పని చేస్తున్నారు. విశాల్ అబానీ ప్రొడక్షన్ డిజైనర్. దంగల్, బజరంగీ భాయిజాన్,పీకే చిత్రాలకు ప్రసిద్ధి చెందిన ముఖేష్ ఛబ్రా కాస్టింగ్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు.

# దూసుకెళ్తున్న 'రణబాలి' గ్లింప్స్

15 మిలియన్ ప్లస్ వ్యూ




విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న క్రేజీ మూవీ 'రణబాలి'. ఈ సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 'రణబాలి' సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ రిలీజ్ కు రాబోతోంది. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే 15 మిలియన్ ప్లస్ వ్యూస్ తో 'రణబాలి' టైటిల్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా సాధించబోయే సక్సెస్ కు టైటిల్ గ్లింప్స్ కు వస్తున్న స్పందనే ఫస్ట్ స్టెప్ గా మూవీ టీమ్ భావిస్తోంది.ఈ సినిమా గ్లింప్స్ లో రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించిన తీరు మెస్మరైజ్ చేసింది. దర్శకుడు రాహుల్ సంకృత్యన్ ఎంచుకున్న కథా నేపథ్యం, ప్యాషనేట్ మేకింగ్, మైత్రీ మూవీ మేకర్స్ భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ టైటిల్ గ్లింప్స్ కు హైలైట్ గా నిలిచాయి. జయమ్మగా రశ్మిక మందన్న ఆకర్షిస్తోంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికికో ప్రొడ్యూసర్స్ అనురాగ్ పర్వతనేని, శివ్ చనన, సంగీతం అజయ్ అతుల్, డీవోపీ నీరవ్ షా, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్,చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చెంబోలు సాయి ఆదిత్య, కొరియోగ్రఫీ కృతి మహేశ్,ఆర్ట్ డైరెక్టర్ విఠల్ కోసనం, యాక్షన్ కొరియోగ్రాఫర్స్ యెన్నిక్ బెన్, ఆండీ లాంగ్ గ్యుయెన్, రాబిన్ సుబ్బు.

# ఒక వస్తువుని శోధించి సాధించే వ్యక్తి జీవితం 'హనీ'



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓ వీ ఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాలతో రూపొందిన 'హనీ' ఫిబ్రవరి 6న థియేటర్ లో రిలీజ్ అవుతుంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలోడైరెక్టర్ కరుణ కుమార్ మాట్లాడుతూ సాహిత్యం కోసం చీకటి అనే కథ రాశాను. దాన్ని సినిమా తీద్దామని మా నిర్మాతలు వచ్చారు. మదనపల్లి, పాతబస్తీ, ఒకే ఇంట్లో కొందరు ఉరి వేసుకోవడం ఇలాంటి ఘటనలు చూస్తుంటాం. హనీ సినిమాలో పిల్లి మాయ అనే ఒక వస్తువుని శోధించి సాధించే ఒక వ్యక్తి జీవితం చూపించాం. మెదడు అంతా చీకటి ఉన్నా మనసుల మధ్య జరిగిన ఒక కథ. నిజ జీవిత సంఘటన నుంచి స్ఫూర్తిగా తీసుకుని సినిమా చేయడం జరిగింది. మనిషి మెదడు కంటే పెద్ద దయ్యం లేదనేది ఈ సినిమా సారాంశం. కొత్త కథలు చేయడానికి ఎప్పుడూ ముందుండే నవీన్ చంద్ర ఈ సినిమా కథ చెప్పిన వెంటనే ఒప్పుకున్నారు. ఇందులో ఎప్పుడు చూడని నవీన్ చంద్రని చూడబోతున్నారు. అలాగే రాజా రవీందర్ పాత్ర కూడా చాలా కొత్తగా ఉంటుంది. అలాగే దివి, దివ్య అందరు కూడా ఒకరికి మించి ఒకరు చేశారు. మా టెక్నికల్ టీం కూడా చాలా సపోర్ట్ చేసింది. ఇలాంటి కాన్సెప్ట్ ఇప్పటివరకు ఇండియన్ సినిమాలో రాలేదు. అది సైకలాజికల్ హారర్ ఈ సినిమా మిమ్మల్ని వెంటాడుతుంది. ఇది అందరికీ చెప్పాల్సిన కథ. సినిమా ఒకరి జీవితాన్ని మార్చలేదు, అలాగే సందేశాన్ని కూడా ఇవ్వలేదు. కానీ ఒక తప్పు జరుగుతున్నప్పుడు దాన్ని టార్చి వేసి చూపించగలదు. నేను కూడా అదే చేశానని నమ్ముతున్నాను. ఇంటర్నేషనల్ క్వాలిటీతో చేశాం. ఈ సినిమాకి ప్రేక్షకులు ఊపిరి పోయాలని కోరుకుంటున్నాను. ఫిబ్రవరి 6వ తేదీన సినిమా విడుదల అవుతోంది అని అని అన్నారు.హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ ఇది మౌత్ టాక్ తో నిలబడే సినిమా. ఫిబ్రవరి 6న ఒకసారి థియేటర్ కి రండి. ఇది థియేటర్ కి చాలా బాగుంటుంది. దివి చాలా అద్భుతమైన నటి. తను తప్పకుండా పెద్ద స్టార్ అవుతుంది. దివ్య కూడా చాలా చక్కగా నటించింది. ఇది ఆలోచన రేకెత్తించే సినిమా. డివోపి మ్యూజిక్ డైరెక్టర్ అద్భుతమైన వర్క్ ఇచ్చారు. ఇందులో ఉన్న పాప కూడా చాలా చక్కగా నటించింది. మట్కా సినిమా సమయంలో కరుణ కుమార్ తో చాలా దగ్గర అయ్యాను. ఈ కథకు ఆయన నన్ను ఎంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఆయన నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను. ఈ సమాజంలో ఆశ కోసం ప్రజలు ఏవేవో చేస్తున్నారు. ఇందులో ఒక డార్క్ సొసైటీని చూపించాము. ఈ సినిమా షూటింగ్లో ఒక సంఘటన జరిగింది. ఈ క్యారెక్టర్ ప్రభావం వల్ల ఒక వ్యక్తితో నేను దురుసుగా ప్రవర్తించాను. ఆ క్యారెక్టర్ అలా ప్రవర్తించింది. తప్పకుండా ఫిబ్రవరి 6న ఈ సినిమాని అందరూ థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ ఈవెంట్ లో నటుడు రాజా రవీంద్ర, హీరోయిన్ దివి, హీరోయిన్ దివ్య పిళ్లై పాల్గొన్నారు.

# 100 మిలియన్ ప్లస్ తో 'శంబాల'




ఆది సాయికుమా ర్ నటించిన సూ పర్ హిట్ మూవీ 'శంబాల' ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు వచ్చి అద్భుత ఆదరణ సొంతం చేసుకుంటోంది. గత నెల 22వ తేదీ నుంచి ఆహాలో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సినిమా 100 మిలియన్ మినిట్స్ ప్లస్ వ్యూయర్ షిప్ తో బ్లాక్ బస్టర్ సక్సెస్ దక్కించుకుంటోంది. గతేడాది డిసెంబర్ 25న 'శంబాల' సినిమా మిస్టికల్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో ప్రేక్షకులు ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని దర్శకుడు యుగంధర్ ముని రూపొందించారు. అర్చన ఐయ్యర్ హీరోయిన్ గా నటించింది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద ఈ మూవీని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు సంయుక్తంగా నిర్మించారు. ఈ మూవీకి ప్రవీణ్ కె బంగారి విజువల్స్, శ్రీ చరణ్ పాకాల ఆర్ఆర్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. థియేటర్స్ లో సాధించిన విజయాన్ని మరిపించేలా ఆహా ఓటీటీలో శంబాల సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తుండటం విశేషం అని నిర్మాతల్లో ఒకరైన మహీధర్ రెడ్డి చెప్పారు

# బరాబర్ ప్రేమిస్తా'తో చంద్రహాస్‌కు మంచి బ్రేక్



ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ హీరోగా సంపత్ రుద్ర తెరకెక్కించిన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘన ముఖర్జీ హీరోయిన్‌గా నటించారు. అర్జున్ మహీ ('ఇష్టంగా' ఫేమ్) ప్రతినాయకుడిగా నటించారు. ఈ మూవీని ఫిబ్రవరి 6న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు జయంత్ సి పరాన్జీ, జేడీ చక్రవర్తి, ఆది సాయి కుమార్ వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో హీరో చంద్రహాస్ మాట్లాడుతూ .. 'జయంత్ తీసిన 'తీన్ మార్', 'శంకర్ దాదా' చిత్రాలంటే నాకు చాలా ఇష్టం. ఆది అన్న అద్భుతమైన కమ్ బ్యాక్ ఇచ్చారు. ఆది అన్నే నాకు స్ఫూర్తి. జేడీ చక్రవర్తి అప్పటికీ ఇప్పటికీ ఒకేలా ఉన్నారు. నాకోసం ఇంత మంది రావడం ఆనందంగా ఉంది. ఫిబ్రవరి 6న మా చిత్రాన్ని చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు.ఆది సాయి కుమార్ మాట్లాడుతూ .. 'ప్రభాకర్ అన్నతో నేను 'నెక్స్ట నువ్వే' మూవీని చేశాను. అప్పుడు నాకు చంద్రహాస్ గురించి ఎక్కువగా చెబుతుండే వారు. చంద్రహాస్ పడే కష్టాన్ని చూస్తున్నాను. ఎంతో నిజాయితీగా కష్టపడుతున్నాడు. చంద్రహాస్ మంచి హిట్టు కొట్టాలని అనుకుంటున్నాను. 'బరాబర్ ప్రేమిస్తా' సినిమాతో చంద్రహాస్‌కు మంచి బ్రేక్ రావాలని కోరుకుంటున్నాను అని అ న్నారు. జయంత్ సి పరాన్జీ మా ట్లాడుతూ ''బరాబర్ ప్రేమి స్తా' అనే టైటిల్ లో నే యాటిట్యూడ కా న్ఫిడెన్స్, పొగరు ఉంది. మన చంద్రహాస్ ఆటిట్యూడ్ స్టార్. చంద్రహాస్ మంచి సింగర్ కూడా. మేఘనలోనూ మంచి ఎనర్జీ, ఆటిట్యూడ్ ఉంది. జేడీ చక్రవర్తి మాట్లాడుతూ .. 'చంద్రహాస్ ఏం చేసినా జనాల్ని అట్రాక్ట్ చేస్తుంటాడు. కానిస్టేబుల్‌గా ప్రభాకర్ తన జీవితం ప్రారంభించి.. బుల్లితెరపై స్టార్‌గా ఎదిగాడు.టీం అందరికీ ఆల్ ది బెస్ట్. ఫిబ్రవరి 6న ఈ సినిమాని అం దరూ చూడండి' అని అన్నారు. నిర్మాత ప్రభాకర్, సంపత్ రుద్ర, మేఘన ముఖర్జీ, నటుడు అర్జున్ మ హీ, పూజా బేడి , నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి , మ్యూజిక్ డైరెక్టర్ ధృవన్ పాల్గొన్నారు.





## ఐక్యంగా నిలుద్దాం...

# మతోన్మాద శక్తులను తరిమికొడదాం

**సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపు**

**డిఎంకె ఫ్రంట్‌ను ఏశక్తీ విడదీయలేదు: స్టాలిన్**

**చెన్నైలో ఘనంగా సిపిఐ శతాబ్ది సభ**



**చెన్నై:** కేంద్రంలో అధికారం చలాయిస్తున్న మతోన్మాద శక్తులతో దేశ ఐక్యతకు విఘాతం కలుగుతోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద శక్తులపై పోరాటానికి దేశవ్యాప్తంగా లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. చెన్నైలో ఆదివారం జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల శక్తివంతమైన సమ్మేళనానికి వేదికైంది. సభకు పెద్ద ఎత్తున సిపిఐ శ్రేణులతోపాటు తమిళనాట డిఎంకె నేతృత్వంలోని అధికార కూటమి పక్షాల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. సభనుద్దేశించి రాజా మాట్లాడుతూ... సిపిఐ 100 సంవత్సరాలు అంటే ప్రజల కోసం రాజీలేని పోరాటాల 100 సంవత్సరాలని పేర్కొన్నారు. ఎర్రజెండా నూతన శక్తి, ఐక్యత, విశ్వాసంతో ముందుకు సాగుతోందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తొత్తుగా మారిందని దుయ్యబట్టారు. బిజెపి ఫాసిస్టు విధానాలపై సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్య తర్వాత దేశ ప్రజల కోసం రాజకీయపార్టీగా సిపిఐ ఉద్యమాలు, పోరాటాలను ప్రస్తావించారు. డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ మాట్లాడుతూ... తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని ఫ్రంట్ ఐక్యతను ఏ శక్తి విచ్ఛిన్నం చేయలేదని, ఫాసిజాన్ని ఓడించడానికి, నిరంకుశ పాలనను కూల్చివేసి, భారతదేశాన్ని, ఆత్మగౌరవనీయ తమిళనాడును రక్షించడానికి ఈ రాజకీయ ఫ్రంట్‌కు మాత్రమే శక్తి ఉందన్నారు. తాను నాయకత్వం వహించే కూటమి ఎన్నికల అంకగణితంలో కాకుండా ఉమ్మడి ఆదర్శాలలో పాతుకుపోయిందన్నారు. కూటమి పక్షాలు కులతత్వం, మతతత్వం, మెజారిటీవాదం, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలుస్తాయి కాబట్టి ప్రజాస్వామ్య శక్తుల మధ్య స్నేహం ఎన్నికను అధిగమిస్తుందని పునరుద్ఘాటించారు. ద్రవిడ ఉద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం ప్రజలందరికీ అన్నీ లభించేలా చూసుకోవడం అనే ఉమ్మడి లక్ష్యాన్ని పంచుకుంటాయి కనుక డిఎంకె జెండాలో సగం ఎరుపు రంగులో ఉందని స్టాలిన్ అన్నారు. 'మన రాజకీయ విధానాలలో చిన్న భేదాలు ఉన్నప్పటికీ, మన ఉమ్మడి లక్ష్యం సమతావాద సమాజాన్ని సృష్టించడం' అన్నారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు రామకష్ణ పాండా, డికె అధ్యక్షుడు కె.వీరమణి, సిపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్, సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం, టిఎన్‌సిసి అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై, విసికె అధ్యక్షుడు తోల్. తిరుమావలవన్, ఎండిఎంకె ప్రధాన కార్యదర్శి వైకో, ఎంఎంకె నాయకుడు ఎం.హెచ్.జవహిరుల్లా, సిపిఐ ఎంపి కె.సుబ్బరాయన్ తదితరులు ప్రసంగించారు.

## నిజమో కాదో తేల్చుకుంటాం

**(మొదటి పేజీ తరువాయి)** ప్రయాణ దూరంలోనే ఇవన్నీ ఉన్నాయని కూడా ఆయన చెప్పారని ఎన్‌బిసి న్యూస్ వెల్లడించింది. గత ఏడాది తొలి అర్థభాగంలో ఇరాన్–అమెరికా మధ్య అణు చర్చలు జరిగాయి. ఐదు విడతల చర్చల్లో ఎలాంటి ఒప్పందం కుదరలేదు. 'ఖమేనీ అలాగే మాట్లాడతారు, వారితో ఒప్పందం కుదురుతుందని మేం ఆశాభావంతో ఉన్నాం, రాబోయే కొన్ని గంటల్లోనే ఈ వ్యవహారం తేలిపోతుంది, ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఖమేనీ చెప్పిన విషయం (ఇరాన్‌పై దాడి ప్రాంతీయ యుద్ధంగా మారుతుందిఅనే విషయం) నిజమో కాదో తేల్చుకుంటాం'' అన్నారు. ముందురోజు ఆదివారం ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరీఘ్చి సిఎన్‌ఎన్‌తో మాట్లాడుతూ, అమెరికా–ఇరాన్ మధ్య ఒక ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావం ప్రకటించారు. ఇరాన్‌లో అనేక వారాలపాటు అంతర్గత సంక్షోభం తర్వాత దేశంలో స్థిరత్వం ఏర్పడిందనే సంకేతాలు పంపించేందుకు చాలా రోజుల తర్వాత ఖమేనీ మొదటిసారి ఆదివారంనాడు బాహ్య ప్రపంచానికి కనిపించారు.'ఇరాన్‌పై దాడికి ట్రంప్ ఆదేశాలు జారీ చేస్తే తాము ముందుగా ఇజ్రాయెల్‌పై దాడి చేస్తాం, పశ్చిమ ఆసియాలో ఉన్న అమెరికా సైనిక ఆస్తులు,స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడతాం' అని ఖమేనీ పేర్కొన్నారు. ఈసారి అమెరికా యుద్ధం ప్రారంభిస్తే అది ప్రాంతీయ యుద్ధంగా మారుతుందని అమెరికన్లకు బాగా తెలుసు' అని ఖమేనీ చాలా అరుదైన హెచ్చరిక చేశారు. ఈ పరిస్థితులమధ్య హోర్ముజ్ జలసంధి వద్ద ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రత్యక్ష సైనిక, కాల్పుల విన్యాసాలు చేస్తాయని ప్రకటించారు.

**ఇయు దౌత్యవేత్తకు ఇరాన్ నిరసన :** ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)ని ఉగ్రవాద సంస్థగా పేర్కొంటూ యూరోపియన్ యూనియన్ తీర్మానం చేయడాన్ని ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇరాన్ ప్రభుత్వం సోమవారం టెహ్రాన్‌లో ఉన్న యూరోపియన్ దౌత్యవేత్తను పిలిపించి తీవ్ర నిరసన తెలియజేసింది. గతవారం యూరోపియన్ యూనియన్ ఐఆర్‌జిసిపై ఉగ్రవాద సంస్థ ముద్ర వేసేందుకు అంగీకరించింది. అమెరికా, కెనడాలు ఇప్పటికే ఐఆర్‌జిసిపై ఉగ్రవాద ముద్ర వేశాయి. ఇరాన్‌పై పాశ్చాత్య దేశాలు ఆర్థిక,సైనిక ఆంక్షలతో సమస్యలు సృష్టిస్తున్నాయి. ఇప్పుడు ఉగ్రవాద ముద్ర సైన్యంపై కూడా వేశాయి. దుబాయ్‌లో ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ దౌత్యవేత్త ఇస్మాయిల్ బఘాయ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, యూరప్ దేశాల దౌత్యవేత్తలను ఒక్కొక్కరినీ పిలిపించి తమ నిరసన తెలియజేయడం ప్రారంభించామన్నారు.

## ఇక 2 గంటలే (మొదటి పేజీ తరువాయి)

సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో పాటు ఇతర ఉన్నతాధికారులు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి హాజరయ్యారు. మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ 200914 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సగటున ఏడాదికి కేవలం రూ.886 కోట్లు మాత్రమే రైల్వే బడ్జెట్‌గా కేటాయించారని గుర్తు చేశారు. దానితో పోలిస్తే ప్రస్తుతం తెలంగాణకు దాదాపు ఆరు రెట్లు అధికంగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రూ.47,984 కోట్ల విలువైన రైల్వే మౌలిక వసతుల ప్రాజెక్టులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని మంత్రి చెప్పారు. అలాగే రాష్ట్రంలోని రైల్వే నెట్‌వర్క్ పూర్తిగా (100 శాతం) విద్యుదీకరణ పూర్తయిందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించగా, వాటిలో మూడు హైదరాబాద్ నుంచి ప్రారంభమయ్యే లేదా ముగిసేలా ఉంటాయని మంత్రి తెలిపారు. హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌పుణె హైస్పీడ్ రైలు కారిడార్లు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. ఈ కారిడార్లతో హైదరాబాద్ బెంగళూరు ప్రయాణ సమయం కేవలం 2 గంటలకు, హైదరాబాద్ చెన్నై 2 గంటల 55 నిమిషాలకు, హైదరాబాద్ పుణె 1 గంట 55 నిమిషాలకు తగ్గనుందని వివరించారు. ఈ మూడు మార్గాలు త్రిభుజాకార ఆర్థిక కారిడార్‌గా రూపుదిద్దుకుని విద్య, వైద్యం, వ్యాపారం, పరిశ్రమల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. రైల్వే రంగంలో ఈ భారీ పెట్టుబడులు తెలంగాణను అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక, ఆర్థిక కేంద్రంగా మరింత బలోపేతం చేస్తాయని మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

# మార్పు చూపించాం

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి అన్ని రంగాలలోనూ మరీ ముఖ్యంగా ఆర్థికరంగంలో పెను సంక్షోభమని ఈ పరిస్థితుల్లో ఉండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒక్కోమెట్టు పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతున్నాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయన్నారు. ఈ మార్పులను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్దేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ అండ్ పిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌ఓ జి. మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డిఎస్ జగన్ , జాయింట్ డైరెక్టర్ రమణ తదితర అధికారులు పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com